

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 327

శుక్రవారం 17-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 17-2-2023



ఈ స్టైల్‌కి ప్రత్యేక ఎంపికలు అవసరం లేదు. మిక్స్ అండ్ మ్యాచ్‌కే మొదటి ప్రాధాన్యత.
ఆభరణాల ఎంపికకు అసలు పోటీ అక్కర్లేదు.
పూసలు, సిల్వర్, ఉడ్ జ్యువెల్రీ ఏదైనా సెలక్షన్ మహా ఈజీ.
ఎవరికి వారు తమకంటూ ఓ స్పెషల్ లుక్‌ను క్రియేట్ చేసుకునే సౌలభ్యం ఈ స్టైల్ సొంతం.
అందుకే, కాలాలతో పనిలేకుండా యూత్‌ని అమితంగా ఆకట్టుకుంటున్న
మోడర్న్ బోహో-చిక్ స్టైల్ ఇది.

యువతను అమితంగా ఆకట్టుకునే వాటిలో బోహేమియన్ స్టైల్ ఎప్పుడూ ముందుంటుంది. ఇది ఫ్రెంచ్ నుంచి వచ్చిన శైలిగా చెబుతుంటారు. ఇది గిరిజన జీవన శైలి కి దగ్గరగా ఉండటం, మనసులను ఉల్లాసంగా ఉంచడంతోపాటు చాలా బాగా అట్రాక్ట్ చేస్తుంటుంది. గతంలో పాప్, ర్యాప్ ఈవెంట్లలో బోహో-చిక్ ఫ్యాషన్ శైలి దుస్తులను ధరించేవారు. ఇప్పుడు మోడర్న్ స్టైల్‌ను అనుసరిస్తూ జీన్స్‌తో, పలాజోలతో ఇక్కత్ ఫైస్లీ బ్లౌజులు, బటన్ డౌన్ టాప్స్, ఖఫ్తాన్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటి మీదకు ట్రైబల్ జ్యువెలరీ లేదా ఫ్యాషన్ జ్యువెలరీ మరింత ఆధునిక హంగులతో మది దోచుకుంటున్నాయి.

సెలక్షన్ స్టైల్







ఆధ్యాత్మిక శోభ

రుద్రాక్ష పేరు తలిస్తేనే మనసులో ఆధ్యాత్మిక సౌరభం నిండిపోతుంది. అందుకే, రుద్రాక్ష ఆభరణాలకూ శోభను చేకూర్చుతుంది. ప్రత్యేక పర్వదినాల్లో ధరించడానికి అనువుగా కొందరు బంగారు, వెండి మాలలుగా తయారు చేయించుకుంటారు. ఫ్యాషన్ ఆభరణాలలోనూ రుద్రాక్ష తనదైన వైవిధ్యాన్ని చూపుతుంది. నేడు వీటిని యువత కూడా తమదైన స్టైల్‌లో ధరించడానికి ఉత్సాహపడుతున్నారు.









● మిర్రర్

న్యాయం కోసం రణం

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బాధితుల న్యాయపోరాటం, పోరాటం చేసే క్రమంలో పడుతున్న కష్టాలు... అయినప్పటికీ వెనకడుగు వేయని పట్టుదలకు 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ అద్దం పడుతుంది. ఝార్ఖండ్‌లోని ఒక గ్రామంలో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా నిషా పహుజా తీసిన ఈ చిత్రం టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నుంచి పామ్ స్ప్రింగ్స్ ఫిల్మ్ ఫెస్టివల్(2023) వరకు 'బెస్ట్ డాక్యుమెంటరీ'గా ప్రశంసలు అందుకుంటూనే ఉంది...

పదమూడు సంవత్సరాల తన కూతురిని ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేశారని పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడు రంజిత్ అనే రైతు. పోలీసుల స్పందన అంతంతమాత్రంగానే ఉంటుంది. ఇక చుట్టాలు, పక్కాలు, గ్రామస్థుల విషయానికి వస్తే...

'జరిగిందేదో జరిగింది. పోయేది మీ కుటుంబ పరువే. కేసు వెనక్కి తీసుకోండి'

'మీ సంగతి ఏమిటోగానీ మన కులం పరువు పోయేట్లు ఉంది. కేసు వెనక్కి తీసుకోండి'

'మన జాగ్రత్తలో మనం ఉండకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతాయి. వారిని మనం ఏం చేయలేము. కేసు వెనక్కి తీసుకోండి'

ఎవరు ఎలా స్పందించినా, ఆ స్పందనలో చివర గట్టిగా వినిపించే మాట... కేసు వెనక్కి తీసుకోండి.

అయితే



'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీలో ఓ దృశ్యం

రంజిత్ వీరి ఉచిత సలహాలను పట్టించుకోలేదు. పోరాటదారిని వదలలేదు. ఈలోపు బెదిరింపులు పెరిగాయి. 'కేసు ఉపసంహరించుకుంటావా లేదా?' అని గ్రామస్థుల నుంచి ఒత్తిడి పెరిగింది. రంజిత్ చేస్తున్న న్యాయపోరాటానికి శ్రీజన ఫౌండేషన్ అండగా నిలిచింది. మహిళల హక్కుల గురించి పనిచేస్తున్న స్వచ్ఛందసంస్థ ఇది. స్థూలంగా చెప్పాలంటే 'టు కిల్ ఏ టైగర్' అనే డాక్యుమెంటరీ కథ ఇది.

అయితే ఇది కాల్పనిక కథ కాదు.

ఝార్ఖండ్‌లోని బెరో జిల్లాలో జరిగిన వాస్తవ సంఘటనల సమాహారం.



నిషా పహుజా
దర్శకురాలు

డైరెక్టర్, రైటర్ నిషా పహుజా 'టు కిల్ ఏ టైగర్' రూపకర్త.

కెనడియన్ ఫిల్మ్‌మేకర్‌గా గుర్తింపు పొందిన నిషా దిల్లీలో పుట్టింది. కెనడాలోని టోరంటోలో పెరిగింది.

చిన్నవయసులోనే తల్లిదండ్రులతోపాటు కెనడాకు వెళ్లిన నిషా తన భారతీయ మూలాలను ఎప్పుడూ మరచిపోలేదు. బాలీవుడ్ సినిమాలు చూస్తూనే పెరిగింది.

'యూనివర్శిటీ ఆఫ్ టోరంటో'లో ఇంగ్లీష్ సాహిత్యాన్ని చదువుకున్న నిషా రకరకాల సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటోంది. డాక్యుమెంటరీ రీసెర్చర్‌గా పేరు తెచ్చుకుంది.

కాలేజీ రోజుల నుంచే నిషాకు రచన, దర్శకత్వం అనేవి ఇష్టమైన సబ్జెక్ట్‌లు.

కెరీర్ ప్రారంభంలో రీసెర్చర్‌గా కెనడియన్ ఫిల్మ్ మేకర్స్ జాన్ వాకర్, అల్ కజిమ్‌లతో కలిసి పనిచేసిన నిషా చిత్ర నిర్మాణంపై కొంత అవగాహన, అనుభవం వచ్చాక డైరెక్టర్‌గా అడుగులు వేసింది. తక్కువ కాలంలో డాక్యుమెంటరీ ఫిల్మ్ డైరెక్టర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

కమర్షియల్ డైరెక్టర్‌గా రాణించాలనేది ఆమె కల కాదు. వాస్తవ సంఘటనలనే చిత్రాలుగా తీయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 'చిత్రం ఎంత వాస్తవికంగా ఉంటే ప్రేక్షకులు అంతగా కనెక్ట్ అవుతారు' అంటుంది నిషా.

2012లో వచ్చిన 'ది వరల్డ్ బిఫోర్ హర్' డాక్యుమెంటరీ ఆమెలో రచన, దర్శకప్రతిభను ప్రపంచం దృష్టికి వచ్చేలా చేసింది. భారతీయ సమాజానికి చెందిన అమ్మాయిల జీవితంలో సంక్లిష్టతలు, వైరుధ్యాలను ఆధారంగా చేసుకొని తీసిన ఈ డాక్యుమెంటరీ వివాదాస్పదం కావడంతో పాటు ఎంతో చర్చను రేకెత్తించింది.

ఇక 'టు కిల్ ఏ టైగర్' విషయానికి వస్తే మొదట ఈ చిత్రాన్ని తీయాలనుకోలేదు నిషా. ఝార్ఖండ్‌లోని ఒక స్వచ్ఛందసంస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి చిత్రం చేయాలని రంగంలోకి దిగినప్పుడు 13 సంవత్సరాల అమ్మాయి అత్యాచారానికి గురైన సంఘటన గురించి విన్నది. బాధితురాలు, ఆమె తండ్రితో మాట్లాడింది. మొదట తాను తీస్తున్న చిత్రంలో భాగంగానే బాధితురాలి గురించి చెప్పాలనుకుంది. అయితే ఆ తరువాత మాత్రం ఈ సంఘటననే చిత్రంగా తీయాలని నిర్ణయించుకుంది.

టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్ నుంచి (హాట్ డాక్స్) కెనడియన్ ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫెస్టివల్ వరకు ఎక్కడో ఒకచోట 'టు కిల్ ఏ టైగర్' గురించి ప్రస్తావన, ప్రశంస వినిపిస్తూనే ఉంది. ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తూనే ఉంది.

ఇంటిప్స్

- తీపిని ఇష్టపడని పిల్లలు ఉండరంటే అతిశయోక్తి కాదు. కొంతమంది పిల్లలకు చక్కెరతో చేసిన స్వీట్ తింటే వెంటనే జలుబు, దగ్గు సమస్యలు వస్తుంటాయి. అలాంటప్పుడు తేనె వాడడం మంచిది. చక్కెరచక్కటి ప్రత్యామ్నాయం తేనె. ఇది సహజమైనది కాబట్టి ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్‌ఉండవు. త్వరగా శక్తినిస్తుంది.



- తేనె కొద్ది నెలలకు చిక్కబడుతుంది. అప్పుడు సీసాను పది నిమిషాల సేపుఎండలో ఉంచితే తిరిగి పలచబడుతుంది. చిక్కబడకపోయినా సరే కనీసం ఏడాదిలోఒకసారి అయినా అరగంట సేపు ఎండలోఉంచాలి. బాటిల్ అడుగున ఉండిపోయినతేనెను బయటకు తీయాలన్నా కూడా ఇదే పద్ధతి. తేనెను ఎప్పుడు కూడా మంటమీద వేడి చేయకూడదు.
- వంటల్లో తేనె వాడేటప్పుడు కూడా పూర్తయి దించిన తర్వాత తేనె వేసి కలపాలి.

వంటిల్లు

పండంటి ఆహారం

రేపే శివరాత్రి!
రోజంతా ఉపవసించాలి... నీరసించకూడదు.
వండ వద్దు... ఎండకు డస్సిపోనూ వద్దు.
పండంటి ఆహారంతో శక్తిని పుంజుకోవచ్చేమో!
వంటకు నిషేధం... పండ్లకు ఆహ్వానం!!



రెయిన్ బో ఫ్రూట్ సలాడ్

కావలసినవి: స్ట్రాబెర్రీలు – 2 కప్పులు (శుభ్రం చేసి సగానికి కట్ చేయాలి); **తర్బూజ ముక్కలు** – 2 కప్పులు; **బ్లూ బెర్రీలు** – కప్పు; **కివీ పండ్లు** – 2 (తొక్క తీసి పలుచగా ముక్కలు చేయాలి); **బొప్పాయి పండు** (ముక్కలు చేయాలి); **రాస్ప్ బెర్రీలు** – కప్పు

తయారీ: ఈ ముక్కలను చక్కగా ఫొటోలో ఉన్నట్లు ఇంద్రధనుస్సు ఆకారంలో అమర్చాలి. ఫ్రూట్ సలాడ్ ప్లేట్‌ని ఇలా చూస్తే ఎవరికైనా ఒక ముక్క తినాలనిపిస్తుంది. మనకు అందుబాటులో ఉన్న అరటిపండు, యాపిల్, ఆరెంజ్, ద్రాక్ష వంటి పండ్లతోనూ సరదాగా ఇంద్ర ధనుస్సును అమర్చుకోవచ్చు.







దానిమ్మ రసం

కావలసినవి: దానిమ్మ పండ్లు – 2

తయారీ: దానిమ్మ పండ్లను కడిగి ఒక్కొక్క పండును నాలుగు భాగాలుగా కట్ చేయాలి. మొత్తం ఎనిమిది ముక్కలను వెడల్పాటి పాత్రలో వేసి ముక్కలు మునిగేటట్లు నీరు పోయాలి. ఇప్పుడు వేళ్లతో మృదువుగా గింజలను వేరు చేయాలి. గింజలు నీటి అడుగున చేరతాయి, వగరుగా ఉండే పలుచని తొక్క నీటి మీద తేలుతుంది. పై చెక్కు, లోపలి తొక్కలను తీసేసి నీటిని వడపోయాలి. ఈ గింజలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ జ్యూస్‌ను అలాగే తాగవచ్చు లేదా వడపోసి తాగవచ్చు. వడపోయకుండా తాగినట్లయితే జీర్ణవ్యవస్థ చక్కగా శుభ్రపడుతుంది. దానిమ్మలోని తీపి సరిపోదనుకుంటే గింజలను గ్రైండ్ చేసేటప్పుడు రెండు ఖర్జూరాలను (గింజ తీసేసినవి) కలుపుకోవచ్చు.



డ్రై ఫ్రూట్ లడ్డు


కావలసినవి: ఖర్జూరాల ముక్కలు – కప్పు; **బాదం** – 3 టేబుల్ స్పూన్‌లు; **కిస్‌మిస్** – 2 టేబుల్ స్పూన్‌లు; **జీడిపప్పు** – 2 టేబుల్ స్పూన్‌లు; **అంజీర్** – 8; **కొబ్బరి తురుము** – టేబుల్ స్పూన్; **యాలకులు** – 2.

తయారీ: బాదం పప్పును బాగా ఎండబెట్టి సన్నగా తరిగి ఒక పాత్రలో వేయాలి. అంజీర్‌లను కూడా తరగాలి, యాలకులను తొక్క వేరు చేసి గింజలను పొడి చేసి బాదం తరుగులో వేయాలి. మిక్సీ జార్‌లో ఖర్జూరం పలుకులు, అంజీర్ మిశ్రమం, జీడిపప్పు, కిస్‌మిస్, బాదం తరుగు, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి సమంగా కలిసేటట్లు బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కావలసిన సైజ్‌లో లడ్డూలుగా తయారు చేయాలి.

పుచ్చకాయ రసం

కావలసినవి: పుచ్చకాయ – 1 (మీడియం సైజ్); **పుదీన ఆకులు** – 2 టేబుల్ స్పూన్‌లు; **నిమ్మరసం** – టీ స్పూన్.

తయారీ: పుచ్చకాయలో గింజలు తీసేసి ముక్కలు తీసుకోవాలి. ఈ ముక్కల్లో పుదీనా ఆకులు వేసి మిక్సీ జార్ (జ్యూస్ బ్లెండర్)లో గ్రైండ్ చేయాలి. చివరగా నిమ్మరసం కలపాలి. ఫైబర్ సమృద్ధిగా అందాలంటే ఈ మిశ్రమాన్ని వడపోయకుండా తాగవచ్చు. అలా తాగలేకపోతే వడపోసి తాగవచ్చు.


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే
వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 327

శుక్రవారం 17-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




నేటినుంచి రెండో టెస్టు

ఢిల్లీలో జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత్ -15లో



క్రూడ్‌పై 'విండ్‌ఫాల్' తగ్గింపు

డీజిల్, జెట్ ఫ్యూయెల్ ఎగుమతులపై కేంద్రం విండ్ ఫాల్ ట్యాక్స్ తగ్గించింది. -15లో



ఆదివాసీల అభ్యున్నతికి ప్రాధాన్యం

గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలోని ఆదివాసీల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



త్రిపురలో 81.11 శాతం ఓటింగ్

త్రిపురలో 60 అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో సాయంత్రం 4 గంటల వరకు 81.11 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

- వివరాలు 6లో▶



బీబీసీలో మూడో రోజూ 'సర్వే'

ఢిల్లీలోని బీబీసీ కార్యాలయంలో వరుసగా మూడో రోజు కూడా ఆదాయపు పన్ను శాఖ అధికారుల సర్వే కొనసాగింది.

- వివరాలు 6లో▶



840 విమానాలు కొంటున్నాం..

ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థల నుంచి మొత్తం 840 విమానాలు కొనుగోలు చేస్తున్నామని 'ఎయిరిండియా' వెల్లడించింది.

- వివరాలు 6లో▶

తెలంగాణ సాగునీటి పథకాలు భేష్



తెలంగాణలో చేపట్టిన సాగునీటి పథకాలు బాగున్నాయని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ ప్రశంసించారు. తెలంగాణలో భూగర్భ జలాల పరిరక్షణ చర్యలను అధ్యయనం చేసేందుకు భగవంత్‌సింగ్ మాన్ నేతృత్వంలోని బృందం గురువారం సిద్దిపేట జిల్లాలో పర్యటించింది. - 2లో

బీఆర్‌ఎస్‌లోకి రావాలని బ్లాక్ మెయిల్: బండి సంజయ్



సీఎం కేసీఆర్ మోసగాళ్లకే మోసగాడని బండి సంజయ్ ధ్వజమెత్తారు. బీజేపీ నేతలను బీఆర్‌ఎస్‌లోకి రావాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము అలా చేయాలనుకుంటే బీఆర్‌ఎస్‌లో ఏ ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే మిగలరని హెచ్చరించారు. - 2లో

బీఆర్‌ఎస్ దూరం

ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికార పార్టీ సూత్రప్రాయ నిర్ణయం

- హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో మజ్లిస్‌కు మద్దతు
- మెజారిటీ ఉన్నా మిత్రపక్షానికే సీటు
- 'టీచర్స్' కోటా ఎన్నికలోనూ నేరుగా పోటీకి దూరం
- ఎవరికి మద్దతు ఇచ్చేదీ నామినేషన్ల తర్వాత స్పష్టత
- గతంలో పీఆర్టీయూ టీఎస్‌కు మద్దతు
- ఈసారి సంఘాలు, అభ్యర్థులు మారడంతో ఆసక్తి
- స్థానిక, టీచర్స్ కోటా సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఈసీ
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- వచ్చే నెల 13న పోలింగ్.. 16న ఓట్ల లెక్కింపు



సాక్షి, హైదరాబాద్: కొన్నాళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ వచ్చిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్).. త్వరలో జరగనున్న రెండు ఎమ్మెల్సీ సీట్ల ఎన్నికలకు మాత్రం దూరంగా ఉండాలని నిర్ణయించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాకు చెందినదికాగా.. మరొకటి 'మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ (టీచర్స్) నియోజకవర్గానికి సంబంధించినది. ఇందులో స్థానిక కోటాలో బీఆర్‌ఎస్‌కు బలం ఎక్కువగా ఉన్నా.. ఈ ఎమ్మెల్సీ సీటును ఎంఐఎంకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇక టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎప్పటిలాగే నేరుగా పోటీ చేయకుండా.. కలిసివచ్చే ఉపాధ్యాయ సంఘం అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే ప్రస్తుతం మారుతున్న అభ్యర్థులు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎవరికి మద్దతు ఇస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

నామినేషన్ల స్వీకరణ షురూ..

ప్రస్తుతం 'మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఉన్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పదవీకాలం ఈ ఏడాది మార్చి 29న ముగియనుంది. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఉన్న అమీనుల్ హసన్ జాఫ్రీ (ఎంఐఎం) పదవీకాలం మే 1న

మిగతా 2వ పేజీలో ▶

పురుగు మందు మితిమీరుతోంది!

సాగులో పెరుగుతున్న క్రిమిసంహారాల వాడకం

- రాష్ట్రం ఏర్పాటు నాటికి 2,862 మెట్రిక్ టన్నులు వినియోగం
- ప్రస్తుతం 4,986 మెట్రిక్ టన్నులకు చేరిన వైనం
- భూసారానికి, ఆరోగ్యానికి హాని చేస్తున్న పెస్టిసైడ్స్

దేశంలోనే నాలుగో స్థానంలో తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: సాగులో క్రిమిసంహారకాల (పెస్టిసైడ్స్) విచ్చలవిడి వినియోగం పెరుగుతోంది. పంటలు వేస్తున్న రైతు పురుగులు, తెగుళ్ల నివారణతో పాటు దిగుబడి పెరుగుతుందనే ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. అందువల్ల భూమిలో సారం తగ్గిపోతోందని, రైతుల ఆరోగ్యం దెబ్బతింటోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక శాతం పురుగుమందులు వినియోగిస్తున్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉండగా.. దేశంలోనే అత్యధికంగా పెస్టిసైడ్స్ వినియోగిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సమయంలో సగటున 2,862 మెట్రిక్ టన్నుల పురుగు మందులు వినియోగిస్తుండగా, ఇప్పుడది ఏకంగా 4,986 మెట్రిక్ టన్నులకు చేరింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో పెస్టిసైడ్స్ వినియోగం పెరుగుతున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నప్పటికీ.. ఏటా వీటిని పరిమితికి మించి వాడుతున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అభిప్రాయం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఏటా 62,193 మెట్రిక్ టన్నుల పెస్టిసైడ్స్ వినియోగిస్తుండగా, ఇందులో 20 శాతానికి పైగా ఒక్క మహారాష్ట్రలోనే వినియోగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఆ తర్వాతి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలున్నాయి.

అన్ని విధాలా అనర్థం..

అతిగా పురుగుమందుల వినియోగం అన్ని విధాలా అనర్థమని పలు పరిశోధన సంస్థలు ఆందోళన

మిగతా 13వ పేజీలో ▶



5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యంపై జోకులొద్దు

కేసీఆర్ వెటకారం సరికాదన్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

- తెలంగాణకు భారీగానే నిధులు ఇస్తున్నాం
- రాజ్యాంగానికి లోబడే రాష్ట్రాల రుణాలు కేంద్రం పర్యవేక్షిస్తోందని వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్ అయిదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటూ నిర్దేశించుకున్న భారీ లక్ష్యాన్ని తెలంగాణ సీఎం కేసీఆర్ వెటకారం చేయడం సరికాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. సమున్నత లక్ష్యసాధనలో తాము ఎలా పాలుపంచుకోగలమన్నది రాష్ట్రాలు కూడా ఆలోచించాలని సూచించారు. 'సీఎం గారూ జోక్ చేయకండి. మనం అంతా కూడా దీనిపై

మిగతా 2వ పేజీలో ▶

ఒక్క డాక్యుమెంట్‌తోనే రూ.15.96 కోట్లు!

- రిజిస్ట్రేషన్ల శాఖకు గండిపేట పరిధిలో 'గోల్డెన్'డీల్
- బండ్లగూడ జాగీర్‌లో 75వేల చదరపు గజాల భూమి ఓ ఎడ్యుకేషన్ అకాడమీకి బదలాయింపు
- గతేడాది మేలో మూసాపేట సమీపంలోని ముస్కిపేట భూబదలాయింపుతో రూ.35.51 కోట్ల ఫీజు



- వివరాలు 13లో▶

క్లుప్తంగా...

వీళ్ల నుంచి పాఠాలు నేర్చుకోవాలా?: కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛ గురించి కల్వకుంట్ల కుటుంబం నుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఏమాత్రం లేదని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం చేసే పనుల గురించి, ఎవరు ఏ రకమైనటువంటి వాళ్లో మొత్తం తెలంగాణ సమాజానికి తెలుసన్నారు. బీబీసీపై ఐటీ సర్వే గురించి మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ, మీడియా సంస్థలపై తాము ఎక్కడా దాడులు చేయట్లేదని స్పష్టం చేశారు. తొక్కుడు తొక్కితే 10 కి.మీలు భూమిలోకి పోతారని గతంలో తెలంగాణలోని కొన్ని మీడియా సంస్థలపై వాళ్లే వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ నేతలపై మండిపడ్డారు. అంతేగాక తెలంగాణలో కొన్ని టీవీ చానళ్లపై నిషేధం విధించి, ఆ టీవీ చానళ్ల తెలంగాణలో ప్రసారాలు చేయకుండా అడ్డుకున్న కల్వకుంట్ల కుటుంబం వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

నడక నేర్పుతున్నది నదులకా? లిక్కర్‌కా?



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, ఆప్ పార్టీలకు కావాల్సింది లిక్కర్ పాలసీ తప్ప ఇరిగేషన్ పాలసీ కాదని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ కలిసి నడక నేర్పుతున్నది నదులకా.. లిక్కర్‌కా అని ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో మద్యానికి దూరంగా ఉన్న ప్రజలకు ఇంటింటికీ మద్యం ఏరులై పారేలా ఆప్ సర్కారు చేసిందని మండిపడ్డారు. లిక్కర్ కుంభకోణంలో ఈ పార్టీలు భాగస్వాములన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కేసీఆర్ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి.. డ్రామాలో భాగంగానే పంజాబ్ సీఎం తెలంగాణలో పర్యటిస్తున్నారని విమర్శించారు. పంజాబ్ సీఎంకు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులను చూపిస్తే బాగుండేదని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం తొలగించి, భక్తులకే అధికారం ఇస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు. భక్తుల సొమ్ముతో కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారని, ఎంఐఎం నేతలు బతుకమ్మను, హిందూ దేవుళ్లను అవహేళన చేస్తుంటే పల్లెత్తు మాట మాట్లాడని బీఆర్‌ఎస్ నేతలను ప్రజలు నమ్మరని అన్నారు. కాగా, గురువారం లక్ష్మణ్ సమక్షంలో లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ సోదరుడు నాగేంద్రబాబు, వివిధ రంగాలకు చెందిన వారు బీజేపీలో చేరారు.

బీసీల రాజకీయ రిజర్వేషన్లకు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో బీసీలకు తొలి దశలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీల సమస్యలపై హన్స్‌రాజ్ గంగారాంతో చర్చించారు. వీలైనంత త్వరగా పెండింగ్ సమస్యలను పరిష్కరించి కేంద్ర ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలని సురేశ్ విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్‌లు నిండి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,033 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.33 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం అవుతోంది.


తిని.. పూడుస్తుంది!

కాంక్రీట్ పగుళ్లను నివారించే 'గుడ్' బ్యాక్టీరియా

కాంక్రీట్‌లో ఉండే 'సీఎస్‌హెచ్ జెల్' తిని కాల్షియం కార్బొనేట్ ఉత్పత్తి

అది లోలోపలకి చొచ్చుకుంటూ వెళ్లి పగుళ్లను పూడ్చుతున్న వైనం

అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల ప్రయోగం విజయవంతం



అనంతపురం

సిమెంట్ కాంక్రీట్‌ను పటిష్టంగా ఉంచడానికి మధ్యలో ఇనుప కడ్డీలను వినియోగిస్తారు. ఈ కడ్డీలు కాంక్రీట్‌కు అదనపు బలం చేకూర్చినా.. వాటివల్ల పగుళ్లు ఏర్పడతాయి. కాంక్రీట్ మిశ్రమాన్ని బట్టి కూడా చిన్నపాటి పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఇందులోకి నీరు లేదా తేమ చేరి ఇనుప కడ్డీలు తుప్పు పట్టడం, పగుళ్లు పెరిగి పెచ్చులు ఊడిపోవడం వంటివి చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాల్లోని గృహాల్లో ఉప్పు నీటి ఆవిరి కారణంగా స్లాబ్‌లలో పగుళ్లు ఏర్పడతాయి. పగుళ్లతో వచ్చే సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం వివిధ రకాల విధానాలు అనుసరిస్తున్నారు. గ్రౌటింగ్, ఎఫ్‌ఆర్‌సీ ఫిల్లింగ్ విధానాలు ఉన్నా.. వీటివల్ల కలిగే ప్రయోజనం తాత్కాలికమే. పైగా ఈ విధానాలు అత్యధిక ఖర్చుతో కూడుకున్నవి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు అనంతపురం జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు హెచ్.సుదర్శనరావు, వైశాలి జి.గోర్పడే వినూత్న పరిశోధనకు శ్రీకారం చుట్టారు. అనంతపురం జేఎన్‌టీయూలో వివిధ విధానాలపై ఆరేళ్లపాటు పరిశోధనలు, ప్రయోగాలు జరిపి అత్యంత చౌకగా.. సుదీర్ఘకాలం మన్నికగా ఉండే 'బ్యాక్టీరియల్ కాంక్రీట్' విధానానికి రూపకల్పన చేశారు. వీరి పరిశోధన విజయవంతమై ఇండియన్ పేటెంట్ సైతం లభించింది.

పరిశోధనలో భాగంగా ప్రొఫెసర్లు ఎయిరోఫిలియస్, ఫ్లెక్సెస్, స్పోర్టోస్పైరికాస్ అనే మూడు రకాల మిత్ర బ్యాక్టీరియాలను ఉపయోగించారు. విభిన్న ప్రాంతాల నుంచి మురికి నీటిని సేకరించి అందులో మట్టి కలిపారు. అందులోనే బ్యాక్టీరియాను అభివృద్ధి చేశారు. తక్కువ కాలంలోనే బ్యాక్టీరియా రెట్టింపు అవుతున్నట్టు గుర్తించారు. ఈ బ్యాక్టీరియాలు కాంక్రీట్‌లో ఉండే సీఎస్‌హెచ్(కాల్షియం సిలికేట్ హైడ్రేట్) జెల్‌ను ఆహారంగా తీసుకుంటూ సుదీర్ఘకాలంపాటు బతికేస్తాయని గుర్తించారు. అక్కడ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే కాల్షియం కార్బొనేట్ పగుళ్ల లోలోపలకి చొచ్చుకుంటూ వెళ్లి పగుళ్లను పూడుస్తాయి. కాంక్రీట్‌లో ఉన్న సీఎస్‌హెచ్ జెల్ తింటూ బ్యాక్టీరియా తన సంతానాన్ని వృద్ధి చేసుకుంటూపోతుంది. కాంక్రీట్‌లో ఉండే 'సీఎస్‌హెచ్ జెల్' పూర్తిగా వినియోగం కావడానికి చాలా ఏళ్లు పడుతుంది. కాబట్టి బ్యాక్టీరియా లోపల హాయిగా బతికేస్తుంది. మిత్ర బ్యాక్టీరియా కాబట్టి మానవాళికి హానికరం కాదు.

మిత్ర బ్యాక్టీరియాలతో సమస్యకు చెక్



ప్రయోగంలో వినియోగించిన కాంక్రీట్ పిల్లర్లు

రెండు పరిశోధనలు విజయవంతం

- కాంక్రీట్ మిశ్రమాన్ని స్లాబ్‌పై వేసే సమయంలోనే బ్యాక్టీరియాను కలిపారు. భవనం పటిష్టంగా ఉండటంతో పాటు ఎక్కువ కాలం మన్నిక ఉంటుందని తేటతెల్లమైంది.
- కాగా, భవనాలకు పగుళ్లు వచ్చిన తర్వాత బ్యాక్టీరియాను ప్రవేశపెట్టి.. అభివృద్ధి చేయడం ద్వారా పగుళ్లను వాటితోనే భర్తీ చేశారు. తద్వారా పగుళ్లు పూడుకుపోవడంతోపాటు భవనం పటిష్టత పెరుగుతూ వచ్చింది.
- ఈ రెండు పరిశోధనలు విజయవంతం కావడంతో ప్రొఫెసర్లు హెచ్.సుదర్శనరావు, వైశాలి జి.గోర్పడే 'మెథడ్స్ ఫర్ ప్రిపరేషన్ ఆఫ్ బ్యాక్టీరియల్ కాంక్రీట్ విత్ సెల్ఫ్ హీలింగ్ ఎబిలిటీస్ అండ్ ప్రొడక్ట్స్ దేర్ ఆఫ్' పేరిట సమర్పించిన అంశానికి పేటెంట్ దక్కింది.

ఆరేళ్ల పరిశోధనల ఫలితమిది





"కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడినా.. భవనం దెబ్బతినకుండా ఉండేందుకు వీలుగా బ్యాక్టీరియల్ కాంక్రీట్ విధానంపై సుదీర్ఘమైన పరిశోధనలు చేశాం. అత్యంత చౌకైన విధానం ఇది. మెరుగైన ఫలితం వస్తుంది. భవనాలు ఎక్కువ కాలం మన్నిక వచ్చేలా సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాం. ఇందుకు పేటెంట్ దక్కడం చాలా ఆనందంగా ఉంది. ఆరేళ్లపాటు చేసిన పరిశోధనకు ఫలితం దక్కింది. నెదర్లాండ్స్‌లోని డెల్ఫ్ట్ యూనివర్సిటీ వారు ఈ పరిశోధన వినియోగించడానికి జేఎన్‌టీయూ(ఏ)తో సంప్రదింపులు జరుపుతున్నారు.

– ప్రొ. సుదర్శనరావు, ప్రొ.వైశాలి జి.గోర్పడే, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం

బీఆర్‌ఎస్‌లోకి రావాలని బ్లాక్ మెయిల్!

బీజేపీ ప్రజాప్రతినిధులను బెదిరిస్తున్నారన్న బండి సంజయ్

- కేసీఆర్.. మోసగాళ్లకే మోసగాడని ధ్వజం
- వికారాబాద్ జిల్లాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్



పరిగి: ముఖ్యమంత్రి కేసీఆర్ మోసగాళ్లకే మోసగాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ ప్రజాప్రతినిధులను బీఆర్‌ఎస్‌లోకి రావాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. తాము అలా చేయాలనుకుంటే బీఆర్‌ఎస్‌లో ఏ ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచ్ మిగలరని హెచ్చరించారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌లో జరిగిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో బండి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలని ఎద్దేవాచేశారు. ప్రగతిభవన్‌కే పరిమితం అయిన సీఎంను బయటికి తిరిగేలా చేసింది తామేనని, దేశంలో కేసీఆర్‌ను ఎవరూ గుర్తుపట్టడం లేదని దుయ్యబట్టారు. త్వరలోనే బీఆర్‌ఎస్.. వీఆర్‌ఎస్ తీసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందోనన్న అయోమయంలో ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తే.. కేంద్రంలో 10 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తు చేశారు. 80వేల ఉద్యోగాలకు రూ.5 వేల కోట్లు కావాలని, కానీ బడ్జెట్‌లో రూ.1000 కోట్లు మాత్రమే పెట్టారని దుయ్యబట్టారు.

ఏ పథకాలు రద్దు కావు

మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వారు సతమతమవుతున్నారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏ పథకాలు రద్దు కావని స్పష్టం చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడా కనిపించడం లేదన్నారు. దళితబంధు కేవలం ఎన్నికల కోసం తీసుకొచ్చిన పథకమని విమర్శించారు. ప్రభుత్వం దళితులను పూర్తిగా మోసం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారిద్దరినీ పిచ్చాసుపత్రిలో చేర్చాలి

- కేసీఆర్.. ఇతర నేతలను తిట్టడం మినహా బండి, రేవంత్‌లకు వేరే పని లేదు
- ప్రభుత్వ విప్‌లు గువ్వల బాలరాజు, రేగా కాంతారావు

సాక్షి, హైదరాబాద్: హుందాతనంతో మాట్లాడాల్సిన ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రగతిభవన్‌ను పేల్చివేస్తామని, సచివాలయం గుమ్మటాలు కూల్చివేస్తామని ప్రకటనలు చేస్తున్నారని ప్రభుత్వ విప్‌లు గువ్వల బాలరాజు, రేగా కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడాల్సిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌పై చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత హేయపూరితంగా ఉంటున్నాయని అన్నారు. అందుకే కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులను పిచ్చాసుపత్రిలో చేర్చేందుకు ఆయా పార్టీల నేతలు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో బాలరాజు, కాంతారావు మీడియాతో మాట్లాడారు. కొండగట్టు అభివృద్ధికి సీఎం కృషి చేస్తుంటే బండి సంజయ్ మాత్రం కేసీఆర్ బంధువుల కోసమేనంటూ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతా పర్యటిస్తున్న సంజయ్ భూముల కబ్జాకోసమే తిరుగుతున్నారా అని ప్రశ్నించారు. బండి సంజయ్, రేవంత్‌రెడ్డికి తిట్టడం మినహా వేరే ఎజెండా ఏమీ లేదని, ఇద్దరు నేతలూ తిట్లలో పోటీ పడుతున్నారని విమర్శించారు.

ఒక్క ఆరోపణ రుజువు చేసినా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: రేగా

ఎమ్మెల్యేగా 300 ఎకరాలు ఆక్రమించారంటూ రేవంత్‌రెడ్డి తనపై చార్జిషీట్ విడుదల చేయడాన్ని ప్రస్తావిస్తూ తనపై ఆరోపణలు నిరూపిస్తే మణుగూరు చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తానంటూ విప్ రేగా కాంతారావు సవాలు చేశారు. తనపై కాంగ్రెస్ విడుదల చేసిన చార్జిషీట్‌లో ఏ ఒక్క ఆరోపణ రుజువు చేసినా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనంటూ ఆయన ప్రకటించారు.

బీఆర్‌ఎస్ దూరం

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తవుతోంది. త్వరలో ఈ రెండు సీట్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వీటికి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నెల 23 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వచ్చే నెల 13న పోలింగ్ నిర్వహించి.. 16న ఓట్ల లెక్కింపు జరుపుతారు. రాష్ట్ర శాసనమండలిలో మొత్తం 40 స్థానాలు ఉండగా.. అందులో బీఆర్‌ఎస్ వారే 36 మంది కావడం, మిత్రపక్షం ఎంఐఎంకు ఇద్దరు సభ్యులు ఉండటం గమనార్హం. ఇక కాంగ్రెస్ నుంచి ఒకరు, మరొకరు ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కే బలం.. అయినా దూరం..

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో మొత్తం 127 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో 8 మంది సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గుడిమల్కాపూర్ బీజేపీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ ఈ ఏడాది జనవరిలో మరణించారు. దీనితో ప్రస్తుతం ఓటర్ల సంఖ్యను 118గా ఎన్నికల సంఘం నిర్ధారించింది. ఇందులో 83 మంది జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లుకాగా.. మిగతా 35 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు. ఈ ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో వివిధ పార్టీలకు చెందిన ఐదుగురు రాజ్యసభ, ఇద్దరు లోక్‌సభ సభ్యులు, 12 మంది ఎమ్మెల్సీలు, 16 మంది ఎమ్మెల్యేలకు (నామినేటెడ్ ఎమ్మెల్యేను కూడా కలుపుకొని).. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు ఉంది. అయితే ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారడం, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ డి.వెంకటేశ్, అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీత ప్రకాశ్‌గౌడ్ ఇద్దరూ బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరడం నేపథ్యంలో ఆయా పార్టీల వాస్తవ బలాబలాలపై లెక్కలు వేస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రకారం కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులు కలిపి బీజేపీ 33 ఓట్ల బలం ఉంది. అదే బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలకు కలిపి 83 మంది ఓటర్లు సమకూరనున్నారు. ఇందులో సంఖ్యాపరంగా బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఓట్లున్నా పోటీకి దూరంగా ఉండి.. గతంలో మాదిరిగా ఎంఐఎంకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మధ్య జరిగిన భేటీలో దీనిపై అంగీకారం కుదిరినట్టు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఉన్న ఎంఐఎం నేత అమీనుల్ హసన్ జాఫ్రీ.. 2017లో జరిగిన ఎన్నికలో బీఆర్‌ఎస్ మద్దతుతోనే శాసనమండలిలో అడుగు పెట్టారు.

'టీచర్ ఎమ్మెల్సీ'పై సస్పెన్స్

'మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సుమారు 30 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారు. బీఆర్‌ఎస్ గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేరుగా అభ్యర్థులను బరిలోకి దింపకపోయినా.. భావసారూప్య ఉపాధ్యాయ సంఘాల తరపున పోటీ చేస్తున్న నేతలకు మద్దతు ప్రకటించింది. 2017లో జరిగిన ఎన్నికలో పీఆర్టీయూ (టీఎస్) తరపున పోటీచేసిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చింది. ఇప్పటికే వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డి ప్రస్తుతం పీఆర్టీయూ (తెలంగాణ) తరఫున పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. గుర్రం చెన్నకేశవరెడ్డి పీఆర్టీయూ (టీఎస్) నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక గత ఎన్నికలో పీఆర్టీయూ (తెలంగాణ) తరపున పోటీ చేసిన హర్షవర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ కూడా విద్యాసంస్థల అధినేత ఏవీఎన్ రెడ్డిని బరిలోకి దింపింది. దీనితో 'మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్' ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠగా మారింది. సుమారు 18 మంది అభ్యర్థులు బరిలోకి ఉండనున్నట్టు అంచనా కాగా.. అధికార బీఆర్‌ఎస్ ఎవరికి మద్దతు ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. బీజేపీ నేరుగా తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో.. బీఆర్‌ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని ఉపాధ్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పీఆర్టీయూ (టీఎస్), పీఆర్టీయూ (తెలంగాణ) తరపున పోటీచేసే అభ్యర్థుల్లో బీఆర్‌ఎస్ ఎవరివైపు మొగ్గుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది. 9 కొత్త జిల్లాల పరిధిలో జరుగుతున్న ఈ ఎన్నికకు నామినేషన్ల పర్వం ముగిశాక.. బీఆర్‌ఎస్ మద్దతుపై స్పష్టత రానున్నట్టు చెప్తున్నారు.

...లక్ష్యంపై జోకులొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతాయుతంగా మాట్లాడాలి..'అని హితవు పలికారు. 2023–24 బడ్జెట్‌పై గురువారం నిర్వహించిన చర్చాగోష్టిలో ఆమె పాల్గొన్నారు.

రూ.3 లక్షల కోట్లకు పెరిగిన రుణ భారం

రాష్ట్రాల రుణ సమీకరణపై కేంద్రం ఆంక్షలు విధిస్తోందన్న విమర్శలపై స్పందిస్తూ.. రాజ్యాంగానికి లోబడే రాష్ట్రాల రుణాలను కేంద్రం పర్యవేక్షిస్తుందని, ఇదేమీ కొత్త కాదని నిర్మలా సీతారామన్ చెప్పారు. 2014లో రూ.60,000 కోట్లుగా ఉన్న తెలంగాణ రుణ భారం ప్రస్తుతం రూ.3 లక్షల కోట్ల పైచిలుకుకు పెరిగిపోయిందని అన్నారు. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ తెలంగాణకు గణనీయంగా నిధులు అందిస్తూనే ఉందని, గణాంకాలు చూసి మాట్లాడాలని సూచించారు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపమంటే అప్పటికే వైద్య కళాశాలలు ఉన్న కరీంనగర్, ఖమ్మం జిల్లాల పేర్లను తెలంగాణ ప్రభుత్వం తమకు పంపిందని విమర్శించారు. సెస్సుల రూపంలో వస్తున్న నిధులను రాష్ట్రాలతో కేంద్రం పంచుకోవడం లేదంటూ వస్తున్న ఆరోపణలపై మాట్లాడుతూ .. వసూలు చేసిన దానికి మించి నిధులను రాష్ట్రాలకు ఇస్తున్నట్లు కేంద్రమంత్రి చెప్పారు. ఉపాధి హామీ డిమాండ్ ఆధారిత పథకమని, దానికి అనుగుణంగానే కేటాయింపులు జరిపామని తెలిపారు. వాస్తవానికి 2016 నుంచి బడ్జెట్‌లో కేటాయించిన దానికి మించే కేంద్రం దీనిపై ఖర్చు చేస్తోందని వివరించారు.

అన్ని వర్గాలకూ ఉపకరించేలా బడ్జెట్

ప్రధానంగా వృద్ధికి ఊతమివ్వడంతో పాటు ఇంధన ధరల పెరుగుదల వంటి అంతర్జాతీయ సవాళ్లు అన్నింటినీ దృష్టిలో ఉంచుకునే తాజా బడ్జెట్‌ను రూపొందించినట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. బలహీన వర్గాలు, సామాన్య ప్రజానీకం సహా అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. వ్యాపారాలకు, విద్యకు మద్దతు లభించేలా, నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు అవకాశాలు దక్కేలా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి సంక్లిష్టమైన పాత విధానంతో పోలిస్తే కొత్త విధానం సరళతరమైనదని సీతారామన్ తెలిపారు. మినహాయింపుల కోసం లెక్కలు వేసుకోవాల్సిన బాదరబందీ ఇందులో ఉండదన్నారు. ఆదాయం ఆర్జించే వారు ఎందులో పొదుపు చేయాలి? ఎంత చేయాలి? లాంటివి ప్రభుత్వం నిర్దేశించాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయాలకు సంబంధించి భారీగా కేటాయించిన నిధులను వినియోగించుకునేందుకు రాష్ట్రాలు ఆసక్తిగా ముందుకు వస్తున్నాయని చెప్పారు.

దేశాన్ని అప్పుల పాలు చేసి తెలంగాణపై విమర్శలా?

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్

- మోదీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పెద్దలకు కట్టబెడుతోందని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: దేశాన్ని అప్పుల పాలు చేసిన మోదీ ప్రభుత్వం తెలంగాణపై విమర్శలు చేయడం దారుణమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పుల గురించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "2014లో రూ.55 లక్షల కోట్ల మేర ఉన్న కేంద్ర ప్రభుత్వ అప్పులు.. ఇప్పుడు రూ.155 లక్షల కోట్లకు చేరాయి. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం రూ.వంద లక్షల కోట్లకుపైగా అప్పు చేసింది. ఒక్కో వ్యక్తిపై అప్పుల భారం మూడు రెట్లు పెరిగింది. అలాంటిది తెలంగాణపై విమర్శలు చేయడం దారుణం .."అని కవిత పేర్కొన్నారు. కేంద్రం కుంటి సాకులతో పేదల ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని.. మరోవైపు పెద్దలకు ప్రజాధనాన్ని కట్టబెడుతోందని ఆరోపించారు. తలసరి ఆదాయాన్ని కేంద్ర ఆర్థిక సర్వేలో వెల్లడించకపోవడం, జన గణన చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కర్ణాటక మెట్రోతోపాటు యూపీలోని చిన్న చిన్న పట్టణాలకు మెట్రో ప్రాజెక్టులను మంజూరు చేశారని.. తెలంగాణకు మాత్రం మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అంటే ఇదేనా?'అని ప్రశ్నించారు.

ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ హబ్‌లు

రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ కంపెనీలను ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. నిజామాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఐటీ హబ్‌లో సదుపాయాలపై గురువారం రాత్రి నిర్వహించిన వెబినార్‌లో ఆమె మాట్లాడారు. తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేయడానికి ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచటంతో పాటు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిజామాబాద్ ఐటీ హబ్ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఎమ్మెల్యే గణేశ్ బిగాల, బీఆర్‌ఎస్ ఎన్నారై కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణ సాగునీటి పథకాలు భేష్

గత పాలకుల నిర్లక్ష్యంతో అడుగంటుతున్న భూగర్భజలాలు: పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్

- నీటిని సక్రమంగా వినియోగించేలా తెలంగాణ మోడల్
- త్వరలో మా రాష్ట్రంలోనూ దీనిని అమలు చేస్తాం
- కొండపోచమ్మ రిజర్వాయర్, పలు చెక్‌డ్యామ్‌లను సందర్శించిన పంజాబ్ బృందం



కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, రిజర్వాయర్ గురించి వివరిస్తున్న ఈఎన్‌సీ హరి రామ్

సాక్షి, సిద్దిపేట: తెలంగాణలో చేపట్టిన సాగునీటి పథకాలు బాగున్నాయని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ ప్రశంసించారు. ఇక్కడ భూగర్భ జలాలు పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాలు తక్కువ సమయంలోనే మంచి ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. తెలంగాణలో భూగర్భ జలాల పరిరక్షణ చర్యలను అధ్యయనం చేసేందుకు భగవంత్‌సింగ్ మాన్ నేతృత్వంలోని బృందం గురువారం సిద్దిపేట జిల్లాలో పర్యటించింది. మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్, పంపుహౌస్, నర్సన్నపేటలోని కూడవెల్లి చెక్‌డ్యాం పాటు గజ్వేల్‌లోని పాండవుల చెరువును పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ సాగునీటి శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్, ఇతర అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పనుల తీరు, వివిధ దశలను పంజాబ్ బృందానికి వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన జలవనరుల పథకాలను మానిటర్, మ్యాప్‌లు, చార్టులతో చూపించారు. ఈ సందర్భంగా పాండవుల చెరువు వద్ద రైతులతో భగవంత్‌సింగ్ మాన్, పంజాబ్ అధికారులు మాట్లాడారు. తర్వాత భగవంత్‌సింగ్ మాన్ మాట్లాడారు. పంజాబ్ జలవనరులను కాపాడే అంశంపై దృష్టిపెట్టామని.. ఈ క్రమంలో కొత్త టెక్నాలజీల గురించి తెలుసుకునేందుకు తెలంగాణలో పథకాలను పరిశీలించేందుకు వచ్చామని తెలిపారు. పంజాబ్‌లో సాగునీటి వ్యవస్థ దేశ విభజనకు ముందు ఏర్పాటు చేసినదని.. ప్రస్తుతం బావులు, బోర్లతోనే ఎక్కువగా సాగు జరుగుతోందని చెప్పారు. అక్కడ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోయాయన్నారు. ఈ క్రమంలో నీటిని సక్రమంగా ఉపయోగించుకుంటున్న తెలంగాణ మోడల్‌ను అనుసరించి పంజాబ్‌లో విరివిగా చెక్‌డ్యామ్‌లు నిర్మించి, జలసంపదను రాబోయే తరాలకు అందిస్తామని చెప్పారు.

మంచి ఎక్కడున్నా నేర్చుకోవచ్చు

ఆరోగ్యం, విద్య, సాగునీరు, విద్యుత్ అంశాల్లో మంచి ఎక్కడున్నా వెళ్లి నేర్చుకోవచ్చని భగవంత్‌సింగ్ మాన్ చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న కంటి వెలుగు పథకాన్ని త్వరలో పంజాబ్‌లో ప్రారంభిస్తామన్నారు. ఢిల్లీలో చూసి తెలంగాణలో బస్తీ దవాఖానాలు ప్రారంభించారని.. తమిళనాడు సీఎం స్టాలిన్ ఢిల్లీ విద్యా వ్యవస్థను చూసి, అదే తరహాలో తమిళనాడులో రూపొందించారని చెప్పారు. మంచి మనసు, విజన్ ఉన్న నాయకుడు ఉన్న ప్రాంతం ఎల్లప్పుడూ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.

ఇదండీ సంగతి



హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టకుండా ముందు ఏపీలో అడుగుపెట్టండి సార్! ప్లీజ్!!

టీఎస్ ఎస్పీడీసీఎల్‌లో 1,661 పోస్టులు

- ఏఈ (ఎలక్ట్రికల్) పోస్టులు 48.. జేఎల్ఎం పోస్టులు 1,553 భర్తీ
- ఈ నెల 23 నుంచి ఏఈ పోస్టులకు, వచ్చే నెల 8 నుంచి జేఎల్ఎం పోస్టులకు దరఖాస్తులు
- రెండింటికీ ఏప్రిల్ 24 నుంచి హాల్‌టికెట్లు.. 30న రాతపరీక్ష

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) పరిధిలో 48 అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), 1,553 జూనియర్ లైన్‌మన్ పోస్టుల భర్తీకి గురువారం సమగ్ర నియామక ప్రకటనలు జారీ అయ్యాయి. ఏఈ పోస్టులకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 15వరకు.. జేఎల్ఎం పోస్టులకు వచ్చే నెల 8 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. రెండు పరీక్షలకు కూడా ఏప్రిల్ 24 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 30న రాతపరీక్ష నిర్వహించనున్నారు. గరిష్ఠ వయోపరిమితి జేఎల్ఎం పోస్టులకు 35 ఏళ్లు, ఏఈ పోస్టులకు 44 ఏళ్లు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతలు కలిగిన వారు ఏఈ (ఎలక్ట్రికల్) పోస్టులకు అర్హులు. జూనియర్ లైన్‌మన్ పోస్టులకు పదో తరగతితోపాటు ఎలక్ట్రికల్/వైర్‌మన్ ట్రేడ్లలో ఐటీఐ లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఇంటర్ వొకేషనల్ కోర్సు చేసి ఉండాలి. పూర్తి వివరాలకు సంస్థ వెబ్‌సైట్ (https://tssouthernpower.cgg.gov.in) ను సందర్శించవచ్చని టీఎస్ ఎస్పీడీసీఎల్ ప్రకటించింది.



ముగిసిన గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ

5,51,943 దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. మొత్తం 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ గతేడాది డిసెంబర్ 29న నోటిఫికేషన్ జారీ చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 18వ తేదీ నుంచి ఫిబ్రవరి 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో కమిషన్ వెబ్‌సైట్లో 5.50 లక్షల మంది వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. గ్రూప్‌- 2కు సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను అతి త్వరలో ప్రకటించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నాలుగు నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు గురువారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో కాటేపల్లి జనార్దన్‌రెడ్డి రెండు సెట్లు, అన్వర్‌ఖాన్ రెండు సెట్లు, బి.భుజంగరావు, గుర్రం చెన్నకేశవరెడ్డి ఒక్కొక్క సెట్టు చొప్పున దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి మాత్రం తొలి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు.





దేవుడు మిమ్మల్ని నేలనుండి చిత్రవిచిత్రంగా మొలకెత్తించాడు.
తర్వాత ఆయన మిమ్మల్ని అదే నేలలోకి తీసికెళ్తున్నాడు.
చివరికి అందులో నుంచే మిమ్మల్ని బయటికి తీసి నిలబెడ్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఫిబ్రవరి, 17

నేలరాలిన దళిత సుమం

ముంబైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) దేశంలో పేరెన్నికగన్న ఉన్నతశ్రేణి విద్యాసంస్థ. 'జ్ఞానమ్ పరమమ్ ధ్యేయమ్' అనే ఉపనిషద్వాక్యాన్ని అది తన చిహ్నంలో అలంకరించుకుంది. చదువులో ముందుంటూ ఇంజనీరింగ్ చేయాలనుకునే ప్రతి విద్యార్థికీ బాంబే ఐఐటీలో అవకాశం రావాలన్న కోరిక బలంగా ఉంటుంది. మొన్న ఆదివారం అలాంటి ప్రాంగణంలో పద్దెమినిదేళ్ల దళిత విద్యార్థి దర్శన్ సోలంకీ ప్రాణం తీసుకున్న వైనం గమనిస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. ఎక్కడో అహ్మదాబాద్‌లో పుట్టి ఎన్నో కలలతో ఆ ప్రాంగణంలో అడుగుపెట్టిన దర్శన్ అంత చిన్న వయసులో ప్రాణం తీసుకోవటం తప్ప గత్యంతరం లేదనుకున్నాడంటే సంస్థ సిగ్గుపడాలి. అంతవరకూ చదువులో చురుగ్గా ఉండేవాడు ఇటీవల ముభావంగా మారాడనీ, నెలక్రితం మాట్లాడినప్పుడు కుల వివక్ష సంగతి చెప్పాడనీ అతని సోదరి చెబుతున్నారు. తన కులం తెలిసినప్పటినుంచీ సహ విద్యార్థులు మాట్లాడటం మానేశారనీ, తాను ఒంటరినయ్యాననీ బాధపడ్డాడని అంటున్నారు. ఇదే ముంబైలో 2019లో వైద్య శాస్త్రంలో పీజీ చేస్తున్న పాయల్ తాడ్వీ అనే గిరిజన విద్యార్థిని సహ విద్యార్థినుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. గైనకాలజీలో పీజీ చేస్తున్న తనను కనీసం ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా రానీయలేదని చివరిసారిగా రాసిన లేఖలో ఆమె బాధపడింది.

విద్యాసంస్థలు చిన్నవైనా, పెద్దవైనా వాటి తరగతి గదులు నిలువెల్లా కులోన్మాదంతో లుకలుకలాడుతున్నాయని తరచు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిల్లో ఆవగింజంత నిజం లేదన్న బుకాయింపులూ ఆ వెనకే వినవస్తున్నాయి. బహుశా కేవలం ఆ కారణం వల్లే దళిత, ఆదివాసీ విద్యార్థులకు కుల సర్పాల తాకిడి తప్పడం లేదేమో! తమ ప్రాంగణంలో కుల వివక్ష లేనేలేదని, ఒకవేళ అలాంటిదేమైనా ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక విభాగం ఉన్నదని చెబుతున్న బాంబే ఐఐటీ ఆ విభాగం పని తీరెలావుందో ఇప్పటికైనా సమీక్షించుకోవటం మంచిది. ఏడేళ్లనాడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ప్రాణం తీసుకున్నప్పుడు యాజమాన్యం నుంచి వచ్చిన సంజాయిషీకీ, దీనికీ పెద్దగా తేడాలేదు. రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిస్థితులేమిటో వెలికి తీయాల్సిన జస్టిస్ రూపన్‌వాల్ కమిషన్ అతను ఎస్సీ కాదని చెప్పడానికే తాపత్రయపడింది. తన చిన్ననాడే తల్లిదండ్రులు విడిపోయి దళిత స్త్రీ అయిన తల్లి పెంపకంలో దళిత వాడలోనే పెరిగిన రోహిత్ దళితుడు కాడని 'నిరూపించింది'. మన సమాజంలో అన్నిచోట్లా కులం రాజ్యమేలుతోంది. అందుకు ఢిల్లీ ఎయిమ్స్ మొదలుకొని ఉన్నతశ్రేణి విద్యాసంస్థలేవీ మినహాయింపు కాదని 2007లో థోరట్ కమిటీ ఇచ్చిన నివేదిక మొదలుకొని 2013 నాటి ముంగేకర్ కమిటీ నివేదిక వరకూ చెబుతూనే వస్తున్నాయి. కానీ వాటిని అవసరమైనంతగా పట్టించుకోవటం లేదని దర్శన్ సోలంకీ ఉదంతం మరోసారి నిరూపించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'హిందూ' కథనం ప్రకారం నిరుడు ఫిబ్రవరిలో బాంబే ఐఐటీలో కుల వివక్ష, అందువల్ల తలెత్తే అనారోగ్య సమస్యలపై సంస్థ లోని ఎస్సీ, ఎస్టీ విభాగం రెండు సర్వేలు చేసింది. దాంట్లో వచ్చిన ఫలితాల ఆధారంగా కొన్ని చర్యలు తీసుకోవాలని కూడా సంకల్పించింది. కానీ ఏడాదైంది. ఇంకా ఆ సంకల్పం ఆచరణ రూపం దాల్చినట్టు లేదు. అసలు సర్వేలకు స్పందించిన విద్యార్థుల సంఖ్య చూస్తేనే వివక్ష ఎంత బలంగా ఉన్నదో అర్థమవుతుంది. బాంబే ఐఐటీలో దాదాపు 2,000 మంది దళిత విద్యార్థులుంటే కేవలం 20 శాతం మంది మాత్రమే తొలి సర్వేకు స్పందించారట! రెండో సర్వేకైతే 5 శాతంమంది మాత్రమే జవాబిచ్చారు. స్టూడెంట్ కౌన్సెలర్‌గా ఉంటున్న మహిళా ప్రొఫెసర్ రిజర్వేషన్ల గురించి సామాజిక మాధ్యమాల్లో బాహాటంగా వ్యక్తంచేసిన అభిప్రాయాలు వారి భయానికి కారణం.

రాజ్యాంగం అట్టడుగు కులాలవారికి కల్పిస్తున్న రిజర్వేషన్ల గురించి మేధావులనుకునేవారిలోనే, శాఖాధిపతుల్లోనే బోలెడంత అజ్ఞానం గూడుకట్టుకుంది. ఇక చదువుకోవడానికొచ్చిన పిల్లల్లో దాన్ని వెదకటం వృథా ప్రయాస. దర్శన్ తల్లిదండ్రుల ప్రకారం సహ విద్యార్థులకు అతని కులం తెలిసినప్పటినుంచీ 'ఉచితంగా సీటు సంపాదించావు. మేం భారీగా డబ్బు చెల్లించాల్సివచ్చింది' అంటూ వేధించారట. దేశంలో శతాబ్దాలుగా వేళ్లూనుకున్న కుల వివక్షవల్ల కొన్ని కులాలు ఈనాటికీ సామాజిక నిరాదరణకు గురవుతున్నాయని, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయాయని గుర్తించి మన రాజ్యాంగ నిర్మాతలు ఆ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు. దాన్ని ఈనాటికీ పూర్తి స్థాయిలో అందుకోలేనంత బలహీన స్థితిలో ఆ వర్గాలున్నాయి. ఒక దళిత విద్యార్థి లేదా గిరిజన విద్యార్థి ఉన్నత చదువుల వరకూ ఎదగాలంటే ఇంటిల్లిపాదీ ఎన్ని త్యాగాలు చేయాల్సివుంటుందో, మరెన్ని కష్టాలు భరించాల్సివుంటుందో తెలిస్తే అటువంటివారిని ఎవరూ గేలిచేయరు. కానీ ఆధిపత్య కులాల పిల్లలకు ఇదంతా ఎవరు చెప్పాలి? ఇళ్లల్లో చెప్పరు. క్లాసు పుస్తకాల్లో ఉండదు. విశ్వవిద్యాలయ ఆచార్యులు కూడా మౌనం పాటిస్తారు. కులం లేనట్టు ఇంతగా నటించే సమాజంలో అంతిమంగా ఇక జరిగేదేమిటి? బాంబే ఐఐటీలో ఎస్సీ, ఎస్టీ విభాగం నిరుడు ఇచ్చిన నివేదికను బయటపెట్టి దానిపై లోతుగా చర్చిస్తే బహుశా దర్శన్‌కు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదేమో! ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వటం మంచిదే. కానీ అంతకన్నా ముందు రిజర్వేషన్ల అవసరం గురించి, తోటి విద్యార్థులతో సున్నితంగా, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాల్సిన తీరుగురించి దళితేతర విద్యార్థులకు కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలి. అప్పుడే ఏదోమేరకు కులవివక్ష జాడ్యం పోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి: బ.ద్వాదశి రా.8.39 వరకు, తదుపరి త్రయోదశి
నక్షత్రం: పూర్వాషాఢ సా.5.46 వరకు, తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: రా.1.16 నుండి 2.44 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.46 నుండి 9.33 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు
అమృతఘడియలు: ప.1.16 నుండి 2.46 వరకు.

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సైన్సును తొక్కిపెట్టడం ప్రజాహితమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

జోషీమఠ్ కొంతకాలంగా కుంగిపోతూ ఉందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఇచ్చిన కీలకమైన నివేదికను గుర్తించడానికి బదులుగా... దేశీయ శాస్త్ర పరిశోధనా సంస్థల నోరు మూయిస్తూ జాతీయ విపత్తు నిర్వహణా ప్రాధికార సంస్థ నిషేధాజ్ఞను జారీ చేసింది. శాస్త్రీయ సమాచారాన్ని తొక్కిపెట్టడమనేది ప్రజా హితం కోసం శాస్త్రవిజ్ఞానాన్ని అన్వయించడంలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. ఇది వ్యక్తిగతంగా ఒక శాస్త్రజ్ఞుడు తన అభిప్రాయాలను వ్యక్తపర్చడానికి సంబంధించిన విషయం కాదు. ప్రభుత్వ విధాన నిర్ణయంలో సైన్స్ పాత్రకు సంబంధించింది. జీఎం ఆహార పదార్థాలు, నాసిరకం మందులు, డేటా గోప్యత, సూక్ష్మజీవుల నిరోధకత వంటి పలు స్పర్థాత్మక అంశాల్లో నిపుణుల అభిప్రాయాలు ఆరోగ్యకరమైన చర్చకు వీలుకల్పిస్తాయి.

జోషీమఠ్ సంక్షోభం మరొక తత్సమానమైన తీవ్ర సవాలును దేశం ముందు ఉంచింది. అదేమిటంటే భారతీయ శాస్త్ర పరిశోధనా మండలులను, విద్యావిషయిక సంస్థలను నెమ్మదిగా క్షీణింపజేస్తూ రావడమే. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' అనుబంధ విభాగమైన హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సి) అందించిన రిమోట్ సెన్సింగ్ డేటాపై ఆధారపడి, జోషీమఠ్ కుంగుబాటుపై కీలకమైన ప్రాథమిక అంచనా జనవరి 11న వెలువడింది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య జోషీమఠ్ 9 సెంటీమీటర్లు కుంగిందనీ, డిసెంబర్ 27 నుంచి 2023 జనవరి 8 మధ్యలో మరింత వేగంగా కుంగిందనీ ఈ నివేదిక తెలిపింది. జోషీమఠ్‌లో పరిస్థితి తీవ్రతను ఎత్తి చూపిన మొట్టమొదటి శాస్త్రీయ నివేదిక ఇదే.

ఈ నివేదిక తీవ్రతను గుర్తించి, సకాలంలో వ్యవహరించడంలో తాను విఫలమయ్యాయని ఒప్పుకోవడానికి బదులుగా శాస్త్ర పరిశోధనా సంస్థల నోరు మూయిస్తూ జాతీయ విపత్తు నిర్వహణా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) నిషేధాజ్ఞను జారీ చేసింది. సాంప్రదాయిక లేదా సామాజిక మాధ్యమాల ద్వారా జోషీమఠ్‌పై ఎలాంటి సమాచారాన్ని లేక అభిప్రాయాన్ని ప్రజలతో పంచుకోవద్దని ఆదేశించింది. ఎన్‌ఆర్‌ఎస్‌సి, ఇస్రోలను మాత్రమే కాదు; శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి; శాస్త్ర, సాంకేతిక విభాగం; జలవనరుల మంత్రిత్వ శాఖ; ఐఐటీ–రూర్కీతోపాటు సర్వే ఆఫ్ ఇండియా, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి పలు శాస్త్రీయ సంస్థలకు చెందిన పరిశోధనా ల్యాబ్‌ల నోరు మూయించారు.

ఈ సందర్భంగా ఎన్‌డీఎంఏ ఆదేశం కనీవినీ ఎరుగనిదీ. ఎన్‌డీఎమ్‌ఏ కానీ, హోంశాఖ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కానీ శాస్త్రీయ పరిశోధనా సంస్థల మాతృసంస్థలు కావు. కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని ఎన్‌డీఎమ్‌ఏ ఆదేశం సూచించినందున, ఇది రాజకీయ నిర్ణయం మాత్రమే. ఇస్రో, సీఎస్ఐఆర్ వంటి సంస్థలు కాగితం మీద అయినా సరే స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు. ఇవి హోంశాఖ పర్యవేక్షణలో లేనేలేవు. కొద్దినెలల క్రితమే, అన్ని శాస్త్ర విభాగాల కార్యదర్శులతో సమావేశానికి పిలుపునిచ్చిన హోంశాఖ కార్యదర్శి తన అధికారాల పరిధిని అతిక్రమించడమే కాకుండా ఇంతవరకు శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు ఇచ్చిన అవార్డులన్నింటినీ ఒక్క కలంపోటుతో రద్దు చేసిపడేశారు. జన్యుపరంగా పరివర్తింపజేసిన ఆహార ధాన్యాలపై ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలూ చేయవద్దంటూ... పనిచేస్తున్న, రిటైరైన శాస్త్రవేత్తలను ఐసీఏఆర్ ఇటీవలే తీవ్రంగా హెచ్చరించింది.

శాస్త్ర పరిశీలనలపై ఆధారపడిన చర్చలు, వాటి సమాచారాన్ని ప్రజలకు పంచిపెట్టడాన్ని ప్రోత్సహించాలి. అనేక రంగాలలో శాస్త్రవేత్తలు నిత్యం డేటాను పంచుకుంటారు. అమెరికా నేషనల్ ఏరోనాటిక్స్



అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా)కు రిమోట్ సెన్సింగ్ డేటాను నిత్యం షేర్ చేసే పోర్టల్స్ ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడ భూకంపాలు చోటుచేసుకున్నా దానికి సంబంధించిన డేటాను యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెబ్‌సైట్‌లో రియల్ టైమ్‌లో అందుబాటులో ఉంచుతుంటారు. ఇక జెనెటిక్ సీక్వెన్స్ డేటాబేస్‌లు ప్రపంచమంతటా శాస్త్రపరిశోధకులకు అందుబాటులో ఉంటున్నాయి.

ఎన్‌ఆర్‌ఎస్‌సి రూపొందించిన అంచనాల్లో ఒక భాగం, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహం సెంటినెల్–1 నుంచి తీసిన ఛాయాచిత్రాలపై ఆధారపడి ఉంటోంది. ఈ ఉపగ్రహం సింథటిక్ అపెర్చర్ రాడార్‌ని కలిగివుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడూ, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రాత్రింబవళ్లు డేటాను సేకరించడంలో ఇది తోడ్పడుతుంది. ఎన్‌ఆర్‌ఎస్‌సి మదింపులో రెండో భాగం భారతీయ ఉపగ్రహమైన కార్టోసాట్–2ఎస్ నుంచి పంపిన ఛాయాచిత్రాలపై ఆధారపడి ఉంటోంది. ఇది 0.65 మీటర్ల రిజల్యూషన్‌తో అన్ని రంగులను గుర్తించగలిగే ఛాయచిత్రాలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఇఎస్ఏ, ఇస్రో నుండి పొందిన రిమోట్ సెన్సింగ్ డేటాను ఉపయోగించుకునే విశ్లేషణతో ముందుకొచ్చే ఎన్‌ఆర్‌ఎస్‌సి డేటాను ఎవరైనా అభినందించాలి తప్ప ఆంక్షలు విధించరాదు. ఈ విశ్లేషణ... ప్రభావిత ప్రాంతాల్లో నివసించే వారిలోనే కాకుండా, దేశ పౌరుల్లో కూడా గందరగోళాన్ని రేకెత్తిస్తున్నట్లు ఎన్‌డీఎమ్‌ఏ కనిపెట్టింది మరి.

రిమోట్ సెన్సింగ్ డేటాను ఉపయోగించడంపై చర్చ ఉత్తరాఖండ్ ఉదంతం నేపథ్యంలో చోటు చేసుకుంటోంది. ఎందుకంటే భారత్‌లో రిమోట్ సెన్సింగ్ అధ్యయనాలకు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ జన్మస్థలం. ఇక్కడే భారతీయ ఫొటో ఇంటర్‌ప్రెటేషన్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ)ని 1966లో స్థాపించారు. ఇది 1957లో జవహర్‌లాల్ నెహ్రూ నెదర్లాండ్స్ సందర్శన సందర్భంగా కుదిరిన ఒప్పంద ఫలితం. ఐపీఐ... భారతీయ సర్వే సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తుంటుంది. దీన్ని 1969లో ఏర్పడిన ఇస్రోకు బదలాయించారు. ఇప్పుడు ఇది ఇస్రో నేతృత్వంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ పేరిట వ్యవహరిస్తోంది.

మొట్టమొదటి భారతీయ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ 1988లో ఐఆర్ఎస్–1ఏ పేరిట ఆపరేషన్లను ప్రారంభించింది. ఈరోజు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు నాలుగు అత్యధునాతనమైన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలున్నాయి. అవి రిసోర్స్‌శాట్, కార్టోశాట్, ఓషనోశాట్, రైశాట్. భారతీయ ఫారెస్ట్ మ్యాప్ రూపకల్పన కోసం రిమోట్ సెన్సింగ్ డేటాను 1980లలో ఉపయోగించి, ఇస్రో చారిత్రాత్మకమైన తోడ్పాటును అందించింది. ఇది దేశంలో భారీ ఎత్తున అడవుల నరికివేత జరిగిందని చూపించింది. అంతవరకు భారతీయ ఫారెస్ట్ సర్వే సంస్థ (ఎఫ్ఎస్ఐ) రూపొందించిన ఫారెస్టు మ్యాప్‌లతో ఇస్రో మ్యాప్‌లు విభేదించాయి. ఈ కొత్త డేటా వెల్లడించినందుకు నోరు మూసుకోమని ఎవరూ ఆదేశించలేదు. దానికి బదులుగా, భారతీయ ఫారెస్ట్ సర్వే సంస్థ తన మ్యాపింగ్ ప్రక్రియలో రిమోట్ సెన్సింగ్ ఆధారిత టెక్నిక్‌ను పొందుపర్చుకోవడానికి అనుమతించారు. దీనివల్ల అడవుల విస్తీర్ణంపై కచ్చితమైన అంచనాకు రావడం సాధ్యమైంది.

నిపుణుల జ్ఞానాన్ని తొక్కిపెట్టడమనేది ప్రజా హితం కోసం శాస్త్ర విజ్ఞానాన్ని అన్వయించే విషయంలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. ఇది వ్యక్తిగతంగా ఒక శాస్త్రజ్ఞుడు తమ అభిప్రాయాలను వ్యక్తపర్చడానికి, డేటాను షేర్ చేసే హక్కుకు సంబంధించిన విషయం కాదు. అది ప్రభుత్వ విధాన నిర్ణయంలో, ప్రజాభిప్రాయాన్ని మలచడంలో సైన్స్ పాత్రకు సంబంధించిన విషయం. డేటాను పంచుకోవడం, నిపుణుల అభిప్రాయాలు లేక పరిశోధనా పత్రాలు అనేవి... జీఎం– ఆహార పదార్థాలు, హిమాలయ పర్యావరణం, నాసిరకం మందులు, డేటా గోప్యత లేదా సూక్ష్మజీవుల నిరోధకత వంటి పలు స్పర్థాత్మక అంశాల్లో ఆరోగ్యకరమైన చర్చలకు వీలుకల్పిస్తాయి.

పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, వివిధ అంశాలపై నిపుణులతో కూడిన విద్యా కేంద్రాలకు సంబంధించి విస్తారమైన నెట్‌వర్క్ కలిగి ఉన్న భారత్ వంటి దేశంలో, భిన్నాభిప్రాయాలు నిత్యం రంగంమీదికి వస్తుంటాయి. ఇలాంటి విభేదాలను సైంటిస్టులు, విద్యావేత్తలు, పౌర సమాజం తోడ్పాటుతో ఆరోగ్యకరమైన ప్రజా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. 1980లలో, కైగా అణు విద్యుత్ సంస్థపై తీవ్రవివాదం నెలకొన్న నేపథ్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్... దేశంలోని అణు శాస్త్రవేత్తలు, పర్యావరణ కార్యకర్తల మధ్య ఒక చర్చను నిర్వహించింది. ఈరోజుల్లో అలాంటి చర్చలనుంచి పరిశోధనా మండలులు, విద్యా సంస్థలు దూరం జరుగుతున్నారు. వీటి మౌనంతో శాస్త్ర పరిశోధనా సంస్థల స్వయం ప్రతిపత్తిని మరింతగా క్షీణింప జేసేందుకు ప్రభుత్వానికి ప్రోత్సాహం లభిస్తోంది.

వ్యాసకర్త శాస్త్ర వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కంగ్రాట్స్ ఢిల్లీ!



చాలా కాలం తర్వాత, ప్రపంచంలోని అత్యంత కలుషిత నగరాల జాబితాలో ఢిల్లీ లేదు. ఢిల్లీవాసుల ప్రయత్నాలు నెమ్మదిగానే అయినా కచ్చితంగా ఫలితం ఇస్తున్నాయి. ఢిల్లీకి అభినందనలు. కానీ ఇంకా చేయవలసింది చాలా ఉంది. ప్రపంచంలోని అత్యంత శుభ్రమైన నగరాల్లో మనల్ని లెక్కించాలి.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

ద్వేషంతో నష్టమే!



ఉత్తర భారతీయులు, హిందీ మాట్లాడే వాళ్ల మీద విద్వేష ప్రసంగాలు ఆగిపోవాలి. తమిళ జాతీయవాదులు, ద్రవిడ ఎకోసిస్టమ్ ఇందులో ఉమ్మడి పాత్రలు. రాష్ట్రానికి ఇది నష్టం కలిగిస్తుంది. ఈ ప్రమాదానికి ప్రజలు మేలుకుంటారని ఆశ.

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

అంతా ఆయనే!



ఒక టిప్. ట్విట్టర్ సీఈఓ ఎలాన్ మస్క్‌ను ట్విట్టర్‌లో ఫాలో కావొద్దు. మీ టైమ్‌లైన్‌లో సగం ఆయన ట్వీట్స్, రిప్లైలే ఉంటాయి. మిగిలినవి దాన్ని లైక్ చేసిన వాళ్లవీ, రీట్వీట్ చేసినవాళ్లవీ ఉంటాయి. – అరుణ్ బోత్రా, ఐపీఎస్ అధికారి

తప్పు జరిగిందప్పుడే!



చాలా స్పష్టంగా, గట్టిగా చెబుతున్నాను. నేను పాకిస్తాన్ ద్రోహిని కాను. ద్రోహులు ఎవరంటే 1947లో తమ మాతృదేశమైన భారత్‌ను వదిలిపెట్టి పాకిస్తాన్‌కు వెళ్లిపోయినవారు. నేను ఆ తప్పును సరిదిద్దుతున్నాను. – పాయన్ అలీ, ఫ్రీ థింకర్

మీరేం చేశారని?



ఒక ప్రైవేటు కంపెనీ అయినా టాటా 450 విమానాలకు ఆర్డరిచ్చింది. భారత ప్రభుత్వం 'ఎయిర్ ఇండియా'ను వాళ్లకు అమ్మింది. మరి దీనికి బీజేపీకి చెందిన మోదీకి ఎందుకు శుభాకాంక్షలు చెబుతున్నారు? నవ్వొస్తోంది. మనం ఏమైనా నవ్వులాటగా మారిపోయామా?

– సంజయ్ ఝా, కాంగ్రెస్‌వాది

అనారోగ్య నగరం



ముంబయి ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరాల్లో రెండో స్థానంలో ఉంది. మా నాన్న కేవలం మూడ్రోజులు ఉండి, తీవ్రమైన దగ్గుతో తిరిగివెళ్లారు. స్టెరాయిడ్స్ తీసుకున్న తర్వాతే అది తగ్గింది. నాకు తెలిసినవాళ్లలో సగం మంది ఈ శీతాకాలంలో అనారోగ్యం పాలయ్యారు. మనకేమైనా ప్రణాళిక ఉందా?

– నిఖిల్ ఇనాందార్, జర్నలిస్ట్

నాటోతో చేటు



నాటో అనేది స్వీయరక్షణ కోసం ఉద్దేశించిన కూటమి కాదు. అదొక యుద్ధ యంత్రం. కావాలంటే అఫ్గానిస్తాన్, ఇరాక్, లిబియా జనాలను అడిగి చూడండి. అది యూరప్ ప్రజలకు ఇవ్వగలిగింది ఏమీలేదు. అమెరికా సామ్రాజ్యం, మిలిటరీ కర్మాగారాల ప్రయోజనాలను కాపాడటానికి అది ఉనికిలో ఉంది. అది ఎప్పుడూ యుద్ధాన్ని ప్రోత్సహిస్తుంది, ఎన్నడూ శాంతిని ప్రోత్సహించదు. నాటోను రద్దు చేయాలి. – మిక్ వాలెస్, ఐర్లాండ్ రాజకీయనాయకుడు

ఇన్‌బాక్స్

మోసపూరితం

ఇటీవల జీఓ 317కు వ్యతిరేకంగా రేకెత్తిన ఆందోళనలను తగ్గించడానికి కొందరినైనా సొంత జిల్లాలకు పంపే ప్రయత్నంలో ప్రభుత్వం ముందుకు వచ్చి పరస్పర బదిలీల పేరుతో సర్వీసు రక్షణ కల్పిస్తూ కొన్ని బదిలీలను నిర్వహించింది. కానీ కోర్టు ప్రమేయంతో సర్వీస్ ప్రొటెక్షన్ రద్దు కావడం జరిగింది.

కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం గమనించాలి. ఈసారి జరిగిన మ్యూచువల్ బదిలీలు కేవలం జీఓ 317 బాధితుల కోసం ప్రత్యేకంగా నిర్దేశించబడినవి. ఈ బదిలీల్లో ప్రభుత్వం ఒక కండీషన్ పెట్టింది. దాని ప్రకారం పరస్పర బదిలీల జంటలో కనీసం ఒకరైనా జీఓ 317 బాధితుడై ఉండాలి. ఈ కండీషన్ పెట్టడం వల్ల ఈ మ్యూచువల్ బదిలీలు విభిన్నమైనవిగా మారాయి. నిజమైన మ్యూచువల్ బదిలీలలో ఎలాంటి కండీషన్లు ఉండవు. అందువల్ల ఇవి అసలు పరస్పర బదిలీలే కావు. కాబట్టి వీటిని జీఓ 610 బదిలీలుగా చూపి సేవారక్షణ కల్పించాలి. లేదంటే విద్యాశాఖ ఉపాధ్యాయులను మోసగించినట్లే అవుతుంది. – చేపూరి శ్రీరాం
ఉపాధ్యాయుడు, హన్మకొండ

మరీ గన్ని అబద్ధాలా!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్తకు బోయిన. గాడ రవి పాన్ డబ్బా ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గాడ జమైతరు. గాదాని మీద గీదాని మీద నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెడ్తరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింద్రో నాకు ఎర్కలేదు. గని నేను డబ్బ కాడ్కి బోయినంక గాల్లు ఇట్ల మాట్లాడుకుంటున్నరు.

''హాత్ సే హాత్ జోడో అన్కుంట అందరికి చెయ్యిచ్చు కుంట ములుగు కెల్లి రేవంత్ రెడ్డి పాదయాత్ర షురువు జేసిండు. ఒక దిక్కు గాయన పాదయాత్ర జేస్తుంటె కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డగోల్ మాటలు షురువు జేసిండు. వచ్చేటి అసెంబ్లి ఎలచ్చన్ల ఏ పార్టీకి అర్వై సీట్లు రావు. అందరం కలిసి పని జేస్తే కాంగ్రెస్‌కు నల్బై కెల్లి యాబై సీట్లు వస్తయి. తెలంగానల హంగ్ సర్కారొస్తది. కాంగ్రెస్, బిఆర్ఎస్ గల్సి సర్కార్ ఏర్పాటు జేస్తయి అని అన్నడు'' అని పాన్ నమ్ముకుంట సత్నారి జెప్పిండు.

''ఒకలేమొ జోడో అంటుంటె ఇంకొకలు తోడో అంటున్నరు. పాదయాత్ర జేస్కుంట వొచ్చెపారి కాంగ్రెస్ సర్కారొస్తదని రేవంత్ అంటున్నడు. ఏ పార్టికి మెజార్టి రాదు. బిఆర్ఎస్, కాంగ్రెస్ గల్సి హంగ్ సర్కార్ ఏర్పాటు జేస్తయని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నడు. గాయినట్లనంగనే కాంగ్రెస్ లీడర్లు మొత్తుకున్నరు. కాంగ్రెస్ల అందరు ఒకే మాటమీద ఉండరు. ఒకరు ఎడ్డెం అంటె ఇంకొకరు తెడ్డెం అంటరు. కాంగ్రెసోల్లు దొంగలు, బిఆర్ఎస్సోల్లు గూడ దొంగలే. దొంగలు దొంగలు గల్సి ఊర్లు పంచుకొన్న తీర్గ గీ రొండు పార్టీల లీడర్లు గల్సి సర్కారు పంచుకుంటమని అంటున్నరు. కాంగ్రెస్ దిక్కుకెల్లి గెల్సినోల్లు బిఆర్ఎస్ల దుంకుతరు. ఇంతకుముందు పన్నెండు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టిఆర్ఎస్ల దుంకలేదా? అని బండి సంజయ్ అన్నరు'' అని యాద్గిరి జెప్పిండు.

''కొత్త సెక్రెటేరియట్‌ను ఎన్నడు దెరుస్తరు?'' సిగలేట్ దాక్కుంట ఇస్తారి అడిగిండు. ''వాస్తు బాగలేదనుకుంట పాత సెక్రెటేరియట్‌ను కెసిఆర్ కూలగొట్టిచ్చిండు. గాదాని జాగల కొత్త సెక్రెటేరియట్‌ను కట్టిపిచ్చిండు. గాయిన నచ్చత్రం పకారం వచ్చే పదిహేడో తారీకు మంచిగున్నదని అయ్యగార్లు జెప్పింద్రు. మంచి మూర్తం గూడ బెట్టింద్రు. కొత్త సెక్రెటేరియట్‌ను తెర్సిన దినం నాడే పరేడ్ మైదాన్ల బిఆర్ఎస్ పబ్లిక్ మీటింగ్ బెడ్దామని కెసిఆర్ అనుకుండు. పదిహేడో తారీకు కెసిఆర్ పుట్టిన దినం. పుట్టిన దినం నాడే కొత్త సెక్రెటేరియట్ల కాలు బెడ్దామని ముఖ్యమంత్రి అనుకుండు. గని గాయిన ఒకటనుకుంటె ఒకటయ్యింది. కొత్త సెక్రెటేరియట్ల మంటలు లేసినయి. శాన్దార్గ గట్టిన సెక్రెటేరియట్‌ను జూసిన అపోజిసనోల్లు కండ్లల్ల నిప్పులు బోసుకున్నరు. గాల్ల దిస్టితోనే కొత్త సెక్రెటేరియట్ల మంటలు లేసినయని ముఖ్యమంత్రి అన్నడు. గీ నెలల గాకుంట ఏప్రిల్ నెలల సెక్రెటేరియట్‌ను దెరుస్తరట'' అని సత్నారి అన్నడు.

''రొండు ఎమ్మెల్సి ఎలచ్చన్లు వొచ్చెబట్కె సెక్రెటేరియట్ తెర్సుడు వాయిద బడ్డ దంటున్నరు నిజమేనా?''

''నిజమే. సెక్రెటేరియట్ గుమ్మటాలతోని తాజ్‌మహల్ తీర్గ గండ్లబడ్తున్నది. మా బిజెపి సర్కార్ గినొస్తే గా గుమ్మటాలను కూలగొడ్తమని బండి సంజయ్ అన్నడు.''

''వాస్తు బాగలేదని ఒకలు కూలగొట్టింద్రు. గుమ్మటాలున్నాయని ఇంకొకలు కూలగొడ్త మంటున్నరు. కూలగొట్టుడు, కట్టుడు, జెనం పైసలను పుజాల్ల కర్సుబెట్టుడు. పెద్ద పెద్ద మాటలు జెప్పుడు. పెద్ద పెద్ద మాటలు జెప్పుకుంట పంగ నామాలు బెట్టుడు. గిదే గియ్యాల్రేపు లీడర్లు జేస్తున్న పని.''

''ఎమ్మెల్సి ఎలచ్చన్ల కోడ్ అమల్ల కొచ్చింది. ఇక దాంతోని వికారాబాద్ల ఎన్టీఆర్ బొమ్మ నిండ బట్ట గప్పింద్రు. గని గా బొమ్మ చెయ్యి సూబెడ్తున్న దిక్కు సూస్తె కెసిఆర్ పోట్వ తీసి ఉన్న కంటి వెలుగు హోర్డింగ్ గండ్లబడ్తున్నది. ఒక హోటల్ మీద బెట్టిన గీ హోర్డింగ్‌ను దియ్యలేదు. నాకే ఎలచ్చన్ల కోడా? కెసిఆర్ పోట్వకు లేదా? అని ఎన్టీఆర్ అడుగుతున్న తీర్గ ఉన్నదని జెనమంటున్నరు. కంటి వెలుగుల హోర్డింగ్‌ను కండ్లబడకుంట జేస్తె బాగుంటదా అని ఆపిసర్లు అడుగుతున్నరు.''



''ఎప్పుడు మన్‌కీ బాత్ అనుకుంట ఏదో ఒకటి జెప్పేటి మోదీ అందరు ఒక్క తీర్గ లొల్లి బెడ్తున్నా 'మౌనమే నీ బాస ఓ మూగ మనసా' అనుకుంట సప్పుడు జేస్తలేడు. మన్ కీ బాత్ అన్కుంట ఒక్క మాట గూడ మాట్లాడుతలేడు'' అని యాద్గిరి అన్నడు.

''గీ నడ్మ పట్నం తొవ్వలు కుంగిపోతున్నయి. తొవ్వలు కుంగబట్కే పెద్ద గుంతలు ఏర్పడుతున్నయి. ఎందుకంటవు'' అని ఇస్తారి అడిగిండు. ''ఇర్వైనాల్గ్గంటలు రైతులకు కరెంటిస్తున్నం. దలిత బంధు పద్కం కింద దలితులకు లచ్చల రూపాయలిస్తున్నం. సర్కారు జీతగాల్లకు పహలీ తారీకుకే జీతాలిస్తున్నం. గిసువంటి అబద్దాల మీద అబద్దాలు కెసిఆర్ జెప్తున్నడు. గీ అబద్దాల బర్వుకు తొవ్వలు కుంగిపోతున్నయి'' అని సత్నారి అన్నడు. నాత్రి తొమ్మిది గొట్టేదాంక ముచ్చట బెట్టినంక మా దోస్తులు ఎవలింటికి ఆల్లు బోయింద్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

అతీతుడు!

ఆయన పేరేమిటి అంటే... శివుడనీ, శంకరుడనీ, మహేశ్వరుడనీ, నీలకంఠుడనీ, పశుపతి అనీ, త్రిలోచనుడనీ, గంగాధరుడనీ, చంద్రశేఖరుడనీ, నాగభూషణుడనీ అంటారు. ఇవన్నీ పేర్లు ఎలా అవుతాయి? శివుడంటే శుభమయుడనీ, శంకరుడంటే క్షేమకరుడనీ ఇలా... ఇవన్నీ ఆయన వర్ణనలు, లక్షణాలు.

ఆయన ఎలా ఉంటాడంటే, ఒక లింగాకారం చూపిస్తారు. లింగం అంటే రూపం కాదు. ఏ రూపమూ లేని దానికి చిహ్నం, ప్రతీక, ప్రత్యామ్నాయం. దానికే రూపం లేదు. మేమడిగేది ఆయన 'మూర్తి' గురించయ్యా అంటే... ఆయనకు గాలి ఒక మూర్తి, నేల ఒక మూర్తి, నింగి ఒక మూర్తి, నిప్పు ఒక మూర్తి, నీరు ఒక మూర్తి, సూర్య చంద్రులు ఆయన మూర్తులు అంటూ ఎనిమిది ఏకరువు పెడతారు. కానీ పంచభూతాలనూ, ప్రాకృతికమైన జ్యోతులనూ పట్టుకొని ఆయన మూర్తులంటే ఎలాగ, ఆయన అసలు మూర్తి ఏమిటో చెప్పమని రెట్టిస్తే... ఆయనది అర్ధనారీశ్వర మూర్తి అంటారు. దేహంలో సగం తనూ, సగం తన భార్యా అట. అన్నీ కనీ వినీ ఎరగని ఊసులు!



కాస్త అర్థమయేలా చెప్పండి, ఆయనకు మనకులా కళ్ళూ ముక్కూ ఉండవా అంటే... కళ్ళు లేకపోవటమేమిటి, మూడు కళ్ళు అంటారు. ఒకటి ఫాలనేత్రమట. చూసే కన్ను కాదు, కాల్చేసే కన్ను. ఆయన నడినెత్తిన నదీమతల్లి నాట్యం చేస్తుందంటారు. జటాజూటాల్లో జాబిల్లి వచ్చి పూవుగా కూర్చొన్నాడంటారు. నమ్మ శక్యమేనా?

పోనీ ఆయన చేసే పనేమిటో అయినా చెప్పమంటే, ఆయన భక్తవత్సలుడు, కానీ సమయం చూసి లోకాలన్నిటినీ లయం చేస్తాడు అంటారు. ఆకలయితే బిచ్చమెత్తుకొంటాడు, కానీ అడిగినప్పుడు ఇంద్రాదులకు కూడా అష్టైశ్వర్యాలిచ్చేది ఆయనే అంటారు.

అసలీ శుష్క చర్చంతా ఎందుకు? ఆయన నామ రూపాతీతుడూ, భావాతీతుడూ, లోకాతీతుడూ, కాలాతీతుడూ అని ఒక్క మాటలో చెప్పచ్చుగదా? అది గ్రహించి మనమూ ఆ సర్వ వ్యాపికీ, సర్వజ్ఞుడికీ, సర్వ శక్తి శాలికీ, సకల లోక రక్షకుడికీ, సర్వ కామ్య ప్రదాతకూ సభక్తికంగా సాష్టాంగ నమస్కారం చేసి చక్కగా ఇహమూ, పరమూ సంపాదించుకొంటాం గదా!

మహాశివరాత్రి సందర్భంగా మహేశ్వరుడికి వందవేల వందనాలు!

–ఎం. మారుతిశాస్త్రి
(రేపు మహా శివరాత్రి పర్వదినం)

ఆదివాసీలకు టీటీడీపీ మద్దతు

సాక్షి, హైదరాబాద్: పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని ఆదివాసీలు చేపట్టిన ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చెప్పారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్‌తో భేటీ అయ్యారు.





మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నుంచి ఇంటి పత్రాలు అందుకుంటున్న షూటర్ ఈషా సింగ్ తల్లి శ్రీలత, మొగిలయ్య. చిత్రంలో గువ్వల బాలరాజు, సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు

క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం

- క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- షూటర్ ఈషా సింగ్, కిన్నెర మొగిలయ్యలకు ఇళ్ల స్థలాల పత్రాలు అందజేత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తమ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారని తెలిపారు. గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రముఖ షూటర్ ఈషా సింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగిలయ్యలకు ఒక్కొక్కరికి 600 గజాల ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. షూటర్ ఈషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్‌లు వివిధ క్రీడాపోటీల్లో తెలంగాణ ప్రతిభను చాటి చెప్పారని, వారికి రూ. 2 కోట్ల చొప్పున ప్రభుత్వ నజరానాతో పాటు 600 చదరపు గజాల ఇంటి స్థలాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి గౌరవిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం త్వరలో నూతన స్పోర్ట్స్ పాలసీని తీసుకురానున్నట్లు వెల్లడించారు. పాలమూరుకు చెందిన కిన్నెర కళాకారుడు మొగిలయ్య ప్రతిభను తెలంగాణ ప్రభుత్వమే తొలుత గుర్తించి గౌరవించిందని అన్నారు. ఆయనకు కుటుంబ పోషణకోసం నెలకు రూ. 10 వేలు ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. కిన్నెర కళను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన తరువాతే కేంద్రం మొగిలయ్యకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా కోటి రూపాయల నజరానాతో పాటు ఇంటి స్థలం పట్టా పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని.. తదనుగుణంగా ఆయన కోరుకున్న చోట ఇంటి స్థలం ఇస్తున్నామని తెలిపారు. కాగా, తన కళను గుర్తించి గౌరవించడంతో పాటు ఇంటి స్థలం, కోటి రూపాయలు ఇచ్చిన మహనీయుడు కేసీఆర్ అని కిన్నెర మొగిలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

కొందరికి జూబ్లీహిల్స్.. మొగిలయ్యకు బీఎస్ రెడ్డి నగర్‌లోనా?

పద్మశ్రీ అవార్డు గ్రహీత, కిన్నెర కళాకారుడు మొగిలయ్యకు తెలంగాణ ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయింపుపై అచ్చంపేట ఎమ్మెల్యే బాలరాజు అసహనానికి గురయ్యారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా బాలరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు చెప్పకుండానే మొగిలయ్యకు ఇంటి స్థలం పంపిణీ చేశారని, స్థానిక శాసనసభ్యుడిగా స్థలం పంపిణీ కార్యక్రమం గురించి తనకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతి, ఖ్యాతిని జాతీయ.. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన క్రీడాకారులు, కళాకారులకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో స్థలాలు ఇచ్చారని, మొగిలయ్యకు మాత్రం బీఎస్‌రెడ్డి నగర్‌లో ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అయితే, తదనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో తనకు విభేదాలు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం గురించి తనకు ముందస్తు సమాచారం లేకపోవడంపై మాత్రమే మంత్రి సహాయక సిబ్బందిపై తాను ఆగ్రహం వ్యక్తం చేశానని బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు.

తాబేదార్లను ఉసిగొలుపుతున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మతిభ్రమించి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ధ్వజమెత్తారు. త్వరలో అధికారం గల్లంతవడం ఖాయమన్న ఆందోళనతోనే సీఎం కేసీఆర్ తన తాబేదార్లను ఉసిగొల్పి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను తిట్టిస్తున్నారన్నారు.





బీసీ సంక్షేమ శాఖ మంత్రి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కృష్ణయ్య తదితరులు

బీసీ సంక్షేమ బడ్జెట్ పెంచాలి

- రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్

పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేటాయించిన రూ.6,229 కోట్లు ఏమాత్రం సరిపోవని, దాన్ని రూ.20 వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వందలాది మంది విద్యార్థులు, యువకులతో కలిసి గురువారం ఖైరతాబాద్‌లోని బీసీ సంక్షేమ శాఖమంత్రి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్‌ల నాయకత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లు అయితే.. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సంక్షేమానికి రూ.6,229 కోట్లు కేటాయిస్తే ఏమూలకు సరిపోతుందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కొత్త పథకాలేవీ లేవని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు, మెస్‌చార్జీల పెంపు ప్రస్తావనే లేదని, కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీకి బడ్జెట్ కేటాయింపుల్లేవని విమర్శించారు. ఈ విద్యా సంవత్సరంలో 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్న హామీకి బడ్జెట్ లేదని కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐక్య ఉద్యమాలతోనే ఎదుగుదల

సాక్షి, హైదరాబాద్: రానున్న రోజుల్లో పద్మశాలి సమాజం రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు పోవాలంటే ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, దానికి యువకులే ముందుండి పోరాడాలని ఎమ్మెల్సీ రమణ కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన ప్రథమేశ్ కుమార్ కోటే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పాల్గొన్నారు. కాగా, అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా బొడ్ల తిరుపతి నియమితులయ్యారు. ఈ విషయాన్ని కందగట్ల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా...

'బీబీసీ'లో మూడో రోజూ..

న్యూఢిల్లీ: ఢిల్లీలోని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) కార్యాలయంలో వరుసగా మూడో రోజు గురువారం సర్వే కొనసాగింది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బీబీసీ ఉద్యోగుల నుంచి సంస్థ ఆర్థిక వ్యవహారాల డేటాను సేకరించారు. ఎలక్ట్రానిక్, పేపర్ డేటా కాపీలను తీసుకున్నారు. ఆదాయపు పన్ను శాఖ సర్వేతో ఎలాంటి ఇబ్బంది లేదని, భారత్‌లో తమ చానల్ ప్రసారాలు యథాతథంగా సాగుతున్నాయని ఢిల్లీలోని బీబీసీ ఆఫీసు సిబ్బంది తెలియజేశారు. 60 గంటలపాటు సాగిన సోదాలు గురువారం ముగిశాయి.

లంకలో కరెంట్ చార్జీల మోత

కొలంబో: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) నిబంధనలు శ్రీలంక ప్రజల పాలిట పెను భారంగా మారుతున్నాయి. ఐఎంఎఫ్ విధించిన నిబంధనలకు తలొగ్గిన శ్రీలంక ప్రభుత్వం విద్యుత్ చార్జీలను 66 శాతం పెంచేస్తూ నిర్ణయం తీసుకుంది. కరెంటు చార్జీలు పెంచడం గత ఆరు నెలల్లో ఇది రెండోసారి. బిల్లుల పెంపు నేపథ్యంలో విద్యుత్ కోతలకు గురువారం నుంచే తెరపడింది. ఇకపై నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. శ్రీలంకలో గత ఏడాది కాలంగా కరెంటు కోతలు కొనసాగాయి. నిత్యం ఒక గంట నుంచి 14 గంటలదాకా కరెంటు సరఫరా నిలిపివేశారు. రుణం ఇవ్వాలంటే విద్యుత్ చార్జీలు పెంచాలని ఐఎంఎఫ్ స్పష్టం చేయడంతో శ్రీలంక ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. ఐఎంఎఫ్ నుంచి 2.9 బిలియన్ డాలర్ల రుణం తీసుకోనుంది.

జేపీసీ తప్ప మరేదైనా వృథాయే

న్యూఢిల్లీ : పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యవహారంలో సమగ్ర విచారణ అత్యంత అవసరమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ విషయంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తప్ప మరే కమిటీ వేసినా వృథా ప్రయాసేనని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటుపై సుప్రీం కోర్టు దగ్గర ప్రతిపాదనలు చేస్తే , ఈ అంశంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు అవుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదానీ ఆస్తులకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదికలో వచ్చిన ఆరోపణలపై నిపుణులతో కమిటీ వేయాలని సుప్రీం కోర్టు ఈ నెల 13న జరిపిన విచారణలో అభిప్రాయపడిందని, దీనిపై కేంద్రం 17లోగా స్పందించాల్సి ఉందని జైరామ్ రమేష్ గుర్తు చేశారు. జేపీసీ మినహాయించి ఎలాంటి చట్టబద్ధ కమిటీలు వేసినా ఈ విషయంలో ఉపయోగం ఉండదని అన్నారు.

అధ్యక్ష పోటీకి రిపబ్లికన్ల పోటీ

ట్రంప్‌కు సవాల్ విసురుతున్న డెసాంటిస్, హేలీ, పెన్స్, పాంపియో ● వీరవిధేయులే వ్యతిరేకులుగా మారిన వైనం

ఒకప్పుడు అందరూ ట్రంప్‌కి వీరవిధేయులు
ఇప్పుడు అధ్యక్ష అభ్యర్థిగా ఆయనకే సవాల్ విసురుతున్నారు
ట్రంప్ ఓటమిపాలైనప్పుడు ఆయన వెన్నంటి నడిచిన వారు
కేపిటల్ హిల్‌పై దాడి జరిపినప్పుడు ఆయనకు మద్దతుగా ఉన్నవారు
ఇప్పుడు ఆయనకు ఎదురు తిరుగుతున్నారు
రిపబ్లిక్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీలో ట్రంప్ సన్నిహితులే సై అంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



అమెరికాలో అధ్యక్ష బరిలో దిగడం కోసం పబ్లికన్ పార్టీలో పోటీ పెరిగిపోతోంది. భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ తాను పోటీలో ఉన్నట్టు ప్రకటించగానే ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. అమెరికాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ట్రంప్ అనుచరులందరూ ఓటమి పాలవడంతో పార్టీలో ఆయనపై విశ్వాసం సన్నగిల్లుతోంది. అధ్యక్ష ఎన్నికల సమయానికి ఆయనకు 78 సంవత్సరాలు మీద పడతాయి. దీంతో ఒకప్పుడు ట్రంప్‌కు మద్దతునిచ్చినవారే ఇప్పుడు ఆయనపై పోటీకి సై అంటున్నారు.అయితే పోటీ ప్రధానంగా డొనాల్డ్ ట్రంప్, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్ మధ్య ఉంటుందని అంచనాలున్నాయి.

రాన్ డెసాంటిస్

ట్రంప్‌కి గట్టి పోటీ ఇచ్చే వారిలో ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్ ముందు వరుసలో ఉంటారనే అంచనాలున్నాయి. ఇప్పటివరకు ఆయన తాను బరిలో ఉన్నట్టు ప్రకటించకపోయినప్పటికీ పార్టీలో ట్రంప్ వ్యతిరేక వర్గం రాన్‌కు జై కొడుతోంది. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ఫ్లోరిడా గవర్నర్‌గా 15 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో రాన్ నెగ్గారు. 44 ఏళ్ల వయసున్న రాన్ హార్వర్డ్‌లో లా డిగ్రీ పొందారు. నేవీలో పనిచేశారు. అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రజాప్రతినిధుల సభ్యునిగా 2013 నుంచి 2018 వరకు ఉన్నప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. రాన్ డెసాంటిస్‌కు రాజకీయాల్లో గుర్తింపు, ఒక లైఫ్ ఇచ్చింది ట్రంపే. 2019 ఎన్నికల్లో ఫ్లోరిడా గవర్నర్‌గా రాన్ అభ్యర్థిత్వాన్ని ట్రంప్ బాహాటంగా బలపరచడంతో ఆయన నెగ్గగలిగారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఫ్లోరిడా గవర్నర్‌గా గత 40 దశాబ్దాల్లో ఎవరికీ దక్కని మెజార్టీతో తిరిగి ఎన్నికయ్యారు. కరోనా సంక్షోభం సమయంలో ప్రజలకు విపరీతమైన స్వేచ్ఛ ఇచ్చారు. మాస్కులు, టీకాలు తప్పనిసరి చేయకపోవడంతో ప్రజలు ఆయనను బాగా అభిమానించారు. దాదాపుగా ట్రంప్ భావాలే ఉన్నప్పటికీ, దుందుడుకు ధోరణితో కాకుండా సౌమ్యంగా వ్యవహరించడం వల్ల ట్రంప్ వ్యతిరేక వర్గానికి ఒక ఆశాదీపంలా కనిపిస్తున్నారు.



నిక్కీ హేలీ

భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం బరిలో ఉన్నట్టు ప్రకటించి ప్రచారం మొదలుపెట్టడంతో రాజకీయాలు హీటెక్కాయి. ట్రంప్ తర్వాత అధికారిక ప్రకటన చేసిన రెండో అభ్యర్థి నిక్కీ. ఒకప్పుడు రిపబ్లికన్ పార్టీలో యువ కెరటంగా చరిష్మా ఉన్నప్పటికీ, ఇటీవల ఆమె ప్రభ నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. పంజాబ్ నుంచి అమెరికాకు వలస వెళ్లిన కుటుంబానికి చెందిన నిక్కీ అక్కడి దక్షిణ కరోలినా తొలి మహిళా గవర్నర్‌గా చేశారు. 2016లో ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించినా ఆయన అధ్యక్షుడయ్యాక ఆమె రాజీకొచ్చారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా పని చేశారు. ఐరాస భద్రతా మండలి సమావేశం జరుగుతుండగా నాటకీయ పరిణామాల మధ్య పదవి నుంచి వైదొలిగారు.




మైక్ పాంపియో



డొనాల్డ్ ట్రంప్ హయాంలో సీఐఏ డైరెక్టర్‌గా, విదేశాంగ మంత్రిగా పదవులు నిర్వహించిన మైక్ పాంపియో చివరి వరకు ఆయనకు విధేయుడిగానే ఉన్నారు. ట్రంప్ విదేశీ విధానాలను ముందుకు తీసుకువెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. కేపిటల్ హిల్‌పై దాడి జరిగిన సమయంలో కూడా ట్రంప్‌కు మద్దతుగా ఉన్నారు. ''చరిత్ర మమ్మల్ని బాగా గుర్తు పెట్టుకుంటుంది'' అని వ్యాఖ్యానించి వార్తల్లో నిలిచారు. వెస్ట్ పాయింట్ మిలటరీ అకాడమీలో గ్రాడ్యుయేషన్, హార్వార్డ్ యూనివర్సిటీ లా డిగ్రీ చేసిన పాంపియో ఇప్పుడు తన మాజీ బాస్‌నే ఎదిరించడానికి సిద్ధమవుతున్నారు. అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడతానని సన్నిహితుల వద్ద వెల్లడించారు. ఇక అధికారికంగా బరిలో దిగడమే మిగిలి ఉంది.

మైక్ పెన్స్



ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉపాధ్యక్షుడిగా అత్యంత విధేయత ప్రకటించిన మైక్ పెన్స్ ఈసారి అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడతారని చెబుతున్నారు. 2021 జనవరిలో కేపిటల్ హిల్‌పై దాడి జరిగే వరకు ఇరువురి మధ్య మంచి అనుబంధం కొనసాగింది. ఆ దాడుల తర్వాత ట్రంప్, పెన్స్ సంబంధాలు క్షీణించాయి. 2020 అధ్యక్ష ఎన్నికల్లో కిందపడినా పై చేయి తనదేనని చాటి చెప్పడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు సహకారం అందించడానికి పెన్స్ నిరాకరించారు. అప్పట్నుంచి పెన్స్‌పై గుర్రుగా ఉన్న ట్రంప్ ఆయనని ఒక పిరికివాడుగా ముద్ర వేస్తూ వ్యాఖ్యలు చేశారు. పెన్స్‌కి మృదుస్వభావిగా పార్టీలో మంచిపేరుంది. తొలిసారిగా 2000 సంవత్సరంలో ప్రతినిధుల సభకు ఎన్నికైన పెన్స్ 2013 వరకు కాంగ్రెస్ సభ్యునిగా ఉన్నారు. 2013 నుంచి 2017 వరకు ఇండియానా గవర్నర్‌గా పని చేశారు. కరడుగట్టిన సంప్రదాయవాదిగా ముద్రపడిన పెన్స్ 2016లో ట్రంప్ అభ్యర్థిత్వానికి గట్టి మద్దతుదారుడిగా ఉన్నారు. ఇప్పుడు ఆయనపైనే పోటీకి సై అంటున్నారు.

రిపబ్లికన్లలో ట్రంప్‌కు మద్దతు ఎంత ?

ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిగా పోటీకి దిగుతున్నానని ప్రకటించిన తర్వాత మిశ్రమ స్పందన కనిపించింది. ప్రస్తుతం అమెరికా ఉన్న పరిస్థితిల్లో ట్రంప్ వంటి దుందుడుకు ధోరణి కలిగిన వాడే అధ్యక్ష అభ్యర్థిగా ఉంటే గెలుపు సాధిస్తామని కొందరు భావిస్తూ ఉంటే మరికొందరు ట్రంప్ నోటి దురుసును అసహ్యించుకుంటున్నారు. ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో రెడ్ వేవ్ వస్తుందని అత్యధికులు ఆశించారు. అధ్యక్షుడు జో బైడెన్ పట్ల నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవడంలో రిపబ్లికన్లు విఫలమయ్యారు. మరీ ముఖ్యంగా ట్రంప్ అనుచరులందరూ ఓటమి పాలవడం, కేపిటల్ హిల్‌పై దాడికి సంబంధించిన కోర్టు కేసుల్లో ఇరుక్కోవడం వంటి పరిణామాలతో ట్రంప్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్ విధానాలకు గ్రాండ్ ఓల్డ్ పార్టీలో అత్యధికులు మద్దతు చెబుతున్నా వాటిని అమలు చేయడంలో ట్రంప్ చూపిస్తున్న దూకుడు స్వభావాన్ని వ్యతిరేకిస్తున్నారు. 40 శాతం మంది ట్రంప్‌కు మద్దతుగా ఉంటే, 60 శాతం మంది వేరొకరు అధ్యక్ష అభ్యర్థిగా ఉండాలని కోరుకుంటున్నట్టు సర్వేలో తేలింది. 30 నుంచి 50 శాతం మంది ఫ్లోరిడా గవర్నర్ డెసాంటిస్‌కు మద్దతివ్వడం విశేషం. అధ్యక్ష అభ్యర్థి ఎన్నికలు పూర్తయ్యే సమయానికి పరిణామాలు వేగంగా మారిపోయి ట్రంప్‌కి అనుకూల పరిస్థితులు వస్తాయన్న అంచనాలు ఉన్నాయి.

ముంబైలో క్రికెటర్ పృథ్వీ షాపై దాడి



ముంబై: భారత క్రికెటర్ పృథ్వీ షాపై ముంబైలో కొందరు యువకులు చెయ్యి చేసుకున్నారు. ఆయన కారుపై బేస్ బాల్ బ్యాట్‌తో దాడి చేశారు. సెల్ఫీ తీసుకుంటామని అడిగితే నిరాకరించడమే ఇందుకు కారణం. శాంతాక్రుజ్‌లో ఓ లగ్జరీ హోటల్ ఎదుట బుధవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. పృథ్వీ షాపై దాడికి దిగిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సప్న గిల్‌ను అరెస్టు చేశామని, ఆమె మిత్రుడు శోభిత్ ఠాకూర్‌పాటు మరో ఆరుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం వెల్లడించారు. సెల్ఫీ విషయంలో పృథ్వీ షా, నిందితులకు మధ్య తొలుత తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సహనం కోల్పోయిన నిందితులు ఆయనపై చెయ్యి చేసుకున్నారని పోలీసులు చెప్పారు. ఈ సంఘటన జరిగినప్పుడు సప్న గిల్, శోభిత్ ఠాకూర్ మద్యం మత్తులో ఉన్నారని తెలిపారు. పృథ్వీ షా ఒక సెల్ఫీ ఇచ్చారని, మరికొన్ని సెల్ఫీలు కావాలంటూ వారు డిమాండ్ చేయడంతో ఆయన ఒప్పుకోలేదని అన్నారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పాక్ ప్రజలకు భారీ పెట్రో వాత

ఇస్లామాబాద్: ఆర్థికసంక్షోభం నుంచి కాస్తయినా తెరిపిన పడేందుకు సిద్ధమైన పాకిస్తాన్ ప్రభుత్వం అక్కడి ప్రజలకు ధరల వాతలు పెడుతోంది. పార్లమెంట్‌లో పన్నుల వడ్డింపుతో కూడిన మినీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కొద్ది గంటలకే ప్రజలపై 'పెట్రో' బాంబు పడేసింది. పెట్రోల్ లీటర్‌కు 22 పాక్ రూపాయలు పెంచుతున్నట్లు ఆ దేశ ఆర్థికశాఖ విభాగం ఒక ప్రకటన విడుదలచేసింది. బుధవారం అర్ధరాత్రి అమల్లోకి వచ్చిన కొత్త ధరల ప్రకారం పాక్‌లో ఒక లీటర్ పెట్రోల్ ధర 272 పాక్ రూపాయలకు ఎగబాకింది. ఇక హైస్పీడ్ డీజిల్(హెచ్‌ఎస్‌డీ) ధర లీటర్‌కు 17.20 పాక్ రూపాయలు పెంచింది. దీంతో హెచ్‌ఎస్‌డీ కొత్త ధర రూ.280కి చేరింది. కిరోసిన్‌పై 12.9 రూపాయలు పెంచింది. పెంపు తర్వాత లీటర్ కిరోసిన్ ధర రూ.202.73కి చేరింది. కొత్తగా ఉద్దీపన ప్యాకేజీ కింద 7 బిలియన్ డాలర్లలో ఒక దఫాగా 1.1 బిలియన్ డాలర్లు విడల్వాలంటే పన్నుల ద్వారా ఆదాయం పెంచుకోవాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) షరతులు విధించడంతో పాక్ ఈ ధరల మోత మోగించింది. చలికాలంకావడంతో ఇప్పటికే కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ) స్టేషన్లలో సీఎన్‌జీ నిల్వలు నిండుకున్నాయి. దీంతో జనం రవాణాకు పెట్రోల్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఫిబ్రవరిలో 3 బిలియన్ డాలర్లలోపునకు పడిపోయిన విదేశీ మారకద్రవ్య నిల్వలను కాస్తయినా పెంచుకునేందుకు పాక్ తిప్పలుపడుతోంది.

'మహారాష్ట్ర' సంక్షోభంపై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని శివసేన పార్టీలో చీలికలు ఏర్పడిన అనంతరం తలెత్తిన రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు తన తీర్పుని రిజర్వ్ చేసింది. 2016లో నబమ్ రెబియా కేసులో తీర్పుని పునఃపరిశీలించాలంటూ విస్తృత ధర్మాసనానికి అప్పగించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యులున్న ధర్మాసనం శివసేనలో చీలిక, కొందరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకి సంబంధించిన పిటిషన్‌ను గురువారం విచారించింది. ' ఠాక్రే, షిండే చీలికవర్గం తరఫు లాయర్ల వాదనలన్నింటినీ విన్నాం. నబమ్ రెబియా తీర్పుని పునఃపరిశీలించాలి. దానిని ఏడుగురు సభ్యులున్న విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగిస్తున్నాం' అని తెలిపింది.

ఏమిటీ నబమ్ రెబియా తీర్పు

ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి అసెంబ్లీ స్పీకర్‌కున్న అధికారాలపై అరుణాచల్ ప్రదేశ్‌లోని నబమ్ రెబియా కేసులో 2016లో సుప్రీం తీర్పు చెప్పింది. ఈ తీర్పు ప్రకారం శాసనసభ స్పీకర్‌ను తొలగించిన నిర్ణయం సభలో పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం సభాపతికి ఉండదు. అరుణాచల్ ప్రదేశ్‌లో అప్పట్లో అధికార కాంగ్రెస్‌కు చెందిన సీఎం నబమ్ టుకీయేని గద్దె దించడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సహకారంతో అసమ్మతి నాయకుడు కలిఖో పుల్ తిరుగుబాటు చేశారు. దీంతో టుకీ సోదరుడైన అసెంబ్లీ స్పీకర్ నబమ్ రెబియా 21 మంది అసమ్మతి ఎమ్మెల్యేల్లో 14 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరోవైపు అసమ్మతి ఎమ్మెల్యేలు స్పీకర్ రెబియాను తొలగిస్తూ తీర్మానం చేశారు. దీనిపై కాంగ్రెస్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే, స్పీకర్‌ను తొలగించిన నిర్ణయం పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం ఉండదని సుప్రీం తీర్పు చెప్పింది. ఈ తీర్పుని అనుసరించి సుప్రీం కోర్టు నిర్ణయం తీసుకుంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి ఊరట లభిస్తుంది. మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, థాక్రే విధేయుడు నరహరి సీతారామ్ జిర్వాల్‌ను తొలగిస్తూ షిండే వర్గం ఇచ్చిన నోటీసు సభలో పెండింగ్‌లోనే ఉంది.

ఆదివాసీల అభ్యున్నతికి ప్రాధాన్యం

ఆది మహోత్సవ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలోని ఆదివాసీల అభ్యున్నతి కోసం కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మెగా జాతీయ ఆదివాసీల ఉత్సవం 'ఆది మహోత్సవ్'ను గురువారం ప్రధాని ప్రారంభించారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు ఎలా ఉంటాయో చాటి చెప్పడానికి , ఆదివాసీలు తయారు చేసిన వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించడానికి అవకాశం కల్పిస్తూ వారి అభ్యున్నతి కోసం తాము అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి కృషి చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్‌లో నిధులు భారీగా కేటాయిస్తున్నామని, మొట్టమొదటి సారిగా ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతి పీఠంపై కూర్చోబెట్టినది తమ ప్రభుత్వమేనని సగర్వంగా చెబుతున్నామని పేర్కొన్నారు. ఢిల్లీ దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లోని ప్రజలందరూ తప్పనిసరిగా ఆది మహోత్సవ్‌ను సందర్శించి, ఆదివాసీలు తయారు చేసిన వస్తువుల్ని కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు.



ఆదివాసీల ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

స్వాతంత్య్ర సంగ్రామంలో ఆదివాసీల పాత్ర మరువలేనిదని, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. అమృత కాలంలో ఆదివాసీలను తిరిగి వెలుగులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుంటున్నామని మోదీ తెలిపారు.

బొట్టు బొట్టు కాపాడుకోవాలి

దేశంలో నీటి సంరక్షణ అత్యంత ఆందోళన కలిగించే అంశమని మోదీ అన్నారు. ప్రకృతితో మనకున్న భావోద్వేగ బంధాన్ని తిరిగి పునరుద్ధరించుకొని నీటి వనరుల్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర జల శక్తి శాఖ, బ్రహ్మకుమారిలు సంయుక్తంగా నిర్వహిస్తున్న దేశవ్యాప్త ప్రచారం జల్ జన్ అభియాన్‌ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని బ్రహ్మకుమారిల ప్రధాన కార్యాలయంలో ఉన్న వారినుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.



రాజ్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు. (ఇన్‌సెట్లో) ఓటేశాక సిరా గుర్తు చూపిస్తున్న సీఎం మాణిక్ సాహా

త్రిపురలో 81.11 శాతం ఓటింగ్

స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

అగర్తలా: త్రిపురలో శాసనసభ ఎన్నికల పోలింగ్ అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 4 గంటల వరకు 81.11 శాతం ఓటింగ్ నమోదయ్యిందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈఓ) కిరణ్‌కుమార్ దినకర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఒకేదశలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో వేర్వేరు చోట్ల జరిగిన ఘర్షణల్లో సీపీఎం నాయకుడితో పాటు అదే పార్టీకి చెందిన ఇద్దరు పోలింగ్ ఏజెంట్లు గాయపడ్డారు. పశ్చిమ త్రిపుర జిల్లాలోని ఖాయేర్‌పూర్‌లో సీపీఎం అభ్యర్థి పబిత్రా కర్‌కు చెందిన వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి దిగారు. దాదాపు 45 కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) మొరాయించాయి. అధికారులు వెంటనే వాటి స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేశాయి. ఎన్నికల బూత్‌లను ఆక్రమించుకోవడం, రిగ్గింగ్ వంటి సంఘనలు ఎక్కడా చోటుచేసుకోలేదు. ప్రజలు తమ పార్టీకి అనుకూలంగా ఓటు వేశారని, ఈ ఎన్నికల్లో స్పష్టమైన మెజార్టీ దక్కించుకోవడం ఖాయమని త్రిపుర ముఖ్యమంత్రి, బీజేపీ నేత మాణిక్ సాహా ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి మరిన్ని ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. మొత్తం 60 సీట్లకు గాను బీజేపీకి 40 సీట్లు లభిస్తాయని మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు విప్లవ్‌కుమార్ దేవ్ చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని సీపీఎం నేత, మాజీ సీఎం మాణిక్ సర్కారు తెలిపారు. మార్చి 2వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 2018లో 79 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

ఢిల్లీ మద్యం కేసులో నిందితుల బెయిల్ తిరస్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో ఐదుగురు నిందితుల బెయిల్ దరఖాస్తులను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. సౌత్ గ్రూప్‌కు కిక్‌బ్యాక్స్ రూపంలో రూ.100 కోట్లు బదిలీ కావడంలో ఆప్ నేత విజయ్ నాయర్ కీలకపాత్ర పోషించారని ప్రాథమిక సాక్ష్యాధారాలను బట్టి తెలుస్తోందని జడ్జి ఎంకే నాగ్‌పాల్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. ' నిందితులు బెయిల్‌పై విడుదలైతే సాక్ష్యాలను ట్యాంపర్ చేయబోరని కోర్టు విశ్వాసంలోకి తీసుకోవట్లేదు. అందుకే బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తున్నాం' అని జడ్జి తన ఉత్తర్వులో పేర్కొన్నారు. కేసు విచారణ సందర్భంగా విజయ్‌నాయర్, సమీర్ మహేంద్రు, బినోయ్ బాబు, అభిషేక్ బోయిన్‌పల్లి, శరత్ చంద్రారెడ్డిల బెయిల్ దరఖాస్తులను జడ్జి నాగ్‌పాల్ విచారించారు. ఇరు పక్షాల వాదనల అనంతరం నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తూ జడ్జి 123 పేజీల తీర్పు వెలువరించారు. ' నిందితులు తమ వేర్వేరు ఫోన్లను పాడుచేయడంసహా డిజిటల్ సాక్ష్యాలు ధ్వంసం చేశారన్న ఆరోపణల తాలూకు రికార్డులను ఈడీ సమర్పించింది. వీరిపై ఆరోపణలు చాలా తీవ్రమైనవి' అని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మీడియా ఇన్‌ఛార్జి విజయ్ నాయర్ మద్యం వ్యాపారుల వాటాదారులతో వేర్వేరు ప్రదేశాల్లో సమావేశమైనట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైందని తీర్పులో పేర్కొన్నారు. సీబీఐ నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదుచేసి మనీలాండరింగ్ కోణంలో కేసును దర్యాప్తుచేస్తోంది.

మరోసారి ఉక్రెయిన్‌పై క్షిపణుల వర్షం

కీవ్: ఉక్రెయిన్ భూభాగాల దురాక్రమణకు దిగిన రష్యా సేనలు బుధవారం రాత్రి క్రూయిజ్, ఇతర క్షిపణులతో విరుచుకుపడ్డాయి. రెండు గంటలపాటు ఏకధాటిగా పలు రకాల క్షిపణులు దూసుకొచ్చాయని, 36 మిస్సైళ్లలో 16 క్షిపణులను కూల్చేశామని ఉక్రెయిన్ సైనిక చీఫ్ వలేరీ జలూజ్నీ చెప్పారు. రష్యా క్షిపణుల దాడిలో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఏడుగురు గాయపడ్డారు. అయితే, రష్యా వాయుసేన కొత్తగా భారీ బెలూన్లను వదులుతోందని వలేరీ చెప్పారు. బెలూన్లకు ఉన్న కార్నర్ రిఫ్లెక్టర్లు రాడార్ సిగ్నళ్లను వెనక్కి పంపుతాయి. దీంతో ఆకాశంలో శత్రుదేశ డ్రోన్, క్షిపణి వస్తుందని భావించి ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ క్షిపణులను ప్రయోగిస్తుంది. దీంతో ఉక్రెయిన్ క్షిపణులు వృథా అవుతాయి. 'ఇది రష్యా వేసిన మరో ఎత్తుగడ' అని వలేరీ అన్నారు. కాగా, రష్యాతో పోరులో మునిగిపోయిన ఉక్రెయిన్‌కు సాయపడేందుకు నార్వే ముందుకొచ్చింది. ఐదు సంవత్సరాల్లో విడతలవారీగా మొత్తంగా 7.4 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేస్తామని నార్వే ప్రకటించింది.

ప్రసంగం కోసం బ్రిటన్‌కు రాహుల్

న్యూఢిల్లీ: కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించేందుకు మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బ్రిటన్‌కు వెళ్లబోతున్నారు. వర్సిటీ బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించి అక్కడి విద్యార్థులతో రాహుల్ మాట్లాడతారు. మరోవైపు ఈనెల 24, 25, 26 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ కీలక ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ పాల్గొననున్నారు.

బైడెన్ ఆర్థిక బృందంలో భారతీయుడు



వాషింగ్టన్: అమెరికా ఆర్థిక విధానాల విషయంలో అధ్యక్షుడికి సలహాలు ఇచ్చే ఆర్థిక బృందంలో భారతీయ మూలాలున్న అమెరికన్ భరత్ రామమూర్తి కీలక స్థానంలో నియమితులయ్యారు. భరత్‌ను నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్(ఎన్ఈసీ) డెప్యూటీ డైరెక్టర్‌గా మళ్లీ నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ బుధవారం ప్రకటించింది. వ్యూహాత్మక ఆర్థిక సంబంధాలకు సంబంధించి భరత్ బైడెన్‌కు సలహాదారుగానూ వ్యవహరిస్తారు. 2020 డిసెంబర్‌లో భరత్ ఎన్ఈసీలో ఆర్థిక సంస్కరణలు, వినియోగదారుల రక్షణ విభాగానికి డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

840 విమానాలు కొంటున్నాం

న్యూఢిల్లీ: ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థల నుంచి మొత్తం 840 కొనుగోలు చేస్తున్నామని టాటా గ్రూప్ యాజమాన్యంలోని 'ఎయిరిండియా' చీఫ్ కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మేషన్ అధికారి నిపుణ్ అగర్వాల్ గురువారం తెలిపారు. ఎయిర్‌బస్ నుంచి 250, బోయింగ్ నుంచి 220 విమానాల కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఎయిరిండియా ఇప్పటికే ప్రకటించింది. ప్రపంచంలోని ప్రతి ముఖ్య నగరాన్ని భారత్‌తో 'నాన్-స్టాప్'గా అనుసంధానించాలన్నదే తమ గ్రూప్ లక్ష్యమని నిపుణ్ అగర్వాల్ వెల్లడించారు. నూతన విమానాల కోసం ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలతో ఎయిరిండియా కుదుర్చుకున్న ఒప్పందాలపై భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ హర్షం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

'టీమ్ జార్జి'పై విచారణ జరపాలి

కాంగ్రెస్ పార్టీ డిమాండ్

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లతో కూడిన 'టీమ్ జార్జి' మన దేశంలో ప్రజల డేటాను సేకరించి, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాతే డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నోరు విప్పాలని అన్నారు. మన ఎన్నికల వ్యవస్థలోకి ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లు ప్రవేశించడం దారుణమని విమర్శించారు. టీమ్ జార్జికి, అధికార బీజేపీ ఐటీ సెల్‌కి మధ్య దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావతం చేయడానికి తప్పుడు వార్తలను ప్రచారంలోకి తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. భారతీయుల డేటా పరాయి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు.

ఏమిటీ టీమ్ జార్జి?

ఇజ్రాయెల్ కాంట్రాక్టర్లు తమ బృందానికి టీమ్ జార్జి అని పేరు పెట్టుకున్నారు. వీరు అడ్వాన్స్‌డ్ ఇంపాక్ట్ మీడియా సొల్యూషన్స్(ఏఐఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను తమ క్లయింట్లకు విక్రయిస్తుంటారు. సదరు క్లయింట్లు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా సోషల్ మీడియాలో ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం సాగిస్తుంటారు. ఓటర్లను తమకు అనకూలంగా మార్చుకుంటారు. టీమ్ జార్జి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 30కిపైగా ఎన్నికల్లో పని చేసినట్లు అంతర్జాతీయ జర్నలిస్టుల పరిశోధనలో తేలింది.

కొత్తవి ఎగిరొస్తున్నాయ్

నమీబియా నుంచి 18న డజను చీతాల రాక

న్యూఢిల్లీ: భారత్‌లో చీతాల సంఖ్యను పెంచే లక్ష్యంతో వాటిని దక్షిణాఫ్రికా ఖండం నుంచి రప్పిస్తున్న మోదీ సర్కార్ ఈ దఫాలో 12 చీతాలను వాయుమార్గంలో తీసుకొస్తోంది. నమీబియా దేశం నుంచి 12 చీతాలను ఫిబ్రవరి 18వ తేదీన తీసుకొస్తామని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ గురువారం చెప్పారు. ' నమీబియా నుంచి వాటిని తెచ్చేందుకు సీ-17 విమానం గురువారం బయల్దేరింది. భారత్‌కు తెచ్చాక వాటిని ఉంచేందుకు మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ పార్కులో 10 క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లను సిద్ధంచేశాం' అని మంత్రి చెప్పారు. ఈసారి ఏడు మగ, ఐదు ఆడ చీతాలను తీసుకొస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ తన పుట్టినరోజున కూనో పార్కులోకి ఐదు ఆడ, మూడు మగ చీతాలను విడిచిపెట్టిన విషయం విదితమే. భారత్‌లో 1948లో అంతరించిపోయిన చీతాలను మళ్లీ పెంచేందుకు భారత సర్కార్ నడుంబిగించింది. నమీబియా నుంచి దాదాపు పదేళ్లపాటు ఏటా 12 చీతాలను తీసుకొచ్చి అడవుల్లో వదిలేయాలని భావిస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023

బంపర్ డ్రాలో రూ.లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిర్వహించిన నుమాయిష్‌లోని స్టాల్‌లో జిందా తిలిస్మాత్ కొనుగోలుపై కూపన్లు ఇచ్చి గురువారం నిర్వహించిన లక్కీ డ్రాలో మొదటి బహుమతి కింద శ్రీనివాస్ అనే వ్యక్తికి రూ.5 లక్షల బంపర్ ప్రైజ్ వచ్చింది. రెండో బహుమతిగా సంగీతా శర్మకు రూ.3 లక్షలు, ముహమ్మద్ అహ్మద్‌కు మూడో బహుమతి కింద రూ.2 లక్షలు వచ్చాయి.

మమతకు అదనపు బాధ్యతలు



సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమతకు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఆరోగ్యం- పారిశుద్ధ్యం అదనపు కమిషనర్‌గా ఉన్న బదావత్ సంతోష్ రెండు వారాల క్రితం బదిలీ కాగా అప్పటి నుంచి ఆ బాధ్యతల్ని కమిషనర్ లోకేశ్‌కుమార్ తన వద్దే ఉంచుకున్నారు. తాజాగా పారిశుద్ధ్యం విభాగం బాధ్యతలను ఆమెకు అప్పగించారు.

సంగీత సమరోత్సాహం

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ -2 ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నానక్‌రామ్‌గూడలోని రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. సంగీత దర్శకుడు థమన్ మాట్లాడుతూ.. ఆహా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ -2లో తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు చెందిన గాయనీ, గాయకులతో పాటు యూఎస్, యూకేల్లోని సింగర్లను ఒకే వేదికపైకి తీసుకు వస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

ఏసీబీకి పట్టుబడ్డ జలమండలి ఉద్యోగి

బంజారాహిల్స్: నీటి సమస్యను పరిష్కరిస్తానంటూ రూ. 40 వేలు లంచం తీసుకుంటూ ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్‌లో ఉద్యోగి బోడి శ్రీనివాస్ గురువారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిగూడలో టైలర్‌గా పని చేస్తున్న సింగు రమేష్ ఇంటికి కొంత కాలంగా తాగునీటి నల్లాలో లోప్రెషర్ వస్తోంది. సమస్యను పరిష్కరించాలని ఎల్లారెడ్డిగూడ జలమండలి కార్యాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌ను కోరారు. రూ.40 వేలు ఇస్తే అదనపు పైప్‌లైన్ వేసి సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బాధితుడు ఈ మేరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం శ్రీనివాస్ రూ.40 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఎస్ఆర్‌నగర్ జలమండలి డివిజన్ -6 కిందకు వచ్చే ఎల్లారెడ్డిగూడ సెక్షన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఉద్యోగులకు అండగా సీఎం కేసీఆర్

- మంత్రి శ్రీనివాస్ గౌడ్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు, సేవా రత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించి ప్రసంగించారు. బంగారు తెలంగాణలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా మారిందన్నారు. అనంతరం హోంమంత్రి మహమూద్ అలీ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రతాప్, డీఐజీ సుభాషిణి, ట్వింకిల్ జాన్, విక్రమ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. దాదాపు 700 మంది రక్తదానం చేశారు.

తటాక తీరాన మణి మకుటాలు!







అటు చూస్తే తుది దశకు చేరిన నూతన సచివాలయ నిర్మాణం.. ఇటు చూస్తే పూర్తి కావస్తున్న అమర వీరుల స్మారకం. ఆ వంక రూపుదిద్దుకుంటున్న అంబేడ్కర్ విగ్రహం. భాగ్యనగరి కీర్తి కిరీటంలో మణిమకుటాలుగా విరాజిల్లనున్నాయి. హుస్సేన్‌సాగర్ తీరానికి సరికొత్త సొబగులను అద్దనున్నాయి. నగరవాసులకు, పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

‘పట్టాలు’ పదిలమేనా!



వాతావరణ ప్రభావంతో సంకోచ, వ్యాకోచాలు

- రైల్వే ట్రాక్ పటిష్టతకు నిరంతర గస్తీ తప్పనిసరి
- ద.మ. రైల్వేలో 6,500కుపైగా కి.మీ మేర ట్రాక్
- గోదావరి ఎక్స్‌ప్రెస్ ఘటనపై అధికారుల విచారణ

ఇదీ లెక్క

దక్షిణమధ్య రైల్వేలో మొత్తం రన్నింగ్ కి.మీ: 9,500
రైళ్లు తిరిగే రూట్ కి.మీ: 6,500
ఎక్స్‌ప్రెస్ రైళ్లు: 324
ప్యాసింజర్: 187
ఎంఎంటీఎస్: 79
ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఉన్న రైళ్లు: 43

సాక్షి, సిటీబ్యూరో: గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటనపై దక్షిణమధ్య రైల్వేలోని వివిధ విభాగాలు దృష్టి సారించాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల వల్ల అదృష్టవశాత్తు ఎలాంటి ప్రయాణికులకు ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బోగీలను తొలగించి ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కొన్ని గంటల్లోనే అదే ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను సైతం పునరుద్ధరించారు. కానీ.. ప్రమాదానికి కారణాలేంటి? అనే అంశంపై అధికారులు అన్ని కోణాల్లో పరిశీలన చేపట్టారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగినప్పటికీ అసలు ప్రమాదం ఎందుకు జరిగిందనేది చర్చనీయాంశంగా మరింది. ట్రాక్‌లో లోపాల కారణంగా ప్రమాదం జరిగిన ఉండవచ్చనే సందేహాన్ని సైతం అధికారులు తీవ్రంగానే పరిగణిస్తున్నారు. ఈ ఘటనపైన విచారణ కమిటీ త్వరలో సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదికను అందజేయనుంది. ఈ క్రమంలో మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రస్తుతం సీరియస్‌గా దృష్టి సారించారు.

వాతావరణ మార్పుల ప్రభావంతో..

- దక్షిణమధ్య రైల్వే పరిధిలో సుమారు 6,500 కిలోమీటర్ల మేర పట్టాల మార్గాలు ఉన్నాయి. ప్రతి రోజు 324 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్టమైన ట్రాక్‌ను అందుబాటులో ఉంచేందుకు గస్తీ బృందం విధులు నిర్వహిస్తోంది. కానీ.. ఈ బృందం ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా అనూహ్యమైన పరిణామాలు చోటుచేసుకోవచ్చు. సాధారణంగా కాలానుగుణంగా ట్రాక్‌లలో సంకోచ, వ్యాకోచాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి.
- శీతాకాలంలో సంకోచ స్థితిలో ఉంటాయి. వేసవిలో తిరిగి వ్యాకోచ స్థితికి చేరుకుంటాయి. కొద్ది రోజులుగా వాతావరణంలో పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. తెల్లవారుజామున మంచుకురుస్తోంది. దీంతో ఉదయం సంకోచస్థితితో ఉండే పట్టాలు ఉష్ణోగ్రత పెరుగుతున్న కొద్దీ వ్యాకోచ స్థితికి చేరుకుంటున్నాయి. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని పట్టాల పటిష్టతకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
- పట్టాలు వదులైన చోట అవసరమైన మరమ్మతులు చేసి పట్టాలకు రెండువైపులా తగిన విధంగా కంకరను (బ్యాలెస్ట్)పర్చాలి. లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలి. గోదావరి ఘటనలో ట్రాక్‌లో లోపాలపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీబీనగర్ దాటిన తర్వాత మలుపులో అవుశాపూర్ వైపు ట్రైన్ నెమ్మదిగా వస్తున్న క్రమంలోనే అకస్మాత్తుగా ఈ ఘటన జరగడంతో పట్టాల్లోనే లోపాలు ఉండవచ్చనని రైల్వే వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కానీ ఏదైనా సరే విచారణలో తేలాల్సిందే.

ఎల్‌హెచ్‌బీ పెంచాల్సిందే..

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదంతం మరో పాఠాన్ని నేర్పింది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల వల్లనే ముప్పు తప్పిందనేది తేలిపోయింది. కానీ.. ప్రస్తుతం దక్షిణమధ్య రైల్వేలో కేవలం 30 శాతం రైళ్లకే ఈ కోచ్‌లు ఉన్నాయి. మిగతావన్నీ ఐసీఎఫ్ కోచ్‌లే. మరో 70 శాతం రైళ్లకు ఐసీఎఫ్ కోచ్‌లను తొలగించి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఒక అధికారి చెప్పారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ తరహా ప్రమాదం జరిగితే ఐసీఎఫ్ కోచ్ రైళ్లలో భారీ నష్టం వాటిల్లవచ్చని పేర్కొన్నారు.

సీ‘రియల్’ స్నాచర్లు ఇద్దరే!

స్నాచింగ్స్ సహా తొమ్మిది నేరాలు చేసింది ఆ త్రయమే

- గొలుసులు లాక్కుపోయింది పింకు, మంగళ్
- మిగిలిన ఇరువురిది పథక రచనలో కీలక పాత్ర
- బెంగళూరు నుంచి నగరానికి వచ్చింది రైలులోనే
- నిందితుడి విచారణలో వెలుగులోకి కీలకాంశాలు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని రెండు కమిషనరేట్ల పరిధిలో వరుస స్నాచింగ్స్‌కు పాల్పడిన సీరియల్ స్నాచర్ల వ్యవహారంలో స్పష్టత వస్తోంది. నగరానికి వచ్చిన నలుగురు బవారియా గ్యాంగ్ సభ్యుల్లో ఇద్దరే నేరుగా నేరాలు చేసినట్లు తేలింది. ఏడు గొలుసు దొంగతనాలు, రెండు వాహన చోరీలు వీళ్లే చేయగా.. మిగిలిన ఇద్దరూ పథక రచనలోనే కీలకంగా వ్యవహరించినట్లు, వీరు కేవలం నాంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాలకు పరిమితమయ్యారని వెలుగులోకి వచ్చింది. ఇద్దరు సీరియల్ స్నాచర్లలో ఒకడైన మంగళ్‌ను రాచకొండ పోలీసులు ఇటీవల పీటీ వారెంట్‌పై తీసుకువచ్చారు. ఇతడిని కోర్టు అనుమతితో తొమ్మిది రోజుల పాటు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలోనే పలు కీలకాంశాలు వెలుగు చూశాయి.

రైలులో వచ్చి.. నాంపల్లిలో దిగి...

ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలోని ఉన్ మండలానికి చెందినదే ఈ బవారియా గ్యాంగ్. ఆ మండలంలోని పలు హామ్లెట్స్‌లో నివసించే పలు ముఠాలు దేశవ్యాప్తంగా చైన్ స్నాచింగ్స్ సహా అనేక నేరాలు చేస్తుంటాయి. పంకజ్ అలియాస్ పింకు నేతృత్వంలో మంగళ్, దీపక్ అలియాస్ సెహ్వాగ్, సేవజ్ అలియాస్ లక్ష్మణ్ సభ్యులుగా ఉన్నారు. బెంగళూరులో వరుస స్నాచింగ్స్ చేసిన తర్వాత రైలులో గత నెల 7న నగరానికి వచ్చారు. ఉదయం 4 గంటల ప్రాంతంలో రైలు దిగిన నలుగురూ కాసేపు స్టేషన్ పరిసరాల్లోనే సంచరించారు. ఆ తర్వాత పింకు, మంగళ్ ఆటో ఎక్కగా మిగిలిన ఇద్దరూ స్టేషన్ బయట ఉన్న కేఫ్ వద్ద ఆగిపోయారు. కేవలం కొన్ని గంటల్లోనే తమ ‘పని’ పూర్తి చేసుకునే ఈ గ్యాంగ్ ఫోన్లు వాడదు. తమ వారి నుంచి ఎక్కడ వేరయ్యారో, మళ్లీ అక్కడికే వచ్చి కలుస్తుంటారు.

మాస్టర్ ‘కీ’ వినియోగించి మ్యాస్ట్రో..

నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆటో మాట్లాడుకున్న పింకు, మంగళ్ నేరుగా చార్మినార్ వద్దకు వెళ్లారు. అక్కడ ఆటోడ్రైవర్‌కు రూ.200 ఇచ్చి పంపేశారు. స్నాచింగ్స్ చేయడానికి అనువైన వాహనాన్ని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల నుంచి తస్కరించడానికి గాలించారు. మిట్టీకా షేర్ వద్ద కనిపించిన మ్యాస్ట్రో వాహనాన్ని తమ వద్ద ఉన్న మాస్టర్ ‘కీ’ వినియోగించి చోరీ చేశారు. దానిపై నాంపల్లి ప్రాంతానికి చేరుకునేసరికే స్నాచింగ్స్ చేయడానికి అనువైందని కాదని భావించారు. అక్కడి శ్రీనివాస గ్రాండ్ హోటల్ వద్దకు అదే రోజు తెల్లవారుజామున 5.10 గంటలకు చేరుకున్న ఈ ద్వయం.. మ్యాస్ట్రో వాహనాన్ని వదిలి, అక్కడ ఉన్న పల్సర్ బైక్‌ను తస్కరించారు. దానిపైనే తిరుగుతూ ఉప్పల్, నాచారం సహా అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో ఏడు గొలుసు దొంగతనాలు చేసి 21 తులాల బంగారం అపహరించారు.



కాజీపేట రైల్వేస్టేషన్‌లో పింకు గ్యాంగ్ (ఫైల్)

తమ వారిని కలిసి తప్పదారి పట్టిస్తూ..

రామ్‌గోపాల్‌పేట ప్రాంతంలో పల్సర్ వాహనాన్ని వదిలేసిన పింకు, మంగళ్ అక్కడ నుంచి ఆటోలో నాంపల్లి రైల్వేస్టేషన్ వద్దకు వచ్చారు. కేఫ్ సమీపంలో ఉన్న సెహ్వాగ్, లక్ష్మణ్‌లను కలిశారు. అక్కడ నుంచి నలుగురూ పోలీసులను తప్పుదారి పట్టించేలా వివిధ ప్రాంతాల్లో తిరిగి చివరకు వరంగల్ జిల్లా కాజీపేట నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ పారిపోయారు. చోరీ సొత్తు మొత్తం లక్ష్మణ్ తీసుకున్నాడని, అక్కడ నుంచి తాము స్వగ్రామాలకు వెళ్లిపోయారని మంగళ్ పోలీసుల వద్ద అంగీకరించాడు. ఇతడిచ్చిన వివరాల ఆధారంగా రాచకొండ పోలీసులు మిగిలిన ముగ్గురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు సొత్తు రికవరీ చేయడానికీ సన్నాహాలు చేస్తున్నారు. మరోపక్క మంగళ్‌ను పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి, విచారించడానికి మిగిలిన నాలుగు ఠాణాల అధికారులూ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు ఆయా న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేశారు.

బీమా పాలసీలో చేర్పిస్తే అధిక రాబడి అంటూ బురిడీ

- యూపీ ముఠాను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

ఆశ చూపి దోచేశారు

సాక్షి, సిటీబ్యూరో: బీమా పాలసీలో చేర్పిస్తే భారీగా కమీషన్‌లు వస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టయింది. పదవీ విరమణ పొందిన వృద్ధులను మాత్రమే లక్ష్యంగా చేసుకున్న ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన అయిదుగురు నిందితులను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..

యూపీకి చెందిన ముర్షిద్ అన్సారీ అలియాస్ రిహాన్, వికాస్ సింగ్, తరుణ్ శర్మ గతంలో నకిలీ కాల్ సెంటర్లలో పని చేశారు. బీమా పాలసీల పేరుతో ఎలా మోసం చేయాలో తెలుసుకున్నారు. ఘజియాబాద్‌లో సొంతంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏ వయసుల వారిని మోసం చేయాలో చర్చించుకున్నారు. 60- 70 ఏళ్ల వయసు వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగస్తులైతే బ్యాంకులో డబ్బు బాగా ఉంటుంది, పైగా సులువుగా నమ్మేస్తారని నిర్ణయించుకున్నారు. పథకం అమలు చేసేందుకు మనీష్ టాంగర్, లలిత్ కుమార్‌లను టెలీ కాలర్లుగా నియమించుకున్నారు.

- ఈ క్రమంలో రాచకొండ పరిధిలోని 72 ఏళ్ల ఓ రిటైర్డ్ ఉద్యోగికి.. బీమా పాలసీలు చేయిస్తే భారీ మొత్తంలో కమీషన్ వస్తుందని ఓ నకిలీ బీమా ఏజెంట్ నుంచి ఫోన్ వచ్చింది. నిజమేనని నమ్మిన బాధితుడు తనతో పాటు 12 మంది కుటుంబ సభ్యులు, స్నేహితులను ఒప్పించి బీమా పాలసీలలో చేర్పించాడు. కమీషన్‌ల రూపంలో డబ్బులు వస్తాయంటూ దఫదఫాలుగా రూ.2 కోట్లు, రూ.4 కోట్లు, రూ.5 కోట్ల నకిలీ డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)లను సృష్టించి బాధితుడికి వాట్సాప్ ద్వారా పంపించారు. డీడీ సొమ్మును ఉపసంహరించుకోవాలంటే 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. దీంతో సదరు బాధితుడు 2016 నుంచి 2022 మధ్య కాలంలో పలు దశల్లో రూ.1.60 కోట్లు చెల్లించాడు. అయినా సొమ్ము రాకపోవటంతో మోసపోయానని గ్రహించి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.
- ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ఆర్ఎస్ఐ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం.. సాంకేతిక ఆధారాలను సేకరించి యూపీలోని ఘజియాబాద్ వెళ్లి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, నగరానికి తీసుకొచ్చారు. వీరి నుంచి రూ.1.50 లక్షల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు పట్టుకున్న నిందితులు

ఏజెంట్ల నుంచి పాలసీదారుల వివరాల కొనుగోలు ..

ఈ ముఠా సభ్యులు బీమా ఏజెంట్ల నుంచి పాలసీదారుల వివరాలను కొనుగోలు చేసేవారు. జనాలకు ఫోన్లు చేసేందుకు నకిలీ సిమ్ కార్డులు, కొట్టేసిన సొమ్మును జమ చేసేందుకు నకిలీ బ్యాంకు ఖాతాలను సైతం ఈ ముఠా ఏర్పాటు చేసుకున్నారు. 2016 నుంచి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న ఈ గ్యాంగ్ దేశవ్యాప్తంగా వేలాది మందిని మోసం చేసినట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. నిందితులను కస్టడీలోకి తీసుకోని విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని ఇన్‌స్పెక్టర్ రాజు పేర్కొన్నారు. శివరాత్రి తర్వాత కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్‌లోనూ ఇదే తరహా కేసు నమోదైందని, దానికి ఈ కేసుకు ఏమైనా సంబంధం ఉందా? అనే విషయాలు విచారణలో బయటపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

రైల్ నిలయంలో సమాచార విశ్లేషణ కేంద్రం

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే కార్యాలయం రైల్‌నిలయంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సమాచార విశ్లేషణ కేంద్రాన్ని గురువారం జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (సీఆర్ఐఎస్) మేనేజింగ్ డైరెక్టర్ డీకే సింగ్, సీఆర్ఐఎస్ రీజినల్ మేనేజర్ రవి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. సమాచార విశ్లేషణ అనేది సీఆర్ఐఎస్ రూపొందించిన ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. రైల్వే సేవల అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందన్నారు. సమాచార విశ్లేషణ వల్ల ప్రయాణికుల అనుభవాలను తెలుసుకొని సేవలను మరింత మెరుగుపర్చుకోవచ్చన్నారు. దీనివల్ల రైల్వేల సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇది మన దేశంతో పాటు విదేశాలలోని ఇతర రైల్వేలకు కూడా ఐటీ సలహాలు, సాంకేతిక సహాయాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.



ఉగ్ర ఫైనాన్షియర్ చిక్కాడు

- నగరంలో విధ్వంసాలకు ఆర్థిక సాయం
- సొమ్ము అందించిన పాతబస్తీ హవాలా ఆపరేటర్
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సిటీ సిట్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: హ్యాండ్ గ్రెనేడ్లతో దసరా వేడుకల్లో హైదరాబాద్‌లో భారీ విధ్వంసాన్ని సృష్టించాలని పథకం వేసి నగర పోలీసులకు చిక్కిన ముగ్గురు ఉగ్రవాదులకు గతంలో నగదు సమకూర్చిన ఫైనాన్షియర్ తాజాగా పోలీసులకు పట్టుబడ్డాడు. హవాలా రూపంలో వచ్చిన ఈ నగదు సరఫరాలో కీలక పాత్ర పోషించిన ఆపరేటర్ల కోసం సిట్ ముమ్మరంగా దర్యాప్తు చేసింది. ఈ నగదు సమకూర్చిన వారిలో కీలక నిందితుడు, పాతబస్తీకి చెందిన హవాలా ఆపరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖలీమ్‌ను సీసీఎస్ నేతృత్వంలోని సిట్ గురువారం అరెస్ట్ చేసింది.

ఉగ్ర కుట్ర అమలుకు రూ.40లక్షలు

గత ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా బాంబులు పేల్చి భారీ ప్రాణనష్టం కల్పించి, తద్వారా హైదరాబాద్‌లో మతకలహాలు సృష్టించి అశాంతిని రేకెత్తించేందుకు భారీ కుట్ర జరిగింది. ఈ కేసులో గత ఏడాది అక్టోబర్ 2వ తేదీన హైదరాబాద్ పోలీసులు లష్కరే తోయిబా ఉగ్రవాదులైన అబ్దుల్ జాహెద్, మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్ ఫారూఖ్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్లు జమ్మూ కశ్మీర్ సరిహద్దుల ద్వారా మన దేశంలోకి వచ్చాయి. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాదులు ఫర్హతుల్లా ఘోరీ, సిద్దిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్‌లు ఇచ్చిన ఆదేశాలతో ఆ ముగ్గురూ ఉగ్రకుట్ర ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఉగ్రకుట్రను విజయవంతం చేయడానికి కావాల్సిన ఆర్థిక సహాయం హైదరాబాద్‌లో ఉన్న నిందితులకు హవాలా ద్వారా అందింది. హవాలా మార్గంలో రూ.40 లక్షలు ఇచ్చేందుకు పాతబస్తీకి చెందిన మహ్మద్ అబ్దుల్ ఖలీమ్ సహకరించినట్లు తేలడంతో తాజాగా సిట్ అరెస్ట్ చేసింది. అరెస్టయి జైల్లో ఉన్న ముగ్గురు ఉగ్రవాదులకు సహకరించిన మరో 8 మందిని కూడా పోలీసులు మొదట్లోనే విచారించారు. అందులో కొందరు తెలిసి, మరికొందరు తెలియకుండా వారికి సహకరించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు.

ఉగ్రవాదులకు సాయం చేసిన వారిపై సిట్ కన్ను

దర్యాప్తులో ఉగ్రవాదులకు సహాయ సహకారాలు అందించిన వారిపై ఇప్పుడు సిట్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే హవాల మార్గంలో డబ్బు పంపించాలని ఎవరు ఆదేశించారు, డబ్బు ఎవరు ఇచ్చారు, ఎన్నిసార్లు ఆ డబ్బును ఖలీమ్ సమకూర్చాడు అనే విషయాలపై ఇప్పుడు సిట్ దృష్టి పెట్టింది. ఇదిలాఉండగా వచ్చిన డబ్బుతో ముగ్గురు ఉగ్రవాదులు రెండు ఇన్‌ఫీల్డ్ బైక్‌లు కొనడంతో పాటు ఒక కారును కూడా కొన్నారు. హైదరాబాద్‌లో దసరా వేడుకలలో నరమేధం సృష్టించేందుకు బైక్‌లు, కార్లలో వెళ్లి గ్రెనేడ్లను పేల్చాలని ఉగ్రవాదులు ప్లాన్ చేశారు. పోలీసుల నిఘాలో ఈ కుట్ర బయటపడడంతో ముగ్గురు ఉగ్రవాదులను పోలీసులు అరెస్ట్ చేశారు, ఈ నేపథ్యంలో అరెస్టైయిన ఉగ్రవాదులకు ఖలీమ్‌తో ఎన్నాళ్లుగా సంబంధాలున్నాయనే విషయంలో లోతైన దర్యాప్తు జరిపేందుకు నిందితుడిని కస్టడీలోకి తీసుకోనున్నారు. కాగా ఈ ఘటనపై ఎన్ఐఏ కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్ గుర్రపు పందేల ఆటకట్టు

ప్రధాన నిందితుడు సహా మరో 12 మంది అరెస్టు

రాజేంద్రనగర్: వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా గుర్రపు పందేలను నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడితో పాటు మరో 12 మందిని రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు అత్తాపూర్ ఔట్ పోస్టు పోలీసులతో కలిసి బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. కాగా.. గత ఏడాది సైతం సదరు నిందితుడు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.42 లక్షలతో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా తీరు మార్చుకోకుండా పాత దారినే ఎంచుకుని పోలీసులకు చిక్కాడు. ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, అత్తాపూర్ ఔట్‌పోస్టు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..

- రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పాలమాకుల ప్రాంతానికి చెందిన తిరుమల్‌రెడ్డి అలియాస్ జోజిరెడ్డి (42) గతంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో గుర్రపు పందేలను నిర్వహిస్తూ జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత కూడా పందేలను నిర్వహించేందుకు సేఫ్ జోన్‌ను ఎంచుకున్నాడు. ఇందులో భాగంగా అత్తాపూర్ తేజస్వినీ నగర్ ప్రాంతంలోని జీఎస్ఆర్ హార్మోనీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రవికుమార్‌రెడ్డి (40)ని సంప్రదించాడు. కంప్యూటర్‌పై పట్టు ఉన్న రవికుమార్‌రెడ్డికి ప్రతి నెలా రూ.40 వేల జీతం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. రవికుమార్‌రెడ్డి తన కంప్యూటర్‌తో మలక్‌పేటలో జరుగుతున్న రేస్ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు చేసే వాడు.
- తెలుగు రాష్ట్రాల్లోని పందెం ఆడే వారి కోసం దమ్ మారో దమ్, డీజే, ఆర్ ఎస్ వరల్డ్, రేసింగ్ కింగ్–3 పేరిట నాలుగు గ్రూప్‌లను ఏర్పాటు చేశాడు. ఈ గ్రూప్‌ల్లో సుమారు వెయ్యి మంది వరకు ఉన్నారు. వారితో ఆన్‌లైన్‌లో గుర్రపు పందేలు ఆడుతూ గూగుల్‌పే, ఫోన్ పే ద్వారా లావాదేవీలు జరిపేవాడు. జోజిరెడ్డి ప్రధాన నిందితుడు కాగా.. ఈ వ్యవహారాలన్నింటినీ రవికుమార్‌రెడ్డే చూసుకునే వాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు తేజస్వీ నగర్‌లోని జీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌పై నిఘా ఏర్పాటు చేశారు. అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి జోజిరెడ్డి, రవికుమార్ సహా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తిరుమల్‌రెడ్డి, కె.గోపీనాథ్, ఎం.సుధాకర్, ఆర్.వెంకటేష్, కె.విజేంద్ర, దోమ వెంకటేష్‌బాబు, ప్రసాద్‌రాజు, రమేష్, సుబ్రహ్మణ్యం, జి.చంద్రశేఖర్, కె.చిన్న సత్యంలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.51 వేల నగదు, 17 సెల్‌ఫోన్‌లు, 19 డెబిట్, క్రెడిట్ కార్డులు, పాన్ కార్డు, ఒక ల్యాప్‌టాప్, హార్స్ రైడింగ్ బుక్, కియా కారును స్వాధీనం చేసుకున్నారు.


తేజస్వీ నగర్‌లోని జీఎస్ఆర్ అపార్ట్‌మెంట్

నిత్య పెళ్లి కొడుకు అరెస్ట్


నిందితుడు మహ్మద్ బిన్ ఇషాక్

బంజారాహిల్స్: మూడు పెళ్లిళ్లు చేసుకోవడమేగాక మరో వివాహితను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి మోసం చేసిన నిత్య పెళ్లి కొడుకును బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ హరీశ్వర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెహిదీపట్నం సంతోష్‌నగర్‌లో నివసించే మహ్మద్ బిన్ ఇషాక్ డిజిటల్ ఎంటర్‌ప్రైజెస్ యూట్యూబర్‌గా పని చేస్తున్నాడు. గతంలోనే ఆయనకు మూడు పెళ్లిళ్లు జరిగాయి. గత అక్టోబర్‌లో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని మిథిలానగర్‌లో ఉంటున్న వివాహిత(32)తో పరిచయం ఏర్పడింది. తనకు పెళ్లి కాలేదని ప్రేమిస్తున్నానని నమ్మించి పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి ఆమెతో సహజీవనం చేశాడు. రెండు వారాల క్రితం ఆమెకు ఇషాక్ అసలు రూపం తెలియడంతో ఈ విషయంపై ఆమె నిలదీయగా అతను ముఖం చాటేశాడు. తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు ఈ నెల 13న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుడు సమీర్

జగద్గిరిగుట్ట: ఓ వ్యక్తి నుండి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆల్విన్ కాలనీ పార్కు సమీపంలోని జలకన్య హోటల్ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు గురువారం జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పదంగా తచ్చాడుతున్న మూసాపేట్ హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సమీర్(21)ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని సోదా చేయగా టూరిస్ట్ బ్యాగ్‌లో 10 కిలోల గంజాయి లభ్యమైంది. మరో వ్యక్తి దీపక్ పరారయ్యాడు. వీరు ఇద్దరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి ఆల్విన్ కాలనీలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు మహ్మద్ సమీర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు దీపక్ కోసం గాలిస్తున్నారు.



భారత వైద్య విద్యార్థులకు అండగా ఉజ్బెకిస్థాన్

- ఉక్రెయిన్ నుంచి తిరిగొచ్చిన విద్యార్థులకు 2 వేల సీట్ల కేటాయింపు
- 500 మందిని చేర్చుకున్న తాష్కెంట్ మెడికల్ అకాడమీ
- వెయ్యి మందిని చేర్చుకున్న బుఖారా స్టేట్ మెడికల్ ఇనిస్టిట్యూట్
- హైదరాబాద్‌లో టీఎంఏ దక్షిణాసియా ప్రాంతీయ కార్యాలయం
- వివరాలు తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు

సాక్షి, సిటీబ్యూరో: రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ నుంచి వైద్య విద్య మధ్యలో వదిలి వచ్చిన భారతీయ విద్యార్థులు ఎంబీబీఎస్ కొనసాగించేందుకు వీలుగా ఉజ్బెకిస్థాన్‌లోని ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2 వేల మెడికల్ సీట్లను కేటాయించామని తాష్కెంట్ మెడికల్ అకాడమీ ఛాన్సలర్, మాజీ ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి హెచ్.ఇ.అలిషర్ కయుమోవిచ్ షద్మనోవ్ తెలిపారు. ఈ విద్యార్థులకు సహకారం అందించేందుకు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టీఎంఏ) తన భాగస్వామి నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీతో కలిసి నగరంలోని హిమాయత్ నగర్‌లో దక్షిణాసియా ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ., ఉక్రెయిన్‌లో కోల్పోయిన తమ చదువులకు ఆటంకం ఏర్పడకుండా ఉజ్బెకిస్థాన్ ఆరోగ్యశాఖ, ఎంహెచ్ఇఐ ఆరోగ్య మంత్రిత్వ శాఖ భారతీయ ప్రతినిధి డైరెక్టర్ నియో, డాక్టర్ దివ్య రాజ్ సహాయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో భాగంగా 500 మందిని తాష్కెంట్ మెడికల్ అకాడమీలో, 1000 మంది విద్యార్థులను బుఖారా స్టేట్ మెడికల్ ఇనిస్టిట్యూట్‌లో మరో 500 మంది విద్యార్థులను ఉజ్బెకిస్థాన్‌లోని ఇతర సంస్థల్లో చేర్చుకున్నామన్నారు. టీఎంఏ, ఉజ్బెకిస్థాన్ ప్రతినిధి బృందం నియో గ్రూపుతో కలిసి రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక మంత్రి హరీష్ రావును కలిసి కార్యక్రమాలను వివరించారు. అక్కడి తెలుగు విద్యార్థుల క్షేమ సమాచారాన్ని అడిగిన మంత్రి.. వారిలో తెలివైన మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. తెలంగాణ విద్యార్థుల తరలింపులో డాక్టర్ దివ్య చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. తెలంగాణ నుంచి అల్లోపతితో పాటు ఆయుష్ చికిత్సలనూ ఉజ్బెకిస్థాన్‌లో ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను అందించాల్సిందిగా తెలంగాణ ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఈ క్లిష్ట సమయంలో తమ పిల్లల చదువుకు సహాయపడుతున్నందుకు తల్లిదండ్రులు... హెచ్.ఇ.అలిషర్ కయుమోవిచ్ షద్మనోవ్, డాక్టర్ బి.దివ్య రాజ్ రెడ్డిలకు జ్ఞాపిక అందజేశారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

మియాపూర్: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ బీపీ టాబ్లెట్స్ మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి, నెహ్రూనగర్‌కు చెందిన సౌమ్య(27)కు బీరంగూడకు చెందిన క్రాంతితో ఏడాది క్రితం వివాహం జరిగింది. క్రాంతి బీరంగూడ ప్రాంతంలో ఇంటర్నెట్ షాప్ నిర్వహిస్తుండగా సౌమ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. గత కొద్ది రోజులుగా అతను వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో గత నెల తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన సౌమ్య అక్కడే ఉంటుంది. అంతేగాక కొన్ని రోజుల క్రితం సౌమ్యకు అబార్షన్ కావడంతో భర్తకు ఈ విషయాన్ని చెప్పింది. దీంతో అతను సౌమ్యతో గొడవపడ్డాడు. మనస్తాపానికి లోనైన సౌమ్య బుధవారం తెల్లవారు జామున బీపీ టాబ్లెట్స్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఆమెను స్థానిక అర్చన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సౌమ్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వలపు వల



- అందమైన రూపంతో ప్రభుత్వ ఉద్యోగికి ఎర
- న్యూడ్ వీడియో కాల్ చేసి బెదిరింపులు
- పోలీసు కేసుల పేరుతో భయపెట్టి రూ.5 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఓ అందమైన యువతి అనుకోకుండా వీడియో కాల్ చేయడంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆమె మాయలో పడ్డాడు. మాయలేడి మాయ మాటలు చెప్పి ఆయనను పీకల్లోతు ప్రేమలోకి తీసికెళ్లింది. కట్ చేస్తే న్యూడ్ వీడియోను అడ్డం పెట్టుకుని రూ.లక్షలు కాజేసింది. ఆ వీడియో బయటకు వస్తే తన పరువుపోతుందని భావించిన అతను తనకు న్యాయం చేయాలని కోరుతూ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీపీ కేవీఎం ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చంపాపేటకు చెందిన వ్యక్తి ఓ ప్రభుత్వోద్యోగిగా పని చేస్తున్నాడు. విధుల్లో ఉన్న ఆయనకు ఓ నంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. దానిని లిఫ్ట్ చేయగా అవతలి వైపు అందమైన అమ్మాయి కనిపించింది. మీతో స్నేహాన్ని పంచుకోవాలనుకుంటున్నానంటూ తియ్యని మాటలతో అతడిని రెచ్చగొట్టింది. ఇంటికెళ్లిన తర్వాత కాల్ చేస్తానంటూ చెప్పి అతను కాల్ కట్ చేశాడు. రాత్రి ఇంటికి వెళ్లిన తర్వాత ఒంటరిగా సదరు యువతికి కాల్ చేశాడు. వీడియో కాల్‌లో ఒకరినొకరు న్యూడ్‌గా చూసుకుంటూ మాట్లాడుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఓ వ్యక్తి కాల్ చేసి పోలీసునని పరిచయం చేసుకున్నాడు. మీరు ఓ యువతిని భయపెట్టి ఆమెతో న్యూడ్ వీడియో కాల్ మాట్లాడారని, మేం చెప్పినట్లు వినకపోతే వీడియోకాల్‌ను సోషల్ మీడియాలో పెట్టడమే కాక కేసు ఫైల్ చేస్తామన్నారు. ఈ విషయం బయటికి వస్తే తన పరువు పోతుందనే భయంతో అతను వారికి రూ.5లక్షలు ముట్టజెప్పాడు. ఇంకా కావాలని ఫోన్ చేసి వేధిస్తుండటంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్మీ అధికారుల పేరుతో టోకరా

- స్కానింగ్ మిషన్స్ కావాలంటూ రూ.25లక్షలు స్వాహా
- డోసింగ్ పంప్ కావాలంటూ మరో వ్యక్తి నుంచి రూ.1.5 లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ఆర్మీ అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు పెరిగిపోతున్నాయి. రెండు రోజుల క్రితం మలక్‌పేటకు చెందిన ఓ ఫార్మా కంపెనీ నిర్వాహకులకు భారీగా టోకరా వేశారు. విదేశాల్లో ఉన్న కంపెనీ ఎండీతో సంప్రదింపులు జరిపిన వారు రూ.25 లక్షలు తమ ఖాతాలో జమ చేయించుకున్నారు. ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన కంపెనీ నిర్వాహకులు గురువారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మలక్‌పేటకు చెందిన ఓ ఫార్మా కంపెనీ డిజైనింగ్ వర్క్ చేస్తుంటుంది. ఆర్మీ అధికారులుగా పరిచయం చేసుకున్న ఇద్దరు వ్యక్తులు మీ కంపెనీ నుంచి స్కానింగ్ మిషన్స్ కావాలంటూ విదేశాల్లో ఉన్న సదరు కంపెనీ ఎండీని ఆన్‌లైన్‌లో సంప్రదించారు. ఆయనకు మెయిల్ పెట్టి స్కానింగ్‌కు సంబంధించిన కొటేషన్ తీసుకున్నారు. ఆర్మీ రూల్స్ ప్రకారం ముందుగా కొంత సొమ్ము మీరే చెల్లించాలని రెండు అకౌంట్ నంబర్లు ఇచ్చారు. వీటిని ఆయన తన కంపెనీ కరెంట్ అకౌంట్‌కు యాడ్ చేసుకున్నాడు. ఆ తర్వాత ఆరు దఫాలుగా రూ.25లక్షలు స్వాహా చేశారు. మీరు పంపిన డబ్బు తమకు అందలేదని రాలేదని చెబుతూ ఇంకా కావాలనడంతో బాధితులు సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించారు. మరో ఘటనలో ఆర్మీ క్యాంటీన్‌కు డోసింగ్ పైప్ కావాలని ఓ వ్యక్తి బేగంపేటకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి కాల్ చేశాడు. శ్రీనివాస్ సంబంధిత వ్యాపారంలో ఉండటంతో వారు చెప్పిన విధంగా తొలుత కొంత డబ్బు పంపాడు. ఆ డబ్బు రాలేదంటూ మూడు దఫాలుగా రూ.1.57 లక్షలు కాజేశారు.

రైల్ పోస్ట్ గతి శక్తి ఎక్స్‌ప్రెస్ కార్గో సర్వీస్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జాయింట్ పార్సిల్ ప్రొడక్ట్ విధానంలో తన మొదటి పార్శిల్ రైలు సర్వీస్‌ను 'రైల్ పోస్ట్ గతి శక్తి ఎక్స్‌ప్రెస్ కార్గో సర్వీస్' పేరుతో అందిస్తోంది. ఈ సేవల్ని కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్‌కు మొదటి పార్శిల్ రైలు ద్వారా గురువారం ప్రారంభించింది. వినియోగదారులకు డోర్ టు డోర్ పార్శిల్ సేవలను అందించడం లక్ష్యంగా భారతీయ రైల్వేలు, ఇండియా పోస్ట్ సంయుక్తంగా ఈ పార్శిల్ సేవలను అందిస్తున్నాయి. ఇంటి నుంచి పార్శిల్ లోడింగ్ చేసే స్థలం వరకు, పార్సిల్ అన్ లోడింగ్ చేసే స్థలం నుంచి వినియోగదారుల ఇంటికి మొదటి మైలు, చివరి మైలు తపాలా శాఖా అందిస్తుంది. ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్ కు రవాణాను రైల్వే శాఖ నిర్వహిస్తుంది రైల్ పోస్ట్ గతి శక్తి ఎక్స్‌ప్రెస్ కార్గో సర్వీస్ క్రమం తప్పకుండా రేణిగుంట నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వరకు వారానికి నాలుగు సార్లు (సోమవారం, బుధవారం, శుక్రవారం, శనివారం) నడిచే ఈ సర్వీసు కాచిగూడ, నాగ్‌పూర్, భోపాల్ తుగ్లకాబాద్ మీదుగా వెళుతుంది. ఆయా స్టేషన్లలో లోడింగ్ / అన్‌లోడింగ్ సదుపాయం కూడా ఉంది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, రైల్ పోస్ట్ గతి శక్తి ఎక్స్‌ప్రెస్ కార్గో సర్వీస్‌ను అమలులోకి తెచ్చినందుకు కమర్షియల్ ఆపరేటింగ్ బృందాన్ని అభినందించారు. కస్టమర్లకు డోర్ టు డోర్ పార్సిల్ సర్వీస్‌ను అందించడం ద్వారా పార్సిళ్ల రవాణాలో ఈ సరికొత్త సేవగా మారుతుందని ఆయన అన్నారు.

రేషన్ షాపులపై 'విజిలెన్స్'

- ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో 15 మంది సభ్యులతో కమిటీ
- సూచనలు, సలహాలు ఇవ్వాలన్న అధికారులు


విజిలెన్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రమేష్, కార్పొరేటర్లు

వెంకటేశ్వరకాలనీ: రేషన్ సరుకులను వినియోగదారులకు పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. గతంలో ఉన్న ఫుడ్ అడ్వయిజరీ కమిటీల స్థానంలో వీటిని వేసింది. ఆహార భద్రతా చట్టం–2015 ప్రకారం రేషన్ షాపుల ద్వారా సరఫరా అయ్యే బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర సరుకులను కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేయడమే ఈ కమిటీల లక్ష్యం.

రేషనింగ్ సర్కిల్–07 పరిధిలో...

రేషనింగ్ సర్కిల్–07 ఖైరతాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళ్‌రావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ తదితర 12 డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ షాపులకు సంబంధించి 83127 రేషన్ కార్డులు ఉండగా, వీరికి మరింత పారదర్శకంగా సేవలంచే లక్ష్యంగా ఈ విజిలెన్స్ కమిటీలు పని చేయనున్నాయి.

ఛైర్మన్‌గా డీఎస్‌ఓ..

రేషనింగ్ సర్కిల్–7 ఖైరతాబాద్ జోన్ ఛైర్మన్‌గా జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎం. రమేష్ వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా సర్కిల్–7 సహాయ సరఫరాల అధికారి బ్రహ్మారావు, సభ్యులుగా వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగళ్‌రావునగర్ కార్పొరేటర్ దేదీప్య, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డి, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మీ బాల్‌రెడ్డి వ్యవహరిస్తారు. అలాగే ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక మహిళా గ్రూప్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు సభ్యులను నియమిస్తారు.

కేవలం సలహాలు, సూచనలు మాత్రమే..

- కొత్తగా ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తారు. మొట్ట మొదటి సమావేశాన్ని గురువారం ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని సర్కిల్–7 రేషనింగ్ కార్యాలయంలో నిర్వహించగా డీఎస్‌ఓ రమేష్, ఏఎస్‌ఓ బ్రహ్మారావుతో పాటు పలువురు కార్పొరేటర్లు హాజరయ్యారు.
- ఈ కమిటీలోని సభ్యులంతా కేవలం సమావేశాల్లో రెగ్యులర్‌గా పాల్గొని రేషన్ షాపులకు సంబంధించి, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయడంతో పాటు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వా ఉంటుందని ప్రభుత్వం జారీ చేసిన జీఓలో స్పష్టంగా ఉంది.

బియ్యం తీసుకోకపోతే కార్డు రద్దు కాదు...

రేషన్ బియ్యం మూడు నెలల పాటు తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దవుతుందన్న అపోహ ఉందని, ఇది నిజం కాదని డీఎస్‌ఓ రమేష్ పేర్కొన్నారు. మూడు నెలలు బియ్య తీసుకోకపోయినా కార్డు రద్దు కాదన్నారు. ఈ విషయంపై కమిటీ సభ్యులు కార్డుదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

ప్రభుత్వ పరిధిలో కొత్త షాపుల అంశం..

విజిలెన్స్ కమిటీ సమావేశంలో పలువురు సభ్యులు(కార్పొరేటర్లు) తమ ప్రాంతంలో కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని, ఇన్‌చార్జిలుగా ఉన్న రేషన్ షాపులకు రెగ్యులర్ డీలర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం ప్రభుత్వ పరిధిలో ఉందని, కొత్తగా జీఓ జారీచేస్తే ఆ మేరకు కొత్త దుకాణాలు ఏర్పాటవుతాయని కమిటీ ఛైర్మన్ రమేష్ స్పష్టం పేర్కొన్నారు.

కిలో మీటర్‌కు ఒక షాపు ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: ఖైరతాబాద్ సర్కిల్‌లో ప్రతీ కిలో మీటర్‌కు ఒక రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారి బ్రహ్మారావును కోరారు. బీఎస్ మక్తా, జహీరానగర్, భోళానగర్, నందీనగర్ చుట్టుపక్కల ప్రాంతాల వారు చౌకధరల దుకాణం దూరంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

క్లుప్తంగా

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ సిద్ధం


ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు ఏర్పాటు చేసిన బోర్డు

ఫిలింనగర్: నూతన పోలీస్ స్టేషన్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధి కిందకు వచ్చే నూతన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు దాదాపుగా పూర్తయింది. ఫిలింనగర్‌లోని షిరిడి సాయిబాబా ఆలయం వెనుకాల సొసైటీ స్థలంలో నూతన పోలీస్ స్టేషన్ పనులను శరవేగంగా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేసి మరమ్మతులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గురువారం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొత్త పోలీస్ స్టేషన్ ప్రారంభం, ఇన్‌స్పెక్టర్ నియామకం తదితర అంశాలన్నీ వచ్చే నెల 16వ తేదీ తర్వాత జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు మార్టిన్ విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 142 మున్సిపాలిటీలు, 11 కార్పొరేషన్లలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగానే పీఆర్‌సీ అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. పీఆర్‌సీ అమలు చేసే వరకు కనీస వేతనం రూ. 24 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఏసీపీకి అభినందనలు


ఏసీపీని అభినందిస్తున్న ఎంఐఎం నాయకులు

రహమత్‌నగర్: బంజారాహిల్స్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ శ్రీధర్‌ను ఆళయ్యనగర్ ఎంఐఎం నాయకుడు షేక్ జహంగీర్ గురువారం కలిసి అభినందించారు. శాంతి భద్రతలను కాపాడంలో ఎంఐఎం పార్టీ నాయకులు పోలీసులకు సహకారం అందించాలని ఏసీపీ కోరారని జహంగీర్ తెలిపారు. ఎంఐఎం నాయకుడు ఎర్ర నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో రోడ్లు ధ్వంసం


ఫిలింనగర్‌లో మురుగుతో దెబ్బతిన్న రోడ్డు

ఫిలింనగర్: మురుగు నీటి ప్రవాహంతో రోడ్లు దెబ్బతింటున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ప్రధాన దారిలో నిత్యం మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగుతుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. అపోలో ఆస్పత్రి జనరల్ ఆస్పత్రి వద్ద నుంచి మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పెద్ద ఎత్తున పారుతుండటంతో ఏబీఎన్ చౌరస్తాలో రోడ్డు మొత్తం దెబ్బతింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: వ్యక్తి అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బంజారాహిల్స్ రోడ్ నం.10లో నివసించే యు. శ్రీనివాస్‌రెడ్డి లేబర్ పని చేస్తుంటాడు. గత నెల 24న పనికి వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి తమ బంధుమిత్రుల ఇళ్లతో పాటు స్వగ్రామంలో వాకబు చేసింది. పలు ప్రాంతాల్లో గాలించింది. అయినా భర్త ఆచూకీ తెలియకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఆచూకీ తెలిసిన వారు నం. 8712660546కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

టీవీ కళాకారులకు ప్రభుత్వం అండ: తలసాని



కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలపై పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: టీవీ కళాకారులకు సీఎం కేసీఆర్, ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతామని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ టీవీ, డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఓ రోజు ముందుగా ఘనంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, టీవీ రంగం నేడు చాలా కీలకంగా మారిందని, లక్షలాది మందికి వినోదాన్ని అందిస్తుందన్నారు. టీవీ కళాకారుల చిరకాల స్వప్నం టీవీనగర్‌తో పాటు ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఆయన సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ అనిల్ కూర్మా చలం, తెలంగాణ ఇరిగేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, టీవీ ఫెడరేషన్ ఫౌండర్ ఛైర్మన్ నాగబాల డి సురేష్‌కుమార్, ఫెడరేషన్ అధ్యక్షుడు నాని, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ట్రెజరర్ నరేందర్‌రెడ్డి, ఖుద్దూస్, మోహన్‌రాజ్, మురళి, గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

బంజారాహిల్స్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. ట్రాఫిక్ సీఐ టి. నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 20 మంది వాహనదారులను గురువారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. మద్యం తాగి రెండోసారి పోలీసులకు పట్టుబడ్డ ప్రకాశం జిల్లాకు చెందిన చిరంజీవి(35)కు ఆరు రోజుల జైలుతో పాటు రూ. 3300 జరిమానా, రాయదుర్గానికి చెందిన పి. శశికుమార్(25)కు ఏడు రోజుల జైలు, ఫిలింనగర్‌కు చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి(30)కి మూడు రోజుల జైలు, యూసుఫ్‌గూడకు చెందిన ఎం. సంతోషకుమార్(23)కు రెండు రోజుల జైలు, ఖైరతాబాద్‌కు చెందిన ఎ.రవిచంద్ర గుప్తాకు రెండు రోజుల జైలు శిక్షను మేజిస్ట్రేట్ విధించారు. పోలీసులు వీరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. మొత్తం 20 మందిలో ఐదుగురికి జైలు శిక్ష పడగా మిగతా వారందరికీ రూ. 2100 చొప్పున జరిమానా విధించారు.

రేషన్ బియ్యం పట్టివేత

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లోని శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. గురువారం ఓ రేషన్ షాపు నుంచి నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఓ వ్యక్తి ప్లాస్టిక్ సంచుల్లో తరలించేందుకు యత్నించగా మధు, సాయి అనే ఇద్దరు అడ్డుకుని ఆరా తీస్తుండగా సదరు వ్యక్తి బియ్యం సంచులను అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించారు. పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ విష్ణు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బియ్యాన్ని తరలించే వ్యక్తి గురించి ఆరా తీస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


చోరీ చేసిన వాహనాలతో నిందితుడు వెంకటేష్

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తి జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఒంగోలు జిల్లా కందుకూరుకు చెందిన పిల్లి వెంకటేష్ (24) కొంతకాలంగా రహ్మత్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ ఇతగాడు పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలిస్తున్నాడు. ఈ నెల 10న రహ్మత్‌నగర్‌లోనే అభిషేక్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన హోండా యాక్టీవాను దొంగిలించాడు. బాధితుడు అదే రోజు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి విచారించగా ఇప్పటికే నాలుగు బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. ఇందులో మూడు బైక్‌లు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఒక బైక్ ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించినట్లు గుర్తించారు. బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అబాకస్ జీనియస్ పోటీల్లో 'ఎలేట్' విద్యార్థి ప్రతిభ


క్రాంతి మనస్వి

బంజారాహిల్స్: అబాకస్ అర్థమెటిక్ జీనియర్ పోటీలు–2022లో నగరానికి చెందిన ఎలేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతున్న కర్రి క్రాంతి మనస్వి ఒకటవ రన్నరప్‌గా నిలిచింది. ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్లలో జరిగాయి. మొత్తం 253 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా, తుది దశకు 15 మందిని ఎంపిక చేశారు. ఈ 15 మంది జాతీయ విజేతల్లో ఛాంపియన్, ఫస్ట్ రన్నరప్, సెకండ్ రన్నరప్‌గా బహుమతులు అందజేశారు. ఒకటవ రన్నరప్‌గా నిలిచిన క్రాంతిని స్కూల్ యాజమాన్యం అభినందించింది.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత

మృతదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత


చందోలు అన్నపూర్ణమ్మ (ఫైల్)

బంజారాహిల్స్: తాను చనిపోతే తన శరీరం సమాజానికి ఉపయోగపడాలని ఓ వృద్ధురాలు భావించింది. తన మరణానంతరం తన మృతదేహాన్ని వైద్య పరిశోధనల కోసం వైద్య కళాశాలకు అప్పగించాలంటూ గతంలోనే అమ్మ నేత్ర అవయవ దాన ప్రోత్సాహకుల సంఘానికి హామీ పత్రం రాసి ఇచ్చింది. వందేళ్ల వయసులో ఆ బామ్మ బుధవారం తుది శ్వాస విడవగా కుటుంబ సభ్యులు ఆమె భౌతికకాయాన్ని గురువారం పటాన్‌చెరులోని టీఆర్‌ఆర్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే... దిల్‌షుక్‌నగర్‌లో నివసించే చందోలు అన్నపూర్ణమ్మ(100) కన్నుమూయగా అంతకుముందే ఆమె రాసి ఇచ్చిన హామీ పత్రం మేరకు గురువారం కుటుంబ సభ్యులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలకు అప్పగించారు. సమాజ హితం కోసం ఆమె తీసుకున్న నిర్ణయంపై బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

కేసీఆర్ బర్త్‌డే నిర్వహణకు ఏర్పాట్లు

లిబర్టీ: భారత రాష్ట్ర సమితి రథ సారథి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ తెలిపారు. ఉద్యమ పార్టీగా మొదలై అధికారం సాధించడంతో పాటు అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్ర భాగంలో నిలపడంలో ప్రధాన భూమిక పోషించిన కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మార్చిలో పీజీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు పేర్కొన్నారు. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు పీజీ కాలేజీలో కొనసాగుతున్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెల్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, సోషల్ వర్క్ రెగ్యులర్ పీజీ కోర్సులతో పాటు నిజాం కాలేజీలోని ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 28 వరకు, రూ.300 అపరాధ రుసుంతో వచ్చే నెల 13 వరకు ఫీజు చెల్లించాలన్నారు.

బ్లాక్ ఫిలిం అద్దాల కార్లకు జరిమానా


బ్లాక్ ఫిలిం డ్రైవ్‌లో జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వెంకటేశ్వరకాలనీ: కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఏర్పాటు చేసుకొని తిరుగుతున్న వాహనదారులకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం. 12 అగ్రసేన్‌చౌరస్తాతో పాటు వేర్వేరు చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మోటారు వాహన చట్టం నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకు నలుపురంగు తెరలు ఏర్పాటు చేసుకున్న వారిని ఆపి అక్కడికక్కడే జరిమానాలు వేశారు. అగ్రసేన్ చౌరస్తాలో 22 వాహనాలకు జరిమానాలు విధించగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కరోజే 30కిపైగా కేసులు నమోదయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ నరసింహ రాజు తెలిపారు.

చిన్నారులకు వినికిడి పరీక్షలు


అంగన్‌వాడీ కేంద్రంలో వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్ నగర్ బస్తీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు, కేంద్రానికి వచ్చే కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు గురువారం ఉచిత వినికిడి, చెవి, ముక్కు గొంతు పరీక్షలు నిర్వహించారు. ఆశ్రయ్ ఆకృతి చేపట్టిన కమ్యూనిటీ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ పరీక్షలు చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ఉచితంగా తమ సంస్థ ఆధ్వర్యంలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయించి వినికిడి యంత్ర పరికరాలు కూడా అందజేస్తామని వారు పేర్కొన్నారు.

అధికార పార్టీ ఓటమి ఖాయం

ఫిల్మ్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుందని, అధికార పార్టీ ఓటమి ఖాయమని ఖైరతాబాద్ కాంగ్రెస్ నేత, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి అన్నారు. గురువారం ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేద్కర్ నగర్ బస్తీలో హాత్ సే హాత్ జోడో యాత్ర సాగింది. ఈ సందర్భంగా ప్రజలకు పార్టీ సిద్ధాంతాల కరపత్రాలను అందజేశారు. స్థానిక ఎంఎల్‌ఏ ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పద్మాలయా అంబేద్కర్ నగర్ బస్తీలో పర్యటిస్తున్న రోహిణ్ రెడ్డి

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ఖైరతాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మనతో పాటు మన తోటి వారికి కూడా ఎలాంటి ఆపద తలెత్తకుండా కాపాడవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. ఖైరతాబాద్‌లోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలను ఎలా పాటించాలనే విషయంపై ఏసీపీ శంకర్ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడంతో పాటు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సీహెచ్ జ్యోతి, చిరంజీవి, చక్రధర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూ వీసీపై మంత్రికి ఫిర్యాదు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌పై గురువారం ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర వర్సిటీల మాదిరి కాకుండా యూజీసీ పేరుతో ఇష్టారాజ్యంగా సెంట్రల్ యూనివర్సిటీల తరహాలో పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఓయూలో ఐదేళ్ల తర్వాత పాత నిబంధనలతో 2022 ఆగస్టులో పీహెచ్‌డీ నోటిఫికేషన్ వెలువడగా నవంబరులో వచ్చిన కొత్త నిబంధనలను పాటిస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లపై ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని వినతిలో పేర్కొన్నారు. జపాన్ నుంచి వీసీ రాగానే చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు తెలిపారు.

మంత్రికి ఆహ్వానం

అమీర్‌పేట: అమీర్‌పేట హనుమాన్ దేవస్థానంలో రాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి ఎం.విఠలయ్య తెలిపారు. 18వ తేదీన జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని గురువారం ఆయన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

'యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు కష్టం'

రాయదుర్గం: విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేయడం చాలా కష్టమైన పని అని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా మాజీ వైస్‌చాన్స్‌లర్, అలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీ న్యాయ విభాగం ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యా విభాగం(డీడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో సుఘ్రా హుమాయున్ మీర్జా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం 'భారత రాజ్యాంగం, లింగ సమానత్వం, యూనిఫామ్ సివిల్ కోడ్' అనే అంశంపై వీసీ ప్రొ.ఐనుల్ హసన్ అధ్యక్షతన నిర్వహించారు. గతంలో మహిళలు విద్య అభ్యసించడం చాలా కష్టమైన పని అని, హుమాయున్ మీర్జా బాలికలు, మహిళలను విద్యలో ప్రోత్సహించారన్నారు. ఉర్దూ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ బాలికలు, మహిళల విద్యా కార్యక్రమాలకు ఉర్దూ విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు.

రాజీవ్‌గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మహేశ్

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్‌గాంధీనగర్ బస్తీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బస్తీలో గురువారం నిర్వహించిన సమావేశంలో మెజారిటీ సభ్యులు మహేశ్‌ను బలపర్చడంతో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ నాయకులు రాములు, ఎల్లయ్య, స్వామి, మాసయ్య, శ్రీనివాసులు, శంకర్ మాట్లాడుతూ.. బస్తీ అభివృద్ధి మహేశ్‌తోనే సాధ్యమవుతుందన్న ఉద్దేశంతో 40 మంది బస్తీ నాయకులు అతడిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని తెలిపారు.

క్లుప్తంగా...

బీజేపీకి 'కన్నా' గుడ్ బై



సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు మెడికల్: మాజీమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గుంటూరు లోని తన స్వగృహంలో గురువారం ఈ విషయాన్ని ఆయన మీడియాకు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వైఖరివల్లే తాను పార్టీ వీడుతున్నట్లు తెలిపా రు. బీజేపీ రాష్ట్ర పార్టీలో నెలకొన్న పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు కేంద్ర నాయకత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదని కన్నా ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధా నాలపై పోరాడే విషయంలో సోము వీర్రాజు వ్యవహారశైలి నచ్చకపోవడంవల్ల పార్టీని వీడుతున్నట్లు ఆయన స్పష్టంచేశారు. తనకు మోదీ మీద అభిమానం జీవితకాలం ఉంటుందన్నారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలో వెల్లడిస్తానని కన్నా చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ ఎమ్మెల్యే జయమంగళ



సీఎం సమక్షంలో పార్టీలో చేరిన జయమంగళ

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2009లో కైకలూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన నియోజక వర్గ టీడీపీ ఇంచార్జ్‌గా కొనసాగుతూ బుధవారం ఆ పార్టీకి, కైకలూరు టీడీపీ ఇంచార్జ్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు సయ్యపరాజు గుర్రాజుతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చారు. వారిద్దనీ సీఎం జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వెంకటరమణ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 1999లో చంద్రబాబును నమ్మి, వ్యాపారాలు వదులుకుని టీడీపీలో చేరితే ఆ తర్వాత తీరని ద్రోహం చేశారని, ఓ దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని వాపోయారు.

పెద్ద ఉద్యోగం పక్కా

- విద్యార్థులకు లక్కీ చాన్స్.. విప్రో 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్'
- బిట్స్ పిలానీ నుంచి ఎంటెక్.. ఆపై ఉద్యోగం కూడా
- ఏపీ ప్రభుత్వ సహకారంతో అమలుకు సన్నద్ధం.. బీసీఏ, బీఎస్సీ డిగ్రీ అభ్యర్థులకు మంచి అవకాశం



సాక్షి, అమరావతి: ఇటు ఉన్నత చదువు.. అటు ఉద్యోగం! ఒకేసారి రెండు లక్ష్యాలు నెరవేరే చాన్స్.. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానీలో ఎంటెక్ అడ్మిషన్.. నెలనెలా స్టైఫండ్.. కనీసం రూ.5 లక్షలతో జాబ్.. ఇదంతా సాధారణ డిగ్రీతోనే సాకారం కానుంది.. యువత నైపుణ్యాలను పెంపొందిస్తూ, ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి మంచి ఫలితాలు లభిస్తున్నాయి. విద్యార్థులు చదువులు పూర్తి చేసి బయటకు రాగానే అవకాశాలను అందిపుచ్చుకునేలా పలు ప్రముఖ సంస్థల ద్వారా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుండడంతో రాష్ట్రంలో ఏటా ప్లేస్‌మెంట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, గూగుల్, బ్లూప్రిజమ్, ఏడబ్ల్యూఎస్ తదితర ప్రముఖ సంస్థలు మన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలూ కల్పిస్తున్నాయి. నేటి అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆయా సంస్థలు కోరుకునే నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాషా ప్రావీణ్యం మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతతో ప్రతిష్టాత్మక సంస్థలు మన విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు ఉత్సాహం చూపుతున్నాయి. తాజాగా ప్రముఖ ఐటీ సంస్థ "విప్రో" విద్యార్థులకు ఉన్నత చదువుతోపాటు ఉద్యోగం కూడా ఇచ్చేలా 'వర్క్ - ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్'ని రాష్ట్ర ప్రభుత్వంతో కలసి అమలు చేసేందుకు ముందుకొచ్చింది.

బిట్స్ పిలానీలో ఎంటెక్.. ఆపై ఉద్యోగం

వర్క్ - ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ద్వారా అర్హులైన విద్యార్థులకు విప్రో సంస్థ ఫుల్ టైమ్ జాబ్, ఫుల్ స్పాన్సర్‌షిప్‌తో 'బిట్స్ - పిలానీ' (బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)లో ఎంటెక్ కోర్సు చదివే అవకాశం కల్పిస్తోంది. 2021, 2022, 2023 బ్యాచ్‌లకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఈ అవకాశం కల్పించనున్నారు. బీసీఏ, బీఎస్సీ గ్రాడ్యుయేట్లను అర్హులుగా పరిగణించనున్నారు. కంప్యూటర్ సైన్సు, ఐటీ, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఆయా కోర్సులు పూర్తిచేసిన వారు ఇందుకు అర్హులు. తప్పనిసరిగా 60 శాతం మార్కులు లేదా 6 సీజీపీఏ కలిగి ఉండాలి. బ్యాక్‌లాగ్‌తో ఒకసబ్జెక్టు వరకు అవకాశం కల్పిస్తారు. అయితే 6వ సెమిస్టర్ నాటికి అన్ని బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మూడేళ్ల కాలపరిమితిలో డిగ్రీ పూర్తి చేసిన వారికి ఈ అవకాశం కల్పించనున్నారు.

నెలవారీ స్టైఫండ్.. రూ.5లక్షల ప్యాకేజీతో జాబ్

వర్క్ - ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌కి ఎంపికైన వారికి ఎంటెక్ చేసే సమయంలో నెలవారీ స్టైఫండ్‌ను విప్రో సంస్థ అందించనుంది. స్టైఫండ్ కింద మొదటి ఏడాది నెలకు రూ.15,488 చొప్పున అందిస్తారు. రెండో ఏడాది నెలకు రూ.17,553 చొప్పున, మూడో ఏడాది రూ.19,618 చొప్పున ఇస్తారు. నాలుగో ఏడాది నెలకు రూ.23 వేలు చొప్పున చెల్లిస్తారు. కోర్సు పూర్తైన వెంటనే సంస్థలోనే ఉద్యోగాన్ని కల్పిస్తారు. ఎంటెక్‌లో పెర్ఫార్మెన్స్ ఆధారంగా వేతనాన్ని నిర్ణయిస్తారు. వేతనాల ప్యాకేజీ ఏడాదికి రూ.5 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. శిక్షణ కాలం 60 నెలలు. ఎంటెక్ విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం జాయినింగ్ బోనస్ కింద రూ.76 వేలు చెల్లిస్తారు. అయితే ఎంపికైన అభ్యర్థులు మధ్యలో నిష్క్రమించినా, అగ్రిమెంట్‌కు భిన్నంగా వ్యవహరించినా ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు రూ.75 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుకు రేపే తుది గడువు

రాష్ట్రంలోని విద్యార్థుల కోసం మూడు నగరాల్లో ఎంపిక ప్రక్రియ చేపడతారు. అసెస్‌మెంటు, డిస్కషన్‌ల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. విప్రో ద్వారా 8,000 మందిని ఎంపిక చేస్తారు. దీనికి సంబంధించి వర్సిటీల రిజిస్ట్రార్లు, ప్రిన్సిపాళ్లపై ఇప్పటికే చర్చించారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 2021, 2022 బ్యాచ్ గ్రాడ్యుయేట్లకు ఫిబ్రవరి 23న గుంటూరులో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఉత్తరాంధ్ర అభ్యర్థులకు అసెస్‌మెంట్, బిజినెస్ రౌండ్‌లను విశాఖపట్నంలో ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో నిర్వహిస్తారు. రాయలసీమ విద్యార్థులకు ఫిబ్రవరి 28న తిరుపతిలో ఎంపిక ప్రక్రియను చేపడతారు. 2023 బ్యాచ్ విద్యార్థులకు అసెస్‌మెంట్, బిజినెస్ రౌండ్ల ఎంపిక ప్రక్రియ మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. తేదీలను తరువాత ప్రకటిస్తారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

ఢిల్లీ ఎస్‌సీఈఆర్‌టీ బృందం కితాబు

రేణిగుంట/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యావ్యవస్థలో చోటుచేసుకున్న విప్లవాత్మకమైన సంస్కరణలు దేశానికే ఆదర్శం. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల భవిష్యత్‌ను దేదీప్యమానం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు మమ్మల్ని సంభ్రమాశ్చర్య చకితుల్ని చేస్తున్నాయి. నాడు-నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ట్యాబ్‌ల పంపిణీ, బైజూస్ క్లాసులు వంటి మంచి పథకాలు మరే రాష్ట్రంలో అమలు కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇక్కడి పిల్లలు భవిష్యత్‌లో గొప్ప ఆవిష్కర్తలుగా తయారై దేశకీర్తిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తారన్న విశ్వాసం కలుగుతోంది' అని ఢిల్లీ ఎస్‌సీఈఆర్‌టీ బృందం కితాబిచ్చింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఈ బృందం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, పాఠశాలల్లో నెలకొల్పిన వసతులు, పటిష్టమైన బోధనాభ్యసన వ్యవస్థ, నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ వంటి మహత్తర కార్యక్రమాలు అమలు చేస్తుండటంపై ప్రశంసల జల్లు కురిపించింది. ఢిల్లీ రాష్ట్రానికి చెందిన ఎస్‌సీఈఆర్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృదుల భరద్వాజ్ నేతృత్వంలో 28 మంది సభ్యుల బృందం తొలుత విజయవాడలోని పలు పాఠశాలలను పరిశీలించింది. అనంతరం బుధవారం ఎర్రావారిపాలెం, రేణిగుంట బాలికోన్నత పాఠశాల, గురువారం శ్రీకాళహస్తి బాలికోన్నత పాఠశాలను బృందంలోని సభ్యులు సందర్శించారు.

నీ పంట దున్నేయ్.. లీడర్‌ని చేస్తాం..

- తన పంటను తానే ధ్వంసం చేసుకున్న టీడీపీ కార్యకర్త
- పంటను ధ్వంసం చేసింది వైఎస్సార్‌సీపీ అంటూ దుష్ప్రచారం
- పాదయాత్రలో లోకేశ్ పరామర్శించేలా టీడీపీ స్కెచ్
- పోలీసుల విచారణతో వెలుగులోకి వచ్చిన కుట్ర



డ్రైవర్ మధు

శ్రీకాళహస్తి: తన పంటను తానే ధ్వంసం చేసుకుని వైఎస్సార్‌సీపీ వారిపైకి నెట్టిన టీడీపీ కార్యకర్త బాగోతం బట్టబయలైంది. పోలీసుల విచారణలో తెలుగుదేశం నేతల కుట్ర బయటపడింది. లోకేశ్ పాదయాత్ర తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మీదుగా సాగనుండడంతో దానికి ప్రచారం తీసుకురావాలని టీడీపీ నేతలు కుట్రకు తెరతీశారు. అందుకు పార్టీ కార్యకర్త మురళీకృష్ణారెడ్డిని పావుగా చేసుకున్నారు. మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణారెడ్డి 4.25 ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ సాగుచేశాడు. 'నీ పంటను నువ్వే ధ్వంసం చేసి దాన్ని వైఎస్సార్‌సీపీ వారు చేశారని ప్రచారం చెయ్యి. పాదయాత్రలో లోకేశ్‌ను మీ ఇంటికి తీసుకొస్తాం. నీకు నష్టపరిహారం ఇప్పించి, మంచి లీడర్‌ని చేస్తాం..' అంటూ మురళీకృష్ణారెడ్డికి చెప్పారు. దీంతో మురళీకృష్ణారెడ్డి, డ్రైవర్ మధు ఈనెల 9న (గురువారం) రాత్రి రోటావేటర్‌తో వేరుశనగ పంటను ధ్వంసం చేశారు. శుక్రవారం పొలం వద్దకు వెళ్లి తన పంటను వైఎస్సార్‌సీపీ నాయకులు నాశనం చేశారంటూ మురళీకృష్ణారెడ్డి గగ్గోలు పెట్టారు. పథకం ప్రకారం టీడీపీ నేతలంతా గ్రామంలో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులపైన, ప్రభుత్వంపైన తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కాల్ డేటా, సీసీ పుటేజీలు పరిశీలించి మురళీకృష్ణారెడ్డిని, మధుని విచారించారు. తన పంటను తానే ధ్వంసం చేసుకున్నట్లు మురళీకృష్ణారెడ్డి అంగీకరించారని సీఐ విక్రమ్ తెలిపారు. ఈ విషయంపై విలేకరులు డ్రైవర్ మధుని అడగగా.. పంట ధ్వంసం వెనుక రాజకీయాలు తనకు తెలియదన్నాడు. ధ్వంసం చేస్తే ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పడంతోనే దున్నేశానని స్పష్టం చేశాడు.

ఐటీ కేంద్రంగా విశాఖ

- మరిన్ని కంపెనీలు వచ్చేలా సీఎం కృషి: మంత్రి అమర్‌నాథ్
- 'గ్లోబల్ టెక్ సమ్మిట్'కు హాజరైన దేశ విదేశీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సమీప భవిష్యత్తులో విశాఖ ఐటీ డెస్టినీగా అవతరించనుందని, మరిన్ని టెక్ కంపెనీలు ఏర్పాటయ్యేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖ, తిరుపతి, అనంతపురంలో ఇప్పటికే ఐటీ పార్కులు ఏర్పాటు కాగా భోగాపురంలో త్వరలోనే కొత్త ఐటీ పార్క్ రానుందని వివరించారు. కరోనా తర్వాత ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోం విధానం అనుసరించగా రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్‌టౌన్ అనే నూతన విధానాన్ని సీఎం జగన్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. గురువారం విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం, పల్సస్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్లోబల్ టెక్ సమ్మిట్ - 2023ని ప్రారంభించిన అనంతరం మంత్రి విడదల రజని, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధునిక ఆవిష్కరణలతో పాటు ఐటీ, ఫార్మా, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడులకు సంబంధించి ఈ సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది. జీ-20 దేశాలతో పాటు వివిధ దేశాలకు చెందిన 300 కంపెనీలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్(ఈబీటీసీ), నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఆర్‌డీసీ) మధ్య సెన్స్, టెక్నాలజీపై ఎంవోయూ కుదిరింది. సదస్సులో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, బ్రిటిష్ హై కమిషన్ ఇన్ ఇండియా ప్రగ్యా చతుర్వేది, సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఏడీసీ అభిజిత్ ఘోష్, ఎన్ఆర్‌డీసీ సీఎండీ కమడోర్ అమిత్ రస్తోగి, జీ 20 నేషనల్ కోఆర్డినేటర్ డా.నవ సుబ్రహ్మణ్యన్‌తో పాటు సియోల్, టోక్యో, రోమ్, పారిస్, న్యూయార్క్, మెల్‌బోర్న్, బీజింగ్, లండన్, టోక్యో తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నగర వార్తలు

'మహా నాయకుడు కేసీఆర్' ఆవిష్కరణ



ఖైరతాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రజా డైరీ మాసపత్రిక రూపొందించిన మహా నాయకుడు కేసీఆర్ అనే పుస్తకాన్ని హోంమంత్రి మహమూద్ అలీ గురువారం ఆవిష్కరించారు. హోం మంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ప్రజా డైరీ ఎడిటర్, పబ్లిషర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాల్ ద్వారా పెళ్లి చూపులు

సాక్షి, సిటీబ్యూరో: జంటను కోరుకునే యువతీ యువకులు వీడియో ద్వారా పెళ్లి చూపుల కోసం వీలు కల్పిస్తూ షాదీ డాట్ కామ్ వినూత్న ఫీచర్ 'షాదీ లైవ్'ను గురువారం విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. తమ తాజా ఫీచర్ షాదీ లైవ్ ప్రతి 10 రోజులకు మార్పు చేర్పులతో కొనసాగుతుందదన్నారు. కార్యక్రమంలో అర్హులైన సింగిల్స్‌కు వీడియో కాల్స్ ద్వారా ఒకొక్కరితో అయిదేసి నిమిషాల చొప్పున 10 మందితో గంట పాటు సంభాషించే అవకాశం కలుగుతుందని వివరించారు. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

'మారియట్' ఆధ్వర్యంలో బొన్వాయ్ ఆన్ వీల్స్

సాక్షి, సిటీబ్యూరో: తమ అతిథులకు దేశవ్యాప్తంగా గొలుసుకట్టు సేవలు అందించేందుకు వినూత్న శైలిలో మారియట్ బొన్వాయ్ ఆన్ వీల్స్ (ఎంబీఓడబ్ల్యూ) పేరిట సరికొత్త కాన్సెప్ట్‌ను హోటల్ మారియట్ గురువారం ప్రారంభించింది. ఈ విషయాన్ని హోటల్ నగర ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా క్లబ్ మారియట్, సౌత్ ఆసియా యాప్, క్లబ్ మారియట్ వెబ్‌సైట్‌లను అనుసంధానం చేశామన్నారు. తద్వారా అతిథులు తమకు చెందిన 80 హోటల్స్‌లో బస, రెస్టారెంట్స్‌లో ముందస్తు రిజర్వేషన్లను సులువుగా పొందే వీలుంటుందని వివరించారు.

పోడు భూములకు పట్టాలిస్తామనడం హర్షణీయం

- చిన్నచిన్న కారణాలతో తిరస్కరించిన దరఖాస్తులను పునఃపరిశీలించాలి
- డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 20న ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా
- ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ



మాట్లాడుతున్న వేములపల్లి వెంకటరామయ్య

ముషీరాబాద్: ఆదివాసీలు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఈ నెల చివరి నుంచి పట్టాలు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గురువారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో రాష్ట్ర కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కెచ్చల రంగయ్య, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, వి.ప్రభాకర్, అంజయ్యనాయక్, ప్రసాద్, జక్కుల వెంకటయ్య తదితరులు మాట్లాడారు. గతంలో చేసిన వాగ్దానాల మాదిరిగా ప్రచారానికే పరిమితం కాకుండా సీఎం ప్రకటనను ఆచరణలో చేసి చూపించాలని కోరారు. తిరస్కరించిన అర్జీలను పునఃపరిశీలించి పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డలను ఆక్రమణదారులుగా పేర్కొని పోడు భూములపై ఆదివాసీలకు హక్కు లేదంటూ సీఎం మాట్లాడటం సరికాదని, అటవీ హక్కుల చట్టం 2006 ద్వారా పోడు భూములపై ఆదివాసీలకు హక్కు లభించిందన్నారు. దీంతోపాటు ఉట్నూరు మండలంలోని ధర్మాజీ పేట గ్రామస్తులందరూ ఆదివాసీలైనా అందరి అర్జీలు తిరస్కరించారన్నారు. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం ఎల్లన్న నగర్ సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాలు సర్వే కూడా చేయలేదని, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దొరవారి తిమ్మాపురం గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించేందుకు పూనుకుంటున్నారని తెలిపారు. కొన్ని చోట్ల అటవీ హక్కుల చట్టంలో లేని విధంగా మంజూరు చేసిన అర్జీదారులు 2005 ముందు ఆధార్ కార్డు చూపాలని షరతులు పెడుతున్నారన్నారు. చట్టంలో లేని సాక్ష్యాధారం ఉపగ్రహ ఛాయాచిత్రాల పేరిట అనేక దరఖాస్తులు తిరస్కరించారని చట్టానికి విరుద్ధంగా మైనర్ల పేరిట కుటుంబంలో ఒకరు ఉద్యోగం చేస్తున్నారనే పేరిట, అనేక మంది దరఖాస్తులను తిరస్కరించారని తెలిపారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వ్యతిరేకంగా దరఖాస్తు చేసుకున్న పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ఆదివాసీలు, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

'ఫ్రాంక్స్' ఆవిష్కరణ



కార్యక్రమంలో అనూప్ రూబెన్స్‌తో పాటు మారుతీ సుజుకి భారత ప్రతినిధులు, షోరూం వైస్ ప్రెసిడెంట్ షాలిన్ చౌదరి, బిజినెస్ హెడ్ స్టీవెన్స్ రెజినాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీ సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్ గురువారం నాగోల్‌లో సందడి చేశారు. నాగోల్‌లోని కళ్యాణి మోటార్స్ నెక్సాలో మారుతి సుజుకి నూతన మోడల్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ కారును అనూప్‌రూబెన్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విభిన్నమైన సాంకేతికతో రూపొందుతున్న కార్లు వినియోగదారులకు ఎంతో సౌలభ్యాన్నిస్తున్నాయన్నారు. ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో భద్రత, విలాసం కోసం కార్లను వాడటం పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

జింబాబ్వే ట్రేడ్ కమిషనర్‌గా రవికుమార్



సాక్షి, సిటీబ్యూరో: జింబాబ్వే ఇండియా ట్రేడ్ కౌన్సిల్‌కు సంబంధించిన రెండు తెలుగు రాష్ట్రాల జింబాబ్వే ట్రేడ్ కమిషనర్ రాయబారిగా నగరానికి చెందిన వ్యాపారవేత్త డాక్టర్ రవి కుమార్ పనస నియమితులయ్యారు. ఇందులో భాగంగా న్యూఢిల్లీలోని ఇండియన్ ఎకనమిక్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, డిప్యూటీ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మినిస్టర్-జింబాబ్వే రాయబారి రాజ్ కుమార్ మోడీలు డాక్టర్ రవి కుమార్ పనసకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... భారత్-జింబాబ్వే దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నెలకొల్పడం, సహకార సంబంధాలను కొత్త శిఖరాలను చేరుకునేలా కృషి చేయడమే లక్ష్యంగా కొనసాగుతానని అన్నారు. ఏప్రిల్‌లో భారత్ రానున్న ప్రతినిధి బృందం నూతన లక్ష్యాలను నిర్మించుకోవడానికి ఆసక్తిగా ఉందన్నారు. జింబాబ్వే రాయబారి సిబుసిసో బుసిమోయో, వివిధ దేశాలకు చెందిన వ్యాపార, దౌత్యవేత్తలు పాల్గొన్నారు.

వైదేహి ఆశ్రమంలో ఆదర్శ వివాహం

సైదాబాద్: నిరాశ్రయ బాలికలకు అన్నీ తానై అండగా నిలుస్తున్న వైదేహి ఆశ్రమం మరో ఆదర్శ వివాహానికి వేదికైంది. అనాథ బాలికలను అక్కున చేర్చుకొని విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా వారికి యుక్త వయస్సు వచ్చిన తరువాత వివాహాలు జరిపించి ఆ తరువాత కూడా ఆశ్రమ నిర్వాహకులు పుట్టినిల్లులా ఆశ్రమం ద్వారా అన్ని ఆచారాలు నిర్వహిస్తుంటారు. అనాథ ఆడ బిడ్డలకు అన్ని రకాలా అండగా ఉంటున్న ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీలోని వైదేహి ఆశ్రమంలో గురువారం 64వ ఆదర్శ వివాహం జరిపించారు. ఆశ్రమానికి చెందిన మౌనికకు కామారెడ్డికి చెందిన సాయిరెడ్డి కుమారుడు శ్రవణ్‌కుమార్‌తో ఆశ్రమ ప్రాంగణంలో వివాహం జరిపించారు. మౌనిక డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా, శ్రవణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కన్యాదాతలుగా పసుపునూరి దుర్గాదేవి, శివప్రసాద్ దంపతులు వ్యవహరించారు. వధూవరులను తెలంగాణ ప్రాంత సహ సంచాలకులు సుందర్‌రెడ్డి, సహ కార్యవాహిక మల్లికార్జున్, ఆశ్రమ అధ్యక్షురాలు సీతాకుమారి, వైదేహి సేవాసమితి అధ్యక్షుడు సుందర్‌రెడ్డి ఆశీర్వదించారు.



నూతన వధూవరులతో వైదేహి ఆశ్రమ నిర్వాహకులు

కీసరగుట్టలో జిల్లా స్థాయి క్రీడాపోటీల ప్రారంభం

- బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికుల కోసం పటిష్ట ఏర్పాట్లు
- మంత్రి చామకూర మల్లారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రతి సంవత్సరం కీసర గుట్టలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసరగుట్టలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గెలుపు, ఓటములు సహజమని వాటిని సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మంత్రి మల్లారెడ్డి వెల్లడించారు. 4 నుంచి 5 లక్షల మంది యాత్రికులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. వారికి తగ్గట్టుగా జిల్లా యంత్రాంగం తగు ఏర్పాట్లు పూర్తిచేసిందన్నారు. తాగునీరు, శానిటేషన్, శాంతి భద్రతలు, నిరంతర విద్యుత్, ఆర్టీసీ బస్సుల సౌకర్యం, క్యూలైన్లు, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులు, క్రీడాకారులకు అన్నదానం తదితర సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి బలరాం, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాశ్రీకాంత్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, సర్పంచ్‌నాయకపు మాధురివెంకటేష్, ఆర్డీఓ రవికుమార్, ఎంపీడీఓ రమాదేవి,ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణశర్మ, నేతలు మంద సంజీవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రావన్‌కుమార్‌గుప్తా, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి మల్లారెడ్డికి ఆర్డీవో రవి తెలిపారు. దైవసన్నిధిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు సంబంధించిన కార్యక్రమంలో తాను పాల్గొనడం కోడ్ ఉల్లంఘన ఎలా అవుతుందని మంత్రి పేర్కొనడం గమనార్హం.

ధీర వనిత సరోజినీనాయుడు: జస్టిస్ చంద్రకుమార్



సరోజినీ నాయుడు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

వనస్థలిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్న మనం జాతీయ మహిళా దినోత్సవాన్ని మరచి పోతున్నామని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. గురువారం వనస్థలిపురంలోని హిల్‌కాలనీలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సరోజినీ నాయుడు జయంతిని అప్పటి ప్రభుత్వం జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించినా ఎలాంటి ఉత్సవాలు జరుపుకోక పోవడం విచారకరమన్నారు. సమాజం, కులం, కట్టుబాట్లను పక్కనపెట్టి ఆనాడే కులాంతర వివాహం చేసుకున్న ధీశాలి సరోజినీ నాయుడు అని ఆయన పేర్కొన్నారు. మహిళల హక్కుల కోసం ఉద్యమాలు చేయడమే కాకుండా తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. నాంపల్లిలోని తమ సొంత స్థలం గోల్డెన్ త్రెషోల్డ్‌ను సెంట్రల్ యూనివర్సిటీ కోసం ఆమె విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర కాళోజీ పురస్కార గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ... అత్యంత ధైర్యశాలి, మహిళల హక్కుల కోసం ఉద్యమాలు చేసిన ధీశాలి సరోజినీ నాయుడు అని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, గాంధీ, నెహ్రూలతో కలిసి నడిచారని కొనియాడారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడీ టు సర్వ్ సంస్థ ప్రతినిధి శంకర్, మదర్ థెరిస్సా సేవా సంస్థ చైర్మన్ చేపూరి శంకర్, శివ, నరసింహారావు పాల్గొన్నారు.

అలరించిన విశ్వనాథ్ సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: ప్రముఖ సినీ దర్శకుడు పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్ సంస్మరణ సభ గురువారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్, గీతాలయ ఆర్ట్స్, ఆకాష్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించారు. విశ్వనాథ్ సినీసంగీత విభావరి సభికులను అలరించింది. గాయనీగాయకులు ఎంపిక చేసుకున్న చిత్రగీతలను ఆలపించి ఆకట్టుకున్నారు. విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఎస్వీ రామారావు, రఘురాం, వై.ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఉదయం 9 గంటల సమయంలో పొగమంచు



సూర్యాపేట జిల్లా కోదాడ శ్రీమన్నారాయణ కాలనీలో ఇలా..

కమ్మేసిన పొగమంచు

కోదాడ, మునగాల: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం పరిసర ప్రాంతాలు, మునగాల మండల కేంద్రాన్ని గురువారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. 65వ నంబర్ (హైదరాబాద్-విజయవాడ) జాతీయ రహదారిపై దీపాలు వెలిగించి వాహనాలను నడపాల్సి వచ్చింది.

ఎంసెట్ నోటిఫికేషన్‌పై ఎందుకు జాప్యం?

- తేదీల ప్రకటనతోనే సరి
- వెలువడని వివరణాత్మక నోటిఫికేషన్
- ఇంటర్ వెయిటేజీపై తేల్చని ప్రభుత్వం
- విద్యార్థుల్లో అయోమయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎంసెట్‌ను మే నెలలో నిర్వహిస్తామని తేదీలు ప్రకటించినా, ఇంతవరకూ వివరణాత్మక నోటిఫికేషన్ రాకపోవడంతో విద్యార్థుల్లో స్పష్టత కొరవడింది. ఎంసెట్‌లో ఇంటర్‌కు వెయిటేజీ ఉండబోదని కూడా అధికారులు చెబుతున్నా దీనిపై జీవో వెలువడలేదు. దీంతో ఎంసెట్‌ను నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు చేయలేకపోతున్నట్టు జేఎన్‌టీయూహెచ్ చెబుతోంది. మరోవైపు కళాశాలల అనుబంధ గుర్తింపు ప్రక్రియను జేఎన్‌టీయూహెచ్ వచ్చే వారంలో చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే కాలేజీల డేటా తెప్పించినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ఎంసెట్ నిర్వహణ, కౌన్సెలింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తే తప్ప, వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ త్వరగా పూర్తిచేసే వీలుండదని అంటున్నారు. వీలైనంత త్వరగా ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం క్లాసులు నిర్వహిస్తేనే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని యూనివర్సిటీల వీసీలు కూడా అంటున్నారు. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ తొలిదశ పూర్తయింది. రెండో విడత ఏప్రిల్‌లో జరగనుంది. కోవిడ్ మూలంగా గత రెండేళ్ళుగా విద్యా సంవత్సరం ఆలస్యంగా నడుస్తోంది. ఈసారైనా సకాలంలో పూర్తి చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అన్ని రాష్ట్రాలకూ సూచించింది. త్వరలోనే కొత్త విద్యా సంవత్సరంలో చేపట్టే మార్పులు, చేర్పులతో మార్గదర్శకాలు విడుదల చేయాలని భావిస్తోంది. కానీ మన రాష్ట్ర ఎంసెట్ విషయంలో మాత్రం అధికారులు నిర్లిప్తంగా ఉండటం విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక వర్గాలను ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది.

స్పష్టత కోరుతున్న విద్యార్థులు

ఎంసెట్ వివరణాత్మక నోటిఫికేషన్ వస్తేనే అన్ని విషయాలపై అవగాహన ఏర్పడుతుంది. ఈ ఏడాదికి 70 శాతం సిలబస్ ఉంటుందా? లేదా? వెయిటేజీ ఇస్తారా? ఇవ్వరా? అనేది తెలిస్తే ఎంసెట్‌కు ఎలా సన్నద్ధమవ్వాలనే దానిపై స్పష్టత ఉంటుందని విద్యార్థులు అంటున్నారు. వాస్తవానికి ఈ నెల 7వ తేదీన ఎంసెట్‌తో పాటు మరి కొన్ని ప్రవేశ పరీక్షల తేదీలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. మే 7వ తేదీన ఎంసెట్ ఇంజనీరింగ్, మే 12, 13, 14 తేదీల్లో ఫార్మసీ, అగ్రికల్చర్ ఎంసెట్ ఉంటాయని తెలిపారు. రెండురోజుల్లో వర్సిటీలు వివరణాత్మక నోటిఫికేషన్లు ఇస్తాయని చెప్పారు. కానీ ఇంతవరకు వెలువడకపోవడంతో ఎందుకు జాప్యం జరుగుతోందో అర్థం కాక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

వీలైనంత త్వరలో నోటిఫికేషన్

ఎంసెట్ నోటిఫికేషన్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. విడుదలకు ముందు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయినా వీలైనంత త్వరలోనే జారీ చేస్తాం. ఈ ఏడాది సాధ్యమైనంత వరకు సకాలంలోనే క్లాసులు మొదలవ్వాలనే లక్ష్యంతో ఉన్నాం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

5,204 స్టాఫ్ నర్స్ పోస్టులు.. 40 వేల దరఖాస్తులు

- గడువు పొడిగింపుతో మరో 15 వేలు దరఖాస్తులు వచ్చే చాన్స్
- ఆసుపత్రుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అభ్యర్థుల యాతన



సాక్షి, హైదరాబాద్: స్టాఫ్‌నర్స్ పోస్టులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. వైద్య, ఆరోగ్య శాఖ నెలన్నర క్రితం 5,204 స్టాఫ్ నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. వాటిని తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ భర్తీ చేయనుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే గడువు బుధవారమే ముగియగా, తాజాగా దానిని 21వ తేదీ వరకు పొడిగించారు. ఇప్పటివరకు ఏకంగా 40 వేల దరఖాస్తులు రాగా, గడువు పొడిగింపుతో మరో 15 వేల మంది దరఖాస్తు చేసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. వెయిటేజీకి సంబంధించి అనుభవ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం, ఇతరత్రా కారణాలతో అనేకమంది దరఖాస్తు చేసుకోలేకపోవడంతో గడువు పొడిగించారు. ఒక్కో ఉద్యోగానికి 10 నుంచి 11 మంది పోటీ పడే అవకాశముందని అంచనా. ఈ పోస్టులకు పేస్కేల్ రూ.36,750-1,06,990 మధ్య ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక రాత పరీక్ష వివరాలను మెడికల్ బోర్డు ప్రకటించనుంది. ఏదైనా ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహించే అవకాశముంది. పరీక్షకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు మెడికల్ బోర్డు తెలిపింది.

అధికారుల అలసత్వం

రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారు అనుభవ ధ్రువీకరణ పత్రాలు పొందాలని బోర్డు సూచించింది. రాత పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి 6 నెలలకు 2.5, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. అయితే అనేకమంది అభ్యర్థులకు సంబంధిత ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు అనుభవ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో చుక్కలు చూపిస్తున్నారు. నాన్ క్రీమీ లేయర్ సర్టిఫికెట్ల జారీలో కూడా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీని కోసం ఎమ్మార్వో ఆఫీసుల్లోని కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిపెట్టి ధ్రువీకరణ పత్రాలు సులువుగా జారీచేసేలా ఆదేశాలు జారీచేయాలని నర్సింగ్ సంఘాల నాయకులు కోరుతున్నారు.

రైల్వే భద్రతపై లఘు చిత్రాలతో అవగాహన

- ప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన పెంపే లక్ష్యం
- ఉన్నతస్థాయి సమీక్షలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రైల్వేభద్రతపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. రైలు ప్రమాదాల నియంత్రణ, ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. గురువారం ఇక్కడ డీజీపీ అంజనీకుమార్ అధ్యక్షతన స్టేట్ లెవల్ సెక్యూరిటీ కమిటీ ఫర్ రైల్వేస్ (ఎస్‌ఎల్‌ఎస్‌సీఆర్) సమావేశం నిర్వహించారు. రైల్వే అడిషనల్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి, శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ రాజారామ్, ఇతర ఉన్నతాధికారులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవీ..

- రైల్వే ట్రాక్‌లపై మరణాలు, రైళ్లలో మానవ అక్రమ రవాణా, రైళ్లలో చోరీల కట్టడి, కదులుతున్న రైళ్లపై రాళ్ల దాడుల నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు
- రైల్వే ట్రాక్‌ల సమీపంలో నివాసం ఉండే ప్రజలకు రైల్వే ట్రాక్‌లపై పాటించాల్సిన జాగ్రత్తలు, ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లు, రైళ్లలో మొబైల్ చోరీలు వంటి అంశాల్లో జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా లఘు చిత్రాల నిర్మాణం
- రైళ్లో మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేలా మత్తు పదార్థాల రవాణా ముఠాలపై చట్టపరమైన చర్యలు, రైలు టికెట్ బుకింగ్‌లో అక్రమాల కట్టడికి చర్యలు
- రైల్వే ట్రాక్‌లు, ప్లాట్‌ఫాంలపై ప్రమాదాలతోపాటు మృతుల గణాంకాలు వెల్లడిస్తూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా హెచ్చరించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకోండి

ఎస్పీలు, కమిషనర్లకు డీజీపీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: పోలీసు ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలని, అలాగే స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని కమిషనర్లు, ఎస్పీలను డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. ఎస్సై, కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ పూర్తికావస్తుండటంతో వారికి శిక్షణ, శిక్షణ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బడ్జెట్, శాంతిభద్రతల పరిస్థితులు.. తదితర అంశాలపై డీజీపీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన పోలీసు కమిషనర్లు, ఎస్పీలకు పలు కీలక సూచనలు ఇచ్చారు. పోలీసు శాఖ బలోపేతానికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతోపాటు భారీ సంఖ్యలో సిబ్బంది నియామకాలకు అనుమతించారని తెలిపారు. ఎస్సై, కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ పోలీస్ శిక్షణ కళాశాల, కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీటి సరఫరా, సరిపడా టాయిలెట్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

హెచ్‌ఎంలతోనే సమస్య

వాళ్లు ఒప్పుకుంటేనే పదోన్నతులు, బదిలీలు

- ఎన్నికలొస్తే మళ్లీ బ్రేక్ పడుతుందనే ఆందోళనలో టీచర్లు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒప్పుకుంటేనే బదిలీల ప్రక్రియ ముందుకు తీసుకెళ్లొచ్చని విద్యాశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వారిని పరిగణనలోనికి తీసుకోని పక్షంలో కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇదే అంశాన్ని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి వివరించినట్టు తెలిసింది. ఇటీవల హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిన విషయం తెలిసిందే. దీంతో పదోన్నతులైనా కల్పించాలని కొన్ని సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యాశాఖ నుంచి నివేదిక కోరినట్టు సమాచారం. ఇప్పటివరకూ అన్ని కేటగిరీల టీచర్లకు సీనియారిటీని బట్టి పదోన్నతులు ఇవ్వాలని భావించారు. ఇందుకు అనుగుణంగానే సీనియారిటీ జాబితాను రూపొందించారు. అయితే, హెచ్‌ఎంల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. వీరికి ఎంఈవోలుగా పదోన్నతి కల్పించాల్సి ఉంటుంది. అదీగాక, ఎంఈవో, డిప్యూటీ డీఈవో వంటి పర్యవేక్షణ పోస్టుల విషయంలో ఉపాధ్యాయుల మధ్య వివాదం పరిష్కారం కాలేదు. నిబంధనల ప్రకారం పర్యవేక్షణ పోస్టులు తమకే ఇవ్వాలని ప్రభుత్వ హెచ్‌ఎంలు కోరుతున్నారు. స్థానిక సంస్థల పరిధిలోని బడుల్లో ఉన్న హెచ్‌ఎంలకు పర్యవేక్షణ పోస్టులు ఇవ్వాల్సిందేనని మరికొంత మంది కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో హెచ్‌ఎంల పదోన్నతుల ప్రక్రియ జటిలంగానే మారింది. ప్రస్తుతం పదోన్నతులు కల్పిస్తే స్కూల్ అసిస్టెంట్లు.. హెచ్‌ఎంలు అవుతారు. వారికి ఉన్న స్కూళ్లను కేటాయించి, ఇప్పుడున్న హెచ్‌ఎంలను ఎంఈవోలుగా ప్రమోట్ చేయకుండా, ఎక్కడికి పంపుతారనే ప్రశ్న తెరమీదకొచ్చింది. కాబట్టి ఈ విషయంలో అంగీకారం వస్తేనే బదిలీలు, పదోన్నతుల అంశం ముందుకెళ్తుందని అధికారులు అంటున్నారు. ఏప్రిల్‌లో బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కొన్ని సంఘాలు చెబుతున్నా, ముందస్తు ఎన్నికల భయం వారిని వెంటాడుతోంది. సెలవుల్లో టెన్త్ పేపర్ల మూల్యాంకన విధులుంటాయి. ఆ తర్వాత ఎన్నికల గంట మోగితే బదిలీలు, ప్రమోషన్లు లేనట్టేనని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. బదిలీలు, పదోన్నతులు రెండూ ఒకేసారి చేపట్టాలని, లేని పక్షంలో తమకు న్యాయం జరగదని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి రాజాభాను చంద్రప్రకాశ్ చెప్పారు.

ఉద్యోగ సంఘాలు పట్టించుకోవడం లేదు

- రివర్షన్లు పొందిన విద్యుత్ ఉద్యోగుల అసంతృప్తి
- ఓ హోటల్‌లో సమావేశమైన బాధిత ఉద్యోగులు
- పదోన్నతుల కోసం ఉద్యమించాలని డిమాండ్



సమావేశంలో రివర్షన్ పొందిన విద్యుత్ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: తమ గోడును తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సంఘాలు పట్టించుకోవడం లేదని, ఇక తమ హక్కుల కోసం తామే పోరాడాలని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల్లో రివర్షన్లు పొందిన ఇంజనీర్లు, ఉద్యోగులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం విద్యుత్‌సౌధ పక్కనే ఉన్న ఓ ప్రైవేటు హోటల్లో దాదాపు 50 మంది బాధిత ఉద్యోగులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏపీ నుంచి వచ్చిన ఉద్యోగులను చేర్చుకోవాల్సి రావడంతో 155 మంది తెలంగాణ ఉద్యోగులకు జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు గత నవంబర్‌లో రివర్షన్లు ఇచ్చాయి. అంటే, తెలంగాణ వచ్చాక 2015లో పొందిన పదోన్నతులను కోల్పోయి పాత హోదాలను మళ్లీ ఈ ఉద్యోగులు పొందారు. ఏడేళ్ల ఉన్నత స్థాయి పోస్టుల్లో పనిచేసి మళ్లీ కింది స్థాయి పోస్టుకు మారడంతో అవమానకరంగా ఉందని ఈ సమావేశంలో బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రివర్షన్లను ఆపడంలో గతంలో విఫలమైన విద్యుత్ ఉద్యోగ సంఘాలు మళ్లీ వాటి గురించి పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యాలపై ఒత్తిడి పెంచి మళ్లీ రద్దయిన పదోన్నతులు ఇప్పించేందుకు పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఉద్యోగ సంఘాల నేతలకు డిమాండ్ చేశారు. సీఈలు రవికుమార్, సురేష్, ఎస్‌ఈ రామకోటి, డీఈలు బాలాజీ, రమేశ్‌బాబుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.

మూల్యాంకన టెండర్ల ప్రక్రియ మార్చి 4కు పూర్తి

జీఎస్టీ, విద్యాసెస్ రాయితీకి ఇంటర్ బోర్డు ఓకే

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షల సమాధాన పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకన కాంట్రాక్టును వచ్చే నెల 4వ తేదీకల్లా ముగించాలని ఇంటర్ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈసారి వీలైనంత ఎక్కువ మంది బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు అనువుగా కొన్ని నిబంధనల్లో మార్పు చేస్తున్నారు. జీఎస్టీ, విద్యాసెస్ నుంచి రాయితీ కల్పించడం ఇందులో ప్రధానాంశాలుగా తెలుస్తోంది. ఇటీవల పిలిచిన టెండర్లలో కేవలం ఒకే ఒక సంస్థ పాల్గొనడంతో టెండర్‌ను రద్దు చేశారు. ఇతర కంపెనీలు ఎందుకు పాల్గొనలేదనే అంశంపై అధికారులు ఆరా తీశారు. దీంతో కొన్ని సవరణలు చేయాలని కంపెనీలు కోరినట్టు తెలిసింది. ఇంటర్ బోర్డులో వచ్చే మూడేళ్లలో వందశాతం ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 35 లక్షల పేపర్లకు ఆన్‌లైన్ మూల్యాంకనం చేయనున్నారు. కాంట్రాక్టు దక్కించుకునే సంస్థలు వార్షిక సాధారణ పరీక్షలతో పాటు, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి కూడా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను అందించాల్సి ఉంటుంది. అధ్యాపకులు మూల్యాంకన కేంద్రాలకు రాకుండానే, తమకు వీలైన చోటు నుంచి విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకన చేయాల్సి ఉంటుంది. పూర్తి భద్రతతో కూడిన సాఫ్ట్‌వేర్‌ను కాంట్రాక్టు సంస్థ అందిస్తుంది. అధ్యాపకులు వేసే మార్కులు ఆన్‌లైన్‌లోనే క్రోడీకరణ చేయడమే కాకుండా, రీ వాల్యుయేషన్, రీ వెరిఫికేషన్ విధానానికి అనువైన రీతిలో ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఈ మొత్తం విధానం బోర్డులోని అతి ముఖ్యమైన వ్యక్తుల నేతృత్వంలో ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇది ఎటువంటి అక్రమాలకు తావివ్వని పారదర్శక విధానమని.. బోర్డు పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన తర్వాత ఓ నిర్ధారణకు వచ్చింది.

కర్ణాటకలో ఘోర రోడ్డుప్రమాదం

నలుగురి మృతి.. మృతులంతా హైదరాబాద్ వాసులే



కొప్పళ జిల్లా ఆస్పత్రి మార్చురీలో మృతదేహాలు

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వంతెనను కారు ఢీకొని నలుగురు హైదరాబాద్ వాసులు దుర్మరణం చెందారు. కొప్పళ జిల్లా కుకనూరు తాలూకాలో జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. మృతులను హైదరాబాద్‌కు చెందిన షణ్ముఖ(28), రూపవతి(26), వెన్నెల(25)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన మరో వ్యక్తి పేరు తెలియరాలేదు. వీరు హైదరాబాద్ నుంచి గోవా వైపు కారులో వస్తుండగా బన్నికొప్ప వద్ద ముందు టైర్ ఊడిపోయి అదుపు తప్పి వంతెనను ఢీకొని బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుకనూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేటగాళ్ల ఉచ్చుకు పులి బలి?

- భూపాలపల్లి అడవుల్లో గుట్టుచప్పుడు కాకుండా దహనం
- విషయం బయటకు రావడంతో అటవీ అధికారుల దాడులు
- ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు తరలింపు

భూపాలపల్లి: వేటగాళ్లు దుప్పుల కోసం అమర్చిన ఉచ్చుకు భూపాలపల్లి అడవుల్లో తిరుగుతున్న పులితో పాటు అడవి పంది బలి అయినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. భూపాలపల్లి రేంజ్.. రాంపూర్ సెక్షన్. రాజీవ్‌నగర్ నుంచి పంబాపూర్ వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చులను అమర్చారు. ఆ ఉచ్చులకు మూడు అడవి పందులు, ఒక పులి పడ్డాయి. పులి, ఒక అడవి పందికి ఉచ్చు మెడకు పడగా అక్కడికక్కడే మృతి చెందాయి.. వేటగాళ్లు ఉదయాన్నే వచ్చి చనిపోయిన పులిని చూసి భయపడి.. అటవీ శాఖ అధికారులు కేసులు పెడితే ఇరుక్కుంటామని భావించి వెంటనే ఆ కళేబరాన్ని, చనిపోయిన పందిని దహనం చేసేశారు. బతికున్న పందులను దూర ప్రాంతంలో వదిలేశారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఇద్దరు నిందితులను పట్టుకొని గురువారం కోర్టులో హాజరుపరచగా.. జిల్లా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా పరకాల సబ్ జైలుకు తరలించారు. దీనిపై భూపాలపల్లి అటవీ రేంజ్ ఆఫీసర్ నరేష్‌ను సంప్రదించగా.. కాలిపోయి ఉన్న ఒక అటవీ జంతువు ఎముకలు, పూర్తిగా కాలని ఒక కాలును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే అవి పులివి కావన్నారు. చిరుత పులా.. లేక అడవి పిల్లినా.. అనేది తేలాల్సి ఉందన్నారు. నిర్ధారణ కోసం ఎముకలు, కాలును సెంట్రల్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయోలజీకి పంపించామని తెలిపారు. కాగా.. వేటగాళ్ల ఉచ్చుకు బలి అయింది పులేనని, అటవీ శాఖ అధికారులు తాము ఇబ్బందుల్లో పడకుండా ఉండేందుకే ఇటీవల వేటాడిన ఒక జంతువు కళేబరాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి.. తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాత్రికేయుల ఇళ్ల స్థలాల కోసం ఐదెకరాలు

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల కోసం ఖమ్మం అర్బన్ మండలం వి.వెంకటపాలెం గ్రామంలో నీటిపారుదల శాఖకు చెందిన ఐదెకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 21వ ప్రధాన బ్రాంచ్ కాలువకు ఎడమ గట్టులో ఉన్న సర్వే నంబర్లు 270/2/పీ, 271/2/పీ, 272/2/పీ, 273/2/పీ, 288/2/పీ, 289/2/పీలోని ఈ భూములను.. భూ కేటాయింపుల విధాన మార్గదర్శకాలకు లోబడి పాత్రికేయుల ఇళ్ల స్థలాలకు కేటాయించడానికి జిల్లా కలెక్టర్‌కు అనుమతి ఇచ్చారు. సమాన విస్తీర్ణంలో ప్రభుత్వ భూమిని సత్వరంగా నీటి పారుదల శాఖకు బదిలీ చేయాలని లేఖలో ఆదేశించారు.

క్లుప్తంగా...

ఆవాలతో కేసీఆర్ చిత్రం



గజ్వేల్ రూరల్: రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు.. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆవాలతో ఆయన రూపాన్ని చిత్రించారు. పట్టణంలోని ప్రగతి సెంట్రల్ స్కూల్‌లో 25 కిలోల ఆవాలతో 18 అడుగుల కేసీఆర్ రూపాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా గురువారం రామకోటి రామరాజు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో బియ్యం, సబ్బు బిళ్లపై కూడా చిత్రించినట్లు తెలిపారు.

బ్రెయిలీ లిపిలో కేసీఆర్ జీవిత చరిత్ర భేష్



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎవరి జీవిత చరిత్ర కూడా బ్రెయిలీ లిపిలో లేదని.. తొలిసారిగా సీఎం కేసీఆర్ సంక్షిప్త జీవిత చరిత్రను ప్రత్యేకంగా అంధుల కోసం రూపొందించడం అద్భుతమని మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా.. కేసీఆర్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని గురువారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. బ్రెయిలీ లిపిలో పుస్తకాన్ని రూపొందించిన రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవ రెడ్డిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సీఎం పుట్టినరోజు జరపండి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పండ్లను పంపిణీ చేయాలని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస రావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన అన్ని జిల్లాల వైద్యాధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రుల చుట్టుపక్కల, ఆవరణలో మొక్కలను నాటాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, నర్సులు, వైద్యులు ముఖ్యమంత్రి పుట్టిన రోజు వేడుకలు జరపాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డాక్టర్ శ్రీనివాస రావు కూడా సీఎం పుట్టిన రోజును ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలతో నష్టం లేదు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎంపీ కోమటిరెడ్డి ఒకటి మాట్లాడితే మరో విధంగా మీడియాలో వచ్చిందని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి అన్నారు. కోమటిరెడ్డి పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడలేదని స్పష్టం చేశారు. జగ్గారెడ్డి గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, రానున్న ఎన్నికల సన్నద్ధతలపై చర్చించారు. అనంతరం జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాను కూడా త్వరలో నే పాదయాత్ర మ్యాప్‌ను ప్రకటిస్తానని చెప్పారు.

చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం



సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఆ మున్సిపాలిటీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా, బీజేపీకి చెందిన 8 మంది, బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు, సీపీఎంకు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు భువనగిరిలోని కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ రాజు విధానాలు నచ్చడం లేదని, మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందని వారు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ రాజు రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ల చాంబర్ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతుండటం గమనార్హం. అవిశ్వాసం ప్రకటించినవారిలో సొంత పార్టీ కౌన్సిలర్లు కూడా ఉండటం చర్చనీయాంశమైంది.


ఫోర్టిఫైడ్ రైస్.. బియ్యానికి బలం

రక్తహీనతకు చెక్‌పెడుతుంది...

- నిర్ణీత మోతాదులో పోషక పదార్థాలు జతచేసి తయారీ
- గతేడాది నుంచే ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ మొదలుపెట్టిన కేంద్రం
- రాష్ట్రంలో ఇప్పటికే 4 జిల్లాల్లో అమలు.. ఏప్రిల్ నుంచి మిగతా జిల్లాల్లో
- క్వింటాలు బియ్యానికి కిలో ఎఫ్ఆర్‌కే కలిపితే వచ్చేదే బలవర్థక బియ్యం
- అమెరికా సహా 30 దేశాల్లో బలవర్థక బియ్యమే వినియోగం

సాక్షి, హైదరాబాద్

దేశ ప్రజల్లో రక్తహీనత సమస్య చాపకింద నీరులా విస్తరిస్తోంది. అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులతోపాటు మైదాన ప్రాంతాల్లోని పేదలు, పాఠశాల విద్యార్థుల్లో ఈ సమస్య అధికంగా ఉంటోంది. పోషకాహార లోపం వల్ల సంభవించే రక్తహీనత సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బలవర్థక బియ్యాన్ని (ఫోర్టిఫైడ్ రైస్) ప్రజలకు అందించాలని నిర్ణయించింది. ఐసీడీఎస్, పీఎం పోషణ్ పథకాలతోపాటు దేశంలోని 151 జిల్లాల్లో గతేడాది ఏప్రిల్ నుంచే ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ అందిస్తోంది. అందులో తెలంగాణలోని ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకాలతోపాటు ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రేషన్ షాపులు కూడా ఉన్నాయి. ఏప్రిల్ నుంచి రాష్ట్రంలోని మిగతా 27 జిల్లాల్లోనూ పీడీఎస్ ద్వారా ఫోర్టిఫైడ్ రైస్‌నే ఇవ్వాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను సాధారణ బియ్యంలో కలపడం వల్ల వచ్చేవే బలవర్థక బియ్యం. అసలు దీన్ని ఎలా తయారుచేస్తారు..



ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ తయారీ ఇలా...

→ 98 శాతం బియ్యపు పిండికి 2 శాతం ఖనిజాలను కలిపి హాట్ ఎక్స్‌ట్రూషన్ టెక్నాలజీ ద్వారా 90 డిగ్రీలకన్నా తక్కువ వేడిలో జెలటనైజేషన్ (జెల్‌గా తయారు) చేసి దాన్ని బియ్యం ఆకారంలోకి మారిస్తే వచ్చేవే ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్. 10 గ్రాముల ఎఫ్ఆర్‌కే కోసం 28 మిల్లీగ్రాముల నుంచి 48 మిల్లీగ్రాముల ఐరన్75 మైక్రో గ్రాముల నుంచి 125 మైక్రో గ్రాముల ఫోలిక్ యాసిడ్ (బీ–9 విటమిన్), 0.75 మైక్రో గ్రాముల నుంచి 1.25 మైక్రో గ్రాముల బీ–12 విటమిన్ (కొబాలమైన్)ను కలుపుతారు. ఈ నిష్పత్తిలో కలిపే ఖనిజాలు, విటమిన్లతో కుర్‌కురే వంటి తినుబండారాలు తయారు చేసే తరహాలో ప్రత్యేక యంత్రాల ద్వారా బియ్యం అచ్చుల్లో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ తయారు చేస్తారు.

బలవర్థక బియ్యం కలిపే తీరిదీ...



→ సాధారణ బియ్యానికి 1:100 నిష్పత్తిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను మిల్లుల్లో కలుపుతారు. అంటే క్వింటాలు బియ్యానికి కిలో ఎఫ్ఆర్‌కే కలుపుతారన్నమాట. సాధారణ బియ్యం తరహాలోనే ఉండే ఈ ఎఫ్ఆర్‌కే బియ్యంలో కలిసిపోతాయి.

వండిన అన్నం తరహాలోనే...

→ ఎఫ్ఆర్‌కేతో కూడిన బియ్యాన్ని వండినప్పుడు వాటి పోషకాలు ఆవిరవ్వడం, అన్నం వార్చినప్పుడు గంజితో కలిసి బయటకు పోవడం జరగదని పౌరసరఫరాల సంస్థకు ఫోర్టిఫైడ్ రైస్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న బాలగంగాధర్ తిలక్ చెబుతున్నారు. ఒకవేళ పోషకాలు పోయినా 10 శాతం లోపేనని, మిగతా 90 శాతం అన్నంతోపాటే ఉంటాయని ఆయన 'సాక్షి'కి చెప్పారు. ఈ నేపథ్యంలో బియ్యాన్ని ప్రెషర్ కుక్కర్‌లో వండాలని కేంద్రం సూచిస్తోందన్నారు.

రాష్ట్రంలో 7 యూనిట్లు...

→ ఎఫ్ఆర్‌కే తయారు చేసే యూనిట్లు ఎక్కువగా పంజాబ్, హరియాణా, రాజస్తాన్‌లలో ఉన్నాయి. తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, ములుగు, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎఫ్ఆర్‌కే యూనిట్లు ఉన్నాయి.

మనకు కొత్తేం కాదు...

→ మనం నిత్యం ఆహారంలో వినియోగించే పలు పదార్థాలు ఫోర్టిఫైడ్ విధానంలో రూపొందినవే. నిత్యం వాడే ప్యాకెట్ పాలతోపాటు అయోడిన్‌గల ఉప్పు, గోధుమపిండి, వంట నూనె ఫోర్టిఫైడ్ విధానంలో ఖనిజాలు, విటమిన్లను కలిపి తయారు చేస్తారు. ఈ నాలుగింటితోపాటు ఇప్పుడు దేశంలో వినియోగించే బియ్యం కూడా ఫోర్టిఫైడ్ విధానంలోనే తయారు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

30 దేశాల్లో...

→ మన దేశంలో గతేడాది నుంచి ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియోగంలోకి తెచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ఇప్పటికే ఈ రకమైన బియ్యాన్ని వాడుతున్నారు. అమెరికాలో 2019లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియోగించినట్లు తెలుస్తోంది. కోస్టారికా, నికరగ్వా, పనామా, పాపువా న్యూగినియా, సోలొమన్ దీవులు, ఫిలిప్పీన్స్‌లలో బలవర్థక బియ్యం వాడకం తప్పనిసరి. అలాగే మరికొన్ని ఆఫ్రికా దేశాలతోపాటు కిర్గిస్తాన్, లావోస్, నేపాల్‌లలోనూ ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియోగిస్తున్నారు.



సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, హీరో నాని, క్రికెటర్ అంబటి రాయుడు

కేసీఆర్ కారణజన్ముడు

ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: కే.. అంటే కారణజన్ముడు.. సీ.. అంటే చిరస్మరణీయుడు.. ఆర్.. అంటే మన తలరాతలను మార్చిన మహనీయుడు కేసీఆర్ అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అభివర్ణించారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు శుక్రవారం. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సిద్దిపేట జయశంకర్ క్రికెట్ స్టేడియంలో కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–3ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'దసరా'సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హీరో నాని మాట్లాడుతూ 373 టీమ్‌లతో ప్రపంచంలో ఎక్కడ కూడా క్రికెట్ టోర్నమెంట్ జరగలేదన్నారు. ఇంత పెద్ద టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌ను అభినందించారు. క్రికెటర్ అంబటి రాయుడు మాట్లాడుతూ తాను కేసీఆర్ అభిమానినన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధిలో 'గ్రీన్ ఇండియా'

- వెయ్యి ఎకరాల అభయారణ్యాన్ని దత్తత తీసుకోనున్న ఎంపీ సంతోష్‌కుమార్
- కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయాన్ని దేశంలోనే ప్రముఖ దేవాలయంగా పునర్ నిర్మించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయానికి మద్దతుగా ఈ ఆలయాన్ని ఆనుకుని ఉన్న వెయ్యి ఎకరాల అభయారణ్యాన్ని దత్తత తీసుకోవాలని ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ నిర్ణయించారు. ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ తరఫున గురువారం తన నిర్ణయాన్ని ఎంపీ ప్రకటించారు. స్వరాష్ట్రం సిద్ధించాక గత ఎనిమిదేళ్లుగా తెలంగాణను అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని, ఆయన తపనను దగ్గరి నుంచి చూసిన వ్యక్తిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అన్ని రంగాల్లో అభివృద్ధితో పాటు హరిత, ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లే తెలంగాణను సీఎం కాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.

కొడిమ్యాల అభివృద్ధి ఇలా...

కొడిమ్యాల రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వచ్చే కంపార్ట్‌మెంట్ 684లో 752 ఎకరాలు, 685లో 342 ఎకరాలు మొత్తం 1,094 ఎకరాల అటవీ భూమిని దత్తత తీసుకుంటారు. మొదటి విడతగా రూ.కోటి వ్యయంతో ఈ వెయ్యి ఎకరాల అటవీ భూమికి మరింత పచ్చందాలు అద్దుతామని సంతోష్ ప్రకటించారు. దశలవారీగా మిగతా నిధులు కూడా అందించి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కొండగట్టు ఆలయంలో ఈ అడవిలో లభించే సుగంధ మొక్కలు, చందనం చెట్ల నుంచే పూజలు జరిగేవని ప్రతీతి. మళ్లీ ఆ వైభవం కోసం ఈ అటవీ ప్రాంతంలో పెద్దఎత్తున ఔషధ, సుగంధ మొక్కలు నాటుతామన్నారు. అటవీశాఖ అధ్వర్యంలో అటవీ భూమి సరిహద్దుకు రక్షణ, అడవి లోపల పునరుజ్జీవన చర్యలు చేపడతామన్నారు. ఆలయ పరిసరాల్లో సంచరించే కోతులను అటవీ ప్రాంతానికి పరిమితం చేసేలా పెద్దఎత్తున పండ్ల మొక్కలు నాటి మంకీ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రేపటి ప్రభుత్వానికి పాలేరు సింహద్వారం

- పార్టీ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవంలో వైఎస్ విజయమ్మ
- వైఎస్ ఆశయాల సాధనకోసం షర్మిలమ్మ ప్రయత్నిస్తోంది
- పాలేరు నుంచి షర్మిల పోటీ దైవేచ్ఛ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'షర్మిలమ్మ అడ్రస్ ఈరోజు పాలేరు అయింది. తెలంగాణకు ప్రధాన గుమ్మం ఖమ్మం అయితే.. రేపటి ప్రభుత్వానికి పాలేరు సింహద్వారం అవుతుంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా.. బాధ వచ్చినా చెప్పుకునే అడ్రస్ అవుతుంది ఈ కార్యాలయం'అని వైఎస్ విజయమ్మ అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం సాయిగణేశ్‌నగర్‌లో పాలేరు నియోజకవర్గ వైఎస్సార్ తెలంగాణ పార్టీ క్యాంపు కార్యాలయాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 'నేను మీ బిడ్డను, మీతో ఉంటాను అని.. పాలేరు ప్రజలకు ఇక్కడి మట్టి సాక్షిగా ప్రమాణం చేసిన షర్మిలమ్మను ఆశీర్వదించాలి'అని కోరారు. షర్మిల తెలంగాణ బిడ్డ కాదనే వారికి ఆమె ప్రేమ.. తెలంగాణలో షర్మిలమ్మ ఉనికి పోయిందనే వారికి ఆమె మానవత్వమే జవాబు చెబుతుందని పేర్కొన్నారు.

వైఎస్‌ది జగమంత కుటుంబం

పాలేరు నియోజకవర్గం వేదికగా నిర్మిస్తున్న పార్టీ కొత్త కార్యాలయం వైఎస్ రాజశేఖరరెడ్డి జన్మదినమైన జూలై 8న ప్రారంభించనున్నట్లు విజయమ్మ తెలిపారు. వైఎస్ తన కుటుంబాన్ని ప్రేమించిన దానికంటే ఎక్కువగా ప్రజలను ప్రేమించారని ఆమె చెప్పారు. ఆయనది జగమంత కుటుంబమని, రాజశేఖరరెడ్డి కుటుంబం అంటేనే ప్రజల కుటుంబమని చెప్పారు. రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం షర్మిల ప్రయత్నం చేస్తోందని అన్నారు. షర్మిలమ్మ పాలేరులో పోటీకి నిర్ణయించుకోవడం యాదృచ్ఛికం కాదని, అది దైవేచ్ఛగా భావిస్తున్నామని తెలిపారు. తమకు పులివెందుల ఎలాగో.. షర్మిలకు పాలేరు కూడా అలాగేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు, రాష్ట్ర కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయమ్మ

'దయాకర్‌రావు ఎంతకు అమ్ముడుపోయారు'

సాక్షి, మహబూబాబాద్: 'మంత్రి దయాకర్‌రావు టీడీపీలో ఉన్నప్పుడు.. కేసీఆర్ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొన్నారు అని మాట్లాడారు.. ఇప్పుడు ఆయన కేసీఆర్‌కు ఎంతకు అమ్ముడుపోయి ఆయన పార్టీలో చేరారు'అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. గురువారం ఆమె మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురంలో పాదయాత్ర కొనసాగించారు. 3,800 కిలోమీటర్ల మైలురాయి పూర్తి చేసుకుని నాంచారి మడూరు మీదుగా తొర్రూరు చేరుకున్నారు. సాయంత్రం తొర్రూరు బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఐదో తరగతి చదివిన దయాకర్‌రావు మంత్రి అయ్యారని, పీజీలు, పీహెచ్‌డీలు చేసిన బిడ్డలు నిరుద్యోగులుగా మిగిలి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీపరుడినని చెప్పే మంత్రి 680 ఎకరాల భూమిని ఎలా సంపాదించారని ప్రశ్నించారు.



షర్మిలకు గజమాల వేస్తున్న అభిమానులు

ఎంపీ కోమటిరెడ్డిపై చెప్పుల దాడి

నల్లగొండ జిల్లా ఇటుకుల పహాడ్‌లో ఘటన

శాలిగౌరారం: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చెప్పులు విసిరారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఇటుకలపహాడ్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమం అనంతరం వెంకటరెడ్డి దేవాలయ ప్రాంగణంలో భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఆ గ్రామరోడ్డు దుస్థితిని ప్రస్తావిస్తూ పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి రూ.5 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. రూ.వెయ్యికోట్లతో ప్రగతిభవన్ కట్టుకోవడానికి నిధులు ఉంటాయి, కానీ గ్రామాల రోడ్లకు నిధులు లేవా అని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వచ్చి, దేవాలయంలో నిలబడి రాజకీయాలు మాట్లాడుతున్నారంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఓ నాయకుడు అక్కడే ఉన్న కుర్చీని విసిరేందుకు ప్రయత్నించగా మరోనేత దానిని వెనక్కిలాక్కున్నారు. అప్పటికే దేవాలయం ప్రాంగణం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. ఇరుపార్టీ కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో తోపులాట జరిగింది. పరిస్థితిని గమనించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దేవాలయం నుంచి కారు వద్దకు వెళ్తుండగా ఆయనపై బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పులు విసిరారు. ఆ చెప్పులు ఎంపీ కోమటిరెడ్డికి కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తగిలాయి. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో ఇద్దరు పోలీసులు మాత్రమే అక్కడ బందోబస్తుగా ఉండటంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం కష్టతరంగా మారింది. ఎంపీ కోమటిరెడ్డి వెళ్ళిపోయిన తర్వాత కూడా గంటకు పైగా గ్రామంలో ఉద్రిక్తవాతావరణం నెలకొంది.




కోమటిరెడ్డి వైపు విసిరిన చెప్పు

శ్రీశైలం జలాశయం ఖాళీ!

కనీస నీటిమట్టానికి దిగువన నిల్వలు

- ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు
- ఇప్పుడు మిగిలింది 51 టీఎంసీల నిల్వలే 830 అడుగులకు పడిపోయిన నీటి మట్టం
- ఏపీ, తెలంగాణతో తక్షణమే విద్యుదుత్పత్తిని నిలుపుదల చేయించండి
- కృష్ణా బోర్డుకు తెలంగాణ నీటిపారుదల శాఖ లేఖ
- నిల్వ జలాల పంపిణీపై నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో నిల్వలు అడుగంటిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పోటాపోటీగా సాగునీరు, విద్యుదుత్పత్తి అవసరాలకు జలాశయం నుంచి నీళ్లను తరలించడంతో జలాశయంలో నిల్వలు కనీస నీటి మట్టానికి దిగువన పడిపోయాయి. శ్రీశైలం జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, గురువారం నాటికి కేవలం 51.92 టీఎంసీల నిల్వలు మాత్రమే మిగిలాయి. జలాశయం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా.. సాగునీటి అవసరాలకు 854 అడుగులు, విద్యుదుత్పత్తి అవసరాలకు 834 అడుగుల కనీస నీటి మట్టం(ఎండీడీఎల్) ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం నీటి మట్టం 830 అడుగులకు పడిపోయింది. సాగునీటి, తాగునీటి అవసరాల పరిరక్షణ కోసం తక్షణమే శ్రీశైలం జలాశయంలో విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసేలా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ రెడ్డి తాజాగా కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి లేఖ రాశారు.

నిల్వల్లో ఏపీకి మిగిలింది 13 టీఎంసీలే !

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ప్రస్తుత నీటి సంవత్సరంలో మొత్తం 932.07 టీఎంసీల జలాల లభ్యత ఉండగా, ఇప్పటికే 725.51 టీఎంసీలను రెండు రాష్ట్రాలు వాడుకున్నాయి. మొత్తం లభ్యత జలాల్లో తాత్కాలిక కేటాయింపుల నిష్పత్తి 66: 34 ప్రకారం ఏపీకి 615.17 టీఎంసీలు, తెలంగాణకు 316.90 టీఎంసీల వాటా ఉంది. ఇప్పటికే ఏపీ 542.45 టీఎంసీలను వాడుకోగా, ఆ రాష్ట్రం పరిధిలోని ఇతర జలాశయాల్లో నిల్వ ఉన్న 59.68 టీఎంసీల కృష్ణా జలాలను కలుపుకుని ఆ రాష్ట్రం మొత్తం 602.13 టీఎంసీలను వాడుకున్నట్టు అయింది. తెలంగాణ 183.05 టీఎంసీలను వాడుకోగా, ఇక్కడి ఇతర జలాశయాల్లోని 10.2 టీఎంసీల నిల్వలు కలిపి మొత్తం 193.26 టీఎంసీలను వాడుకున్నట్టు అయింది. ప్రస్తుతం శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో 136.67 టీఎంసీల నిల్వలు మిగిలి ఉండగా, అందులో ఏపీకి 13.03 టీఎంసీలు, తెలంగాణకు 123.63 టీఎంసీల కోటా ఉందని తెలంగాణ పేర్కొంటోంది.

కల్వకుర్తి ఎత్తిపోతలకు కష్టకాలమే !

శ్రీశైలం జలాశయంలో 800.52 అడుగుల కనీస నీటి మట్టం ఉంటేనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 2.38లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు తాగునీటి సరఫరాకు వీలు కానుంది. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా సాగునీటి అవసరాలకు 13.6 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 4.40 టీఎంసీలు కలిపి మొత్తం 18టీఎంసీలు అవసరం. ప్రస్తుతం జలాశయంలో 51టీఎంసీలే మిగిలి ఉండగా, రెండు రాష్ట్రాలు విద్యుదుత్పత్తి కొనసాగిస్తుండడంతో నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలను పరిరక్షించడానికి తక్షణమే రెండు రాష్ట్రాలతో జలవిద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేయించాలని కృష్ణా బోర్డుకు తెలంగాణ నీటిపారుదల శాఖ కోరింది. గతేడాది శ్రీశైలం జలాశయంలో నిల్వలు డెడ్‌స్టోరేజీకి పడిపోవడంతో మహబూబ్‌నగర్ జిల్లా వేసవి తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం జలాశయంలో రివర్స్ పంపింగ్ ద్వారా నీళ్లను ఎత్తిపోయాల్సి వచ్చింది.

నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న నిల్వలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా బోర్డు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సమావేశం కానుంది. ఈ కమిటీలో కృష్ణా బోర్డు కన్వీనర్‌తో పాటు ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్సీలు పాల్గొననున్నారు. రబీ ఆయకట్టుతో పాటు వేసవి తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకోనున్నారు.


థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో విషవాయువులకు చెక్!

రూ. 696 కోట్లతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను కాలుష్యరహిత కేంద్రంగా తీర్చిదిద్దడానికి సింగరేణి బొగ్గు గనుల సంస్థ సిద్ధమైంది. రూ. 696 కోట్ల వ్యయంతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) అనే అనుబంధ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి గాలిలోకి విడుదలయ్యే సల్ఫ్యూరిక్ ఆక్సైడ్ శాతం ప్రతి ఘనపు మీటర్‌కు 2000 మిల్లీగ్రాములులోపు ఉండాల్సి ఉండగా 200 మిల్లీగ్రాములకు తగ్గిస్తూ 2015లో కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఎఫ్‌జీడీల నిర్మాణం తప్పనిసరైంది. రాష్ట్రంలో నిర్మిస్తున్న తొలి ఎఫ్‌జీడీ ప్లాంట్ ఇదే. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో బొగ్గును మండించడం ద్వారా వెలువడే ఉష్ణోగ్రతతో నీటిని ఆవిరిగా మార్చి దానితో టర్బైన్లను తిప్పుతూ విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. బొగ్గును మండించడం ద్వారా బూడిద, విషవాయువులు విడుదలవుతాయి. బూడిదను శుద్ధి చేసేందుకు సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 'ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్'అనే అనుబంధ విభాగాన్ని వినియోగిస్తున్నారు. సల్ఫ్యూరిక్ ఆక్సైడ్ శుద్ధికి ఎఫ్‌జీడీ రానుంది.

20 శాతం పనులు పూర్తి...

సింగరేణిలో ఎఫ్‌జీడీ నిర్మాణ పనులను పీఈఎస్ ఇంజనీర్స్ సంస్థకు అప్పగించగా ఇప్పటికే 20% పనులను పూర్తి చేసింది. మొత్తం పనులను 2024 నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. ఎఫ్‌జీడీ నిర్మాణంపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు.



ఎఫ్‌జీడీ పనితీరు ఇలా...

బొగ్గు మండించినప్పుడు వెలువడే వాయువుల్లోంచి సల్ఫర్, అనుబంధ వాయువులను ఎఫ్‌జీడీ ప్లాంట్ వేరు చేస్తుంది. దీనికోసం 150 మీటర్ల ఎత్తయిన ఒక చిమ్నీని ఏర్పాటు చేస్తారు. ఈ చిమ్నీలో కింది నుంచి పైకి వచ్చే వాయువుపై క్యాల్షియం కార్బొనేట్ (తడి సున్నం)ను పైనుంచి బలంగా పంపిస్తారు. దీంతో వాయువుల్లోని సల్ఫర్ డై ఆక్సైడ్‌తో తడి సున్నం రసాయనిక చర్యకు లోనవుతుంది. సల్ఫర్, అనుబంధ వాయువులన్నీ తడి సున్నంలో కలుస్తాయి. ఫలితంగా బయటకు విడుదలయ్యే వాయువుల్లో సల్ఫర్ అనుబంధ వాయువుల శాతం ఘనపు మీటర్‌కు 200 మిల్లీగ్రాములకు తగ్గిపోతుంది. ఈ ప్రక్రియలో అంతిమంగా ఏర్పడే క్యాల్షియం సల్ఫేట్ (జిప్సం) అనే ఘన పదార్థాన్ని ఎరువులు, సిమెంట్, పేపర్, వస్త్ర పరిశ్రమ, నిర్మాణ రంగానికి సరఫరా చేయనున్నారు. జిప్సం అమ్మకాలతో థర్మల్ ప్లాంట్ నిర్వహణ ఖర్చులు తగ్గనున్నాయి.

క్లుప్తంగా...

తల్వార్‌తో కేక్ కట్‌చేసిన మంత్రి



నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బర్త్‌డే వేడుకలకు ఓ నేత తల్వార్‌తో వచ్చారు. మంత్రికి తల్వార్‌ను ఇచ్చి కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి తల్వార్‌తో కేక్ కట్‌చేసి నేతలకు తినిపించారు. ఈ వేడుకలకు నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, నిజామాబాద్ మున్సిపల్ మేయర్, వారి అనుచరులు వచ్చారు. తల్వార్ పోలీసుల అనుమతితోనే క్యాంపు కార్యాలయంలోకి వచ్చిందా లేక పోలీసుల కళ్లుగప్పి తెచ్చారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

పోలీసు నియామకాల్లో గర్భిణులపై వివక్ష

సాక్షి, హైదరాబాద్: పోలీసు నియామక పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల్లో.. గర్భిణులు నేరుగా మెయిన్స్ రాసే అవకాశం కల్పించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ డిమాండ్ చేశారు. ఎంపికైన గర్భిణులకు తరువాత ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని.. లేనిపక్షంలో యువమోర్చా ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏడు మార్కులతో అర్హత సాధించిన అభ్యర్థుల్లో గర్భిణులు తప్పనిసరిగా ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో పాల్గొనాలని అధికారులు ఆదేశించడం సిగ్గుచేటని విమర్శించారు. ఉత్తీర్ణత సాధించిన గర్భిణులు నేరుగా మెయిన్స్ పరీక్షల్లో పాల్గొనవచ్చని, అక్కడ ఎంపికైన వారికి తర్వాత ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తామని అధికారికంగా ప్రకటించడాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ విషయాన్ని మరిచిపోయి.. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో గర్భిణులు పాల్గొనమని ఎలా కోరుతారని ప్రశ్నించారు.

ఓర్వలేని బీఆర్‌ఎస్, ఎంఐఎం నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్, ఎంఐఎం శ్రేణులు పలుచోట్ల దాడులకు పాల్పడుతున్నాయని బీజేపీ ఉపాధ్యక్షుడు, ఈ–మీటింగ్స్ సమన్వయకర్త డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న బాన్సువాడ నియోజకవర్గం చందూర్ మండల్ లక్ష్మాపూర్, దుర్కి గ్రామాల్లో ఆయన అనుచరులు ఈ సమావేశాలను అడ్డుకున్నారని ఆరోపించారు. పాత బస్తీలో ఈ కార్యక్రమానికి ఎంఐఎం నేతలు అడ్డు తగలడమే కాకుండా స్థానిక బీజేపీ నాయకులు, మహిళలపై దాడికి ప్రయత్నించారని ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం అనుచరులు, ఎంఐఎం నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేక తిట్లు

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీని, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాజకీయంగా ఎదుర్కోవడం చేతగాని సీఎం కేసీఆర్.. తన ఫామ్ హౌస్ బానిసలతో తిట్టిస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా మండిపడ్డారు. వివిధ అంశాలపై సంజయ్ చేసిన ఆరోపణలకు తమ పార్టీ కట్టుబడి ఉందని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు దమ్ముంటే కేసీఆర్ బంధువులకు కొండగట్టు చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం లేదని ప్రకటించే ధైర్యముందా? అని ప్రశ్నించారు. సచివాలయం తెలంగాణ ప్రతీకగా ఉండాలి తప్ప.. ఓట్ల కోసం ఒక మతానికి సంబంధించిన గుమ్మటాలు నిర్మించడాన్ని బీజేపీ తప్పు పడుతోందని పేర్కొన్నారు.

గూండాయిజం చేస్తే మసైపోతారు

ఎమ్మెల్యే ఈటల హెచ్చరిక

కమలాపూర్: 'అధికారం శాశ్వతం కాదు.. అనేక మంది నియంతలను చూశాం.. వాళ్లంతా కాలగర్భంలో కలిసిపోయారు.. హుజూరాబాద్ నియోజకవర్గంలో గూండాయిజం చేసే ప్రయత్నం చేస్తే మాడి మాసైపోతారు'.. అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఇటీవల కమలాపూర్ శివారులో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య జరిగిన గొడవలో అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఆరుగురు బీజేపీ కార్యకర్తలు గురువారం రాత్రి విడుదలయ్యారు. కమలాపూర్‌కు వచ్చిన వారికి ఈటల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా తన ఇంటికి చేరుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్ మాట్లాడారు. హుజూరాబాద్ ప్రజల సహనాన్ని, ఓపికను పరీక్షించొద్దని, కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడగొట్టేంత వరకు నిద్రపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం బీజేపీ కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టడం, జైలు పాలు చేయడం, పోలీసులతో కొట్టించడం వంటి నీచమైన చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. హుజూరాబాద్ ప్రజలపై పగపట్టిన సీఎం కేసీఆర్ అనేక మందికి లైసెన్స్‌డ్ తుపాకులు ఇచ్చారని ఆరోపించారు.

మీసం లేని రొయ్య

అడవిలో ఉంటుందయ్యా..



బొడ్డెంగులు కేరాఫ్ విశాఖ మన్యం ప్రొటీన్లు..

పోషకాలు వీటిలో అధికం ఈత దుబ్బులే వీటి ఆవాసాలు	• డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు లభ్యం • రొయ్యల వేపుడు తరహాలో వంటకాలు • ఆదివాసీలు అమితంగా ఇష్టపడే వంటకం • పాడేరు, అరకు సంతల్లో లభ్యం • 30 బొడ్డెంగులు రూ.100కు విక్రయం

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మన్యంలో దొరికే బొడ్డెంగులు (అడవి రొయ్యలు) గిరిజనులకు ఎంతో ప్రీతి. వాటిని మన్యం ప్రజలు లొట్టలేసుకుని మరీ తింటారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ మాత్రమే ఇవి లభిస్తాయి. గిరిజన గ్రామాలను ఆనుకుని ఉండే అటవీ ప్రాంతంలో ఈత దుబ్బులున్న చోట ఇవి పెరుగుతాయి. ఈత మొదలును తవ్వితే మట్టిలో రొయ్యల మాదిరిగా ఉండే పురుగులు లభిస్తాయి. వీటి శరీరం పూర్తిగా కొవ్వుతో కూడి ఉంటుంది. వీటిని రొయ్యల వేపుడు, ఇగురు తరహా కూరలతోపాటు ఇతర వంటకాలను తయారు చేస్తుంటారు గిరిజనులు.

ఎలా సేకరిస్తారంటే..

ఆదివాసీ యువకులు అటవీ ప్రాంతంలో చాలా శ్రమకోర్చి వీటిని సేకరిస్తుంటారు. సేకరించిన తర్వాత ఒక రాత్రి మాత్రమే ఇవి బతికి ఉంటాయి. ఈత చెట్టు కాపు పూర్తయ్యాక చెట్టు ఎండి అంతరించిపోయే క్రమంలో వాటి అడుగు భాగాన బొడ్డెంగులు పుట్టుకొస్తాయని ఆదివాసీలు చెబుతున్నారు. ఇటీవల కాలంలో వీటి సేకరణ గిరిజన యువతకు ఉపాధి వనరుగా మారింది. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాలతోపాటు తూర్పు గోదావరి జిల్లాలోని అటవీ ప్రాంతంలో మాత్రమే ఈత చెట్ల పెంపకం ఉంది. మంగళవారం పాడేరు మార్కెట్‌కు బతికి ఉన్న బొడ్డెంగుల్ని గిరిజనులు తీసుకురాగా.. హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. 30 బొడ్డెంగుల్ని రూ.100 చొప్పున విక్రయించగా, గంటలో ఎగరేసుకుపోయారు.



బొడ్డెంగుల్ని విక్రయిస్తున్న గిరిజనులు

దట్టమైన అడవుల్లో ఈత దుబ్బుల మాటున లభ్యమయ్యే అడవి రొయ్యల కోసం ఆదివాసీలు ఏడాది పొడవునా ఎదురు చూస్తుంటారు. వాటి కోసం వాగులు.. వంకలు.. కొండలు.. గుట్టలు దాటుకుని దట్టమైన అరణ్యాల్లోకి వెళ్తారు. ఈత దుబ్బుల్లో కనిపించగానే ఒడిసిపట్టి బుట్టలో వేసుకుంటారు. ఇంటికి తెచ్చి కమ్మగా వండుకుని ఆబగా తింటారు. ఏడాదికి మూడు నెలలు మాత్రమే లభించే ఈ జీవులను బొడ్డెంగులు అని పిలుస్తారు. ఆదివాసీలు మాత్రం వీటిని అడవి రొయ్యలుగా ముద్దుగా పిలుచుకుంటారు. బొడ్డెంగులకు రొయ్యల మాదిరిగా మీసాలుండవు కానీ.. సేమ్ టు సేమ్ రొయ్యల్ని పోలి ఉంటాయి.

రక్తహీనతకు తగ్గించే మందులా..

రక్తహీనత ఉన్న వారు బొడ్డెంగులను వేపుడు లేదా కూర వండుకుని తింటే ఆ సమస్య తగ్గుతుందని గిరిజనులు చెబుతుంటారు. బొడ్డెంగులు రక్తపుష్టిని కలగజేస్తాయని వైద్యులు సైతం ధ్రువీకరిస్తున్నారు. ప్రొటీన్లు, పోషకాలు పుష్కలంగా ఉండే వీటిని సహజసిద్ధంగా దొరికే పౌష్టికాహారంగా అభివర్ణిస్తుంటారు. ఇవి దొరికిన రోజున బంధువులను పిలిచి మరీ గిరిజనులు విందులు ఏర్పాటు చేస్తుంటారు. జీలుగ కల్లు, మద్యం తాగేవారు నంజు (స్టఫ్)గా వీటిని ఆస్వాదిస్తారు.

మంచి ఆదాయం



వీటి కోసం దాదాపు వారం రోజులుగా తిరిగాం. పెదబయలు మండలం మారుమూల కుంతర్ల ప్రాంతంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఈత దుబ్బుల్లో సేకరించాం. తెచ్చిన గంటలోనే అమ్ముడయిపోయాయి. మంచి ఆదాయం వచ్చింది. వీటి వేపుడు ముందు రొయ్యల వేపుడు దిగదుడుపే.

– బోనంగి కుమార్, కుంతర్ల, ఏఎస్సార్ మన్యం జిల్లా

ఒక్క డాక్యుమెంట్ రూ.15.96 కోట్లు!



రిజిస్ట్రేషన్ల శాఖకు గండిపేట పరిధిలో 'గోల్డెన్'డీల్

- బండ్లగూడ జాగీర్‌లో 75వేల చదరపు గజాల భూమి ఓ ఎడ్యుకేషన్ అకాడమీకి బదలాయింపు
- గతేడాది మేలో మూసాపేట సమీపంలోని ముస్కిపేట భూ బదలాయింపుతో 35.51 కోట్ల ఫీజు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.14,500 కోట్ల వరకు వచ్చే చాన్స్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 'గోల్డెన్'డీల్స్ వస్తున్నాయి. 2023 సంవత్సరం ప్రారంభంలోనే మంచి బోణీ అందింది. జనవరి తొలివారంలో ఒకే ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌తో ఏకంగా రూ.15.96 కోట్ల ఆదాయం సమకూరింది. గండిపేట సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బండ్లగూడ జాగీర్‌లో ఉన్న 75,072 చదరపు గజాల భూమిని మైనార్టీ ట్రస్టు నుంచి మరో ఎడ్యుకేషనల్ ట్రస్టుకు బదలాయిస్తూ (కన్వేయన్స్) ఈ లావాదేవీ జరిగింది. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ భూమి మొత్తం మార్కెట్ విలువను రూ.210 కోట్లుగా లెక్కించి, రూ.15.96 కోట్ల ఫీజు వసూలు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం మొదలైనప్పటి నుంచీ ఆరేడు జాక్‌పాట్ లావాదేవీలు జరిగినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల ద్వారా తాజాగా తెలిసింది.

ఇంతకు ముందు ఇంకా పెద్ద డీల్

2022 మేలో ఒకే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ద్వారా ఏకంగా రూ.35.51 కోట్ల ఆదాయం సమకూరింది. కూకట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి వచ్చే మిస్కిపేటలో 1,54,880 చదరపు గజాల భూమిని ఓ ఆయిల్ కార్పొరేషన్, ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కలిసి మరో రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాయి. ఈ భూమి మార్కెట్ విలువ రూ.466 కోట్లుగా నిర్ధారించిన రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు 35.51 కోట్ల ఫీజు వసూలు చేశారు. ఇక గండిపేట, రాజేంద్రనగర్, వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ పలు భారీ లావాదేవీలు జరిగాయని.. కేవలం 5 డాక్యుమెంట్ల ద్వారానే రూ.100 కోట్లకుపైగా రెవెన్యూ సమకూరిందని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.14,500 కోట్లదాకా ఆదాయం!

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఫిబ్రవరి 13 నాటికి రూ.12,310 కోట్ల వరకు ఖజానాకు చేరినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మరో నెలన్నర రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో.. ఇంకో రూ.2,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్ల వరకు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో పేర్కొన్న విధంగా రూ.16 వేల కోట్లు, 2023–24కు నిర్దేశించుకున్న రూ.18 వేల కోట్లు సమకూరే అవకాశం లేదని.. రిజిస్ట్రేషన్ ఫీజులు లేదా భూ విలువలను సవరిస్తేనే లక్ష్యం చేరుకోవడం సాధ్యమని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూము లు, ఆస్తుల రిజిస్ట్రేషన్లన్నీ కలిపి రూ.14,500 కోట్ల మేరకు సమకూరవచ్చని అంటున్నారు.

2022-23లో భారీగా ఫీజు వచ్చిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు (రూ.కోట్లలో)

నెల	రిజిస్ట్రార్ ఆఫీసు	రెవెన్యూ
మే (2022)	కూకట్‌పల్లి	35.51
ఏప్రిల్ (2022)	గండిపేట	21.72
ఆగస్టు (2022)	గండిపేట	16.21
జనవరి (2023)	గండిపేట	15.96
అక్టోబర్ (2022)	రాజేంద్రనగర్	15.08
ఏప్రిల్ (2022)	వనస్థలిపురం	14.43
సెప్టెంబర్(2022)	కూకట్‌పల్లి	13.58

ప్రభుత్వ స్కూళ్లకు పోటెత్తారు!

విద్యార్థుల చేరికలో 2 లక్షల మేర పెరుగుదల

- కార్పొరేట్ వసతులు, ఆంగ్లంలో బోధనతో తల్లిదండ్రుల మొగ్గు
- ప్రైవేటు పాఠశాలల్లో పడిపోతున్న చేరికలు • సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తాజా సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు దాదాపు 2 లక్షల మేర పెరిగింది. 2020–21లో 60.40 లక్షల మంది విద్యార్థులు చేరితే, 2021–22లో ఈ సంఖ్య 62.30 లక్షలకు చేరింది. సర్కారీ స్కూళ్లలో మౌలిక వసతులు పెరగడం, ఇంగ్లిష్ మీడియంలో బోధన నేపథ్యంలో తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అవుతున్న విద్యార్థుల శాతం 2019–20 లో 42.91 ఉంటే, 2020–21లో 43.47, 2021–22 లో 49.77గా ఉండటం గమనార్హం. ఇదే కాలంలో ప్రైవేట్ పాఠశాలల్లో నమోదు శాతం తగ్గిపోయింది. 2019–20 లో 57.09 శాతం ఉండగా 2020–21లో 56.53%, 2021–22లో 50.23% చొప్పున నమోదయ్యింది. ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత స్థాయికి, ఎలిమెంటరీ నుండి సెకండరీ స్థాయికి వెళుతున్న విద్యార్థుల శాతం దేశవ్యాప్తంగా సగటున 3.83 శాతం ఉంటే, తెలంగాణలో అది 7.48 శాతంగా ఉంది.

మౌలిక వసతులు, ఆంగ్లంలో బోధన

పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ స్కూళ్ళు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మూడేళ్లలో రూ.7,289.54 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించారు. తొలిదశలో రూ. 3,497.62 కోట్లతో 9,123 స్కూళ్లలో 12 రకాల మౌలిక వసతులు కల్పించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు చాలా స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. మరోవైపు ఆంగ్ల మాధ్యమంలో బోధన సైతం అందుబాటులోకి రావడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు.



కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎల్బీస్టేడియంలో గురువారం అర్ధరాత్రి 12 గంటలకు తన కుమారుడితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు

పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు

- నియోజకవర్గాల వారీగా వివరాలు పంపాలి
- పోడు భూముల పట్టాలు సిద్ధం చేయాలి
- కలెక్టర్లకు సీఎస్ శాంతి కుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుపేదలకు భూమి పట్టాల పంపిణీకి పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, నివాసం ఉంటున్న వారి వివరాలను శాసన సభ నియోజక వర్గాల వారీగా సేకరించి వెంటనే ప్రభుత్వానికి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం ఆమె బి.ఆర్.కె.ఆర్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోడు భూములకు సంబంధించి యాజమాన్య పట్టాలను అందించేందుకు జిల్లా స్థాయి కమిటీలో ఆమోదం పొందిన వాటికి పాస్ పుస్తకాల తయారీని చేపట్టాలని సూచించారు. హరిత హారంలో భాగంగా 2023–24లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు గానూ వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు 58 , 59 , 76 , 118ల కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వారికందరికీ రిజిస్ట్రేషన్లను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పూర్తయిన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను తరలించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

డేటా ఎంబసీలను ఇక్కడ ఏర్పాటు చేయండి

- అంతర్జాతీయ సంస్థలకు హైదరాబాద్ అనుకూలం
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ లేఖ
- గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో డేటా ఎంబసీలు ఏర్పాటు చేస్తే ప్రమాదమన్న మంత్రి
- అది భూకంపాలు వచ్చేందుకు అవకాశం ఉన్న ప్రాంతం..

సాక్షి, హైదరాబాద్: డేటా ఎంబసీలను కేవలం గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో మాత్రమే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె. తారక రామారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశానికి అత్యంత కీలకమైన డేటా ఎంబసీలని మొత్తానికి మొత్తంగా కేవలం ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయడం అనేక సమస్యలకు దారితీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం డేటా ఎంబసీలను ఏర్పాటు చేయాలనుకుంటున్న గుజరాత్ గిఫ్ట్ సిటీ భూకంపాలు వచ్చేందుకు అవకాశం ఉన్న భౌగోళిక ప్రాంతమని, దీంతోపాటు దేశ సరిహద్దును పంచుకుంటున్న రాష్ట్రంలో డేటా ఎంబసీలను ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదంతో కూడుకున్నదని తెలిపారు. హైదరాబాద్ నగరానికి భౌగోళికంగా ప్రకృతి వైపరీత్యాల నుంచి సహజ రక్షణ, అనుకూలతలు ఉన్నాయని వివరించారు. భారత దేశంలోనే అత్యంత సురక్షితమైన సెస్మిక్ జోన్–2 లో హైదరాబాద్ నగరం ఉన్నదని, అందుకే ఇక్కడ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడం అత్యుత్త మమైన నిర్ణయం అవుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న గిఫ్ట్ సిటీ సెస్మిక్ జోన్ 3 , సేస్మిక్ జోన్ –4కి అత్యంత దగ్గరగా ఉన్న ప్రాంతమని, తద్వారా ఇక్కడ భూకంపాలు భారీగా వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మొత్తం డేటా ఎంబసీల కార్యకలాపాలు స్తంభించి, ఆ ప్రభావం అంతర్జాతీయ సంబంధాలపై పడుతుందన్నారు.

నిర్ణయాన్ని పునఃపరిశీలించండి



డేటా ఎంబసీలను కేవలం ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు తీసుకున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునర్ పరిశీలించాలని మంత్రి కేటీఆర్ కోరారు. ఈ బడ్జెట్లో ప్రతిపాదించిన డేటా ఎంబసీస్ ఏర్పాటును దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా దేశంలోని ఇతర ప్రాంతాలకు సైతం ఈ విషయంలో సమాన అవకాశాలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు అవుతుందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు.

అమెజాన్ నుంచి మైక్రోసాఫ్ట్ వరకు అన్నీ హైదరాబాద్‌లోనే..

అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇప్పటికే భారతదేశంలో విస్తృతమైన అధ్యయనాలను చేసి, తెలంగాణను తమ డేటా సెంటర్లకు అనువైన కేంద్రంగా ఎంచుకున్న విషయాన్ని కేటీఆర్ కేంద్ర మంత్రికి రాసిన లేఖలో ప్రస్తావించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ మొదలుకొని మైక్రోసాఫ్ట్ వరకు అనేక కంపెనీలు హైపర్ స్కేల్ డేటా సెంటర్లను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. 2016 లోనే తెలంగాణ ప్రభుత్వం తమ డేటా సెంటర్ పాలసీని ప్రకటించిందని, ఇందులో భాగంగా డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాల విషయంలో తెలంగాణ రాష్ట్ర డేటా సెంటర్ పాలసీ అత్యంత ఆకర్షణీయంగా ఉందని తెలిపారు.

ధరణి రద్దు చేస్తూ తొలి జీఓ

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ దరిద్రాన్ని తొలగిస్తాం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- ల్యాండ్, శాండ్, వైన్, మైన్.. చివరికి రేప్ కేసుల్లోనూ బీఆర్‌ఎస్ సన్నాసులే
- మా నేతల వైపు చూస్తే ఊరుకోం.. మిత్తికి మిత్తీ చెల్లిస్తాం
- డబుల్ బెడ్రూమ్, దళితబంధు, రుణమాఫీ చేసిన ఓట్లు నువ్వు వేయించుకో
- ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినవి, దళితబంధురాని, నిరుద్యోగుల ఓట్లు మేం వేయించుకుంటాం
- హాథ్ సే హాథ్ జోడోయాత్రలో కేసీఆర్‌కు రేవంత్ సవాల్

సాక్షి, వరంగల్/వర్ధన్నపేట: 2024 జనవరిలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తూ తొలి జీఓ విడుదల చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అస్తవ్యస్తంగా మారిన భూములను మరింత ఆగమాగం చేస్తున్న ధరణి దరిద్రాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఈ వర్ధన్నపేట, వరంగల్ చుట్టూరా గుంజుకున్న భూములు మీకు రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్.. చివరికి రేప్ కేసుల్లోనూ బీఆర్‌ఎస్ సన్నాసులే ఉంటున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఉదయం హనుమకొండ జిల్లా ఐనవోలు నుంచి మొదలైన హాథ్ సే హాథ్ జోడోయాత్ర సాయంత్రానికి వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చేరుకుంది. రాత్రి అక్కడి అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'ఐదు వేలు ఇవ్వొచ్చు...పదివేలు ఇవ్వొచ్చు... మీ తాతల కాలం నాటి భూములు మీ చేతిలో ఉండవు. అయినకు ఓటేస్తే ఇందిరమ్మ ఇళ్లు రావు. ఆరోగ్య శ్రీకి ఐదు లక్షలు రావు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావు. రావు సాబ్ పోవాలి' అని చెప్పారు.

కేసీఆర్‌కు సూటిగా సవాల్

'వర్ధన్నపేట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా సీఎం కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నా... డబుల్ బెడ్రూమ్ ఇచ్చిన ఊళ్లో ఓట్లు నువ్వు వెయ్యించుకో... ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఊళ్లో మేం ఓట్లు వేయించుకుంటాం... ఇంటికి ఉద్యోగమిస్తే వారి ఓట్లు వెయ్యించుకో... నిరుద్యోగుల ఓట్లు మేం వేయించుకుంటాం... లక్ష ఎకరాలకు సాగునీరందిస్తే ఆ నియోజకవర్గంలో నీ ఎమ్మెల్యేను గెలిపించుకో... రాని నియోజకవర్గాల్లో మేం గెలిపించుకుంటాం... ఏ ఊళ్లో దళితులకు మూడెకరాల భూమి ఇచ్చినవో ఆ ఓట్లు నువ్వు వేయించుకో... రానివారి ఓట్లు మేం వేయించుకుంటాం. దళిత బంధు వచ్చినోళ్లు అందరూ కేసీఆర్‌కు ఓట్లేయండి... రానోళ్లు కాంగ్రెస్‌కు ఓటెయ్యండి... రైతు రుణమాఫీ రూ.లక్ష జరిగితే నీకే ఓటేస్తారు' అని చెప్పారు. ఈ సవాల్‌ను కేసీఆర్ స్వీకరించాలన్నారు. అప్పటి కాంగ్రెస్, దివంగత సీఎం వైఎస్ఆర్ పాదయాత్ర చేసి ప్రజల ఆరోగ్యం కోసం తెచ్చిన ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.



ఐనవోలు మండలం పెరుమాండ్ల గూడెంలో మహిళలతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

మా నేతల వైపు చూస్తే ఊరుకోం

తుంగతుర్తి నియోజకవర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేసే ప్రయత్నం చేశారని, తమ నేతలవైపు చూసినా.. కేసులు పెట్టినా ఊరుకోబోమని రేవంత్ హెచ్చరించారు. అన్నింటిపై డైరీ రాస్తున్నామని, కాంగ్రెస్ కార్యకర్తల మీద దాడులు చేస్తే మిత్తికి మిత్తీ చెల్లించే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందన్నారు. '2003లో మాదిరే 2023లోనూ అవే పరిస్థితులే ఉన్నాయి. 2004లో మాదిరిగానే 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది' అని రేవంత్ ధీమావ్యక్తం చేశారు. యాత్రలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, డాక్టర్ రవి మల్లు, కోదండరెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు మితిమీరుతోంది!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నాయి. నేల సారం దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుందని, దిగుబడుల్లో పురుగు మందుల అవశేషాలు ఆరోగ్యానికి హానికరంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరోవైపు పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో రైతులు, దిగుబడులను సేకరించే సమయంలో కూలీలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నట్లు పరిశీలనలు చెబుతున్నాయి.

క్రిమిసంహారకాలు అత్యధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలు (మె. టన్నుల్లో)

రాష్ట్రం	2017-18	2018-19	2019-20	2020-21
మహారాష్ట్ర	15568	11746	12783	13243
ఉత్తర్‌ప్రదేశ్	10824	11049	12217	11557
పంజాబ్	5835	5543	4995	5193
తెలంగాణ	4866	4894	4915	4986
హర్యాణ	4025	4015	4200	4050
జాతీయ స్థాయి	63406	59670	61702	62193

పీఎం ప్రమాణ్‌పై ఆసక్తి చూపని ప్రభుత్వాలు

పురుగుమందుల వాడకానికి సంబంధించిన అధ్యయనాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. పెస్టిసైడ్స్ వినియోగాన్ని తగ్గించి సహజ సిద్ధమైన సాగు విధానాలను ప్రవేశ పెట్టే క్రమంలో పీఎం ప్రమాణ్ (ప్రధాన మంత్రి ప్రమోషన్ ఆఫ్ ఆల్టర్నేట్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్) పేరుతో ప్రత్యామ్నాయ పోషకాలను ప్రోత్సహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ ఈ పథకంపై రైతాంగానికి అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు ఓ సమావేశంలో అభిప్రాయపడ్డారు. సహజ సిద్ధమైన విధానాలు అవలంబిస్తే భూసారాన్ని పరిరక్షించవచ్చని, సాగు ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరుగుతుందనేది అపోహ..

వ్యవసాయంలో రసాయన మందుల వినియోగం పెంచడం వల్ల దిగుబడి పెరుగుతుందనేది ఒక అపోహ మాత్రమే. ఒక్కోసారి సీజన్‌లోని వాతావరణ పరిస్థితులతో దిగుబడి పెరిగినా.. క్రిమిసంహారకాల వినియోగం పెంచడంతో క్రమంగా దిగుబడి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో రైతులు తరచుగా జ్వరం, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు గురవుతున్నారు. పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాలి ద్వారా రసాయనాలు కొంతమేరకు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. శరీరంపై పడిన రసాయనాల వల్ల చర్మ సంబంధిత వ్యాధులు బాధిస్తాయి. పలు అంతర్జాతీయ సంస్థలు పరిశోధనలు జరిపి ధ్రువీకరించాయి. మరోవైపు రసాయనాలతో కూడిన మందుల వినియోగంతో భూసారం తగ్గితే, ఎరువుల వాడకాన్ని కూడా పెంచాల్సి వస్తుంది. ఇది రైతుకు అదనపు భారం. అందువల్ల సహజసిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడమే మేలు. దిగుబడి ఒకేసారి పెరగనప్పటికీ, భవిష్యత్తులో లాభదాయకంగా ఉంటుంది.

– నర్సింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు



● యంగ్ టాలెంట్



● దావల్, జయేష్

షార్క్ టైగర్స్

'నా దగ్గర ఎన్నో ఐడియాలు ఉన్నాయి. ఫండింగ్ ఉంటే ఎక్కడో ఉండేవాడిని' అనేది బ్లాక్ అండ్ వైట్ జమాన నాటి మాట. 'నీ దగ్గర ఐడియా ఉంటే చాలు...దానికి రెక్కలు ఇవ్వడానికి ఎంతోమంది ఉన్నారు' అనేది నేటి మాట. 'ఐడియా' ఉండి ఫండింగ్ అవకాశం లేని స్టార్టప్ కలల యువతరానికి 'షార్క్ ట్యాంక్ ఇండియా'లాంటి టీవి ప్రోగ్రామ్స్ ఆశాదీపాల్లా మారాయి. తాజాగా గుజరాత్‌కు చెందిన 20 సంవత్సరాల దావల్ తన సోదరుడు జయేష్‌తో కలిసి స్టార్టప్ కలను సాకారం చేసుకోబోతున్నాడు...

దావల్‌కు కాలేజీ టీ స్టాల్‌లో టీ తాగడం అంటే చాలా ఇష్టం. అలాంటి ఇష్టం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీనికి కారణం టీ స్టాల్‌లో పనిచేసే అబ్బాయి ఒక టబ్‌లో అవే నీళ్లలో గ్లాసులను కడగడం. దారిన పోయే మేక ఒకటి వచ్చి ఆ నీళ్ల తాగినా ఆ నీళ్ల అలాగే ఉండడం! టీ స్టాల్ యజమానికి చెప్పినా అతడు పట్టించుకోకపోవడం!!

కాలేజీ టీ స్టాల్‌లోనే కాదు బయట రోడ్డు సైడ్ టీ స్టాల్స్, దాబాలలో కూడా ఇలాంటి దృశ్యాన్నే చూశాడు దావల్.

'ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నాడు గుజరాత్‌లోని బవస్కంత గ్రామానికి చెందిన దావల్.

యూట్యూబ్‌లో మెషిన్ డిజైనింగ్ సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టాడు. ఆరు నెలల్లో ఒక అవగాహన వచ్చింది.

తండ్రితో కలిసి ఒక హార్డ్‌వేర్ షాప్‌కు వెళ్లి స్క్రాప్ ఉచితంగా ఇవ్వాల్సిందిగా బతిమిలాడుకున్నాడు. స్క్రాప్ చేతికి వచ్చిన తరువాత ప్రయోగాలు ప్రారంభించాడు.

ఒకటి, రెండు, మూడు, నాలుగు ప్రయత్నాల్లోనూ విఫలం అయ్యాడు.

'చేసింది చాలు. ఇక ఆపేయ్. స్క్రాప్ ఇచ్చేదే లేదు' అన్నాడు హార్డ్‌వేర్ షాప్ యజమాని. దీంతో తనకు తెలిసిన ప్రొఫెసర్‌ను కలిసి విషయం చెప్పాడు. ఆయన పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించాడు.

ఈసారి మాత్రం తన ప్రయత్నంలో పూర్తిగా సక్సెస్ అయ్యి ఆటోమెటిక్ టీ-గ్లాస్ వాషింగ్ మెషిన్ కలను నెరవేర్చుకున్నాడు. ఈ మెషిన్‌లోని వాటర్ జెట్‌తో 30 సెకండ్ల వ్యవధిలో 15 టీ గ్లాసులను శుభ్రపరచవచ్చు. దీని సామర్థ్యాన్ని పెంచే కొత్త మెషిన్ కూడా తయారు చేశాడు దావల్.

దీని గురించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే అనూహ్యమైన స్పందన వచ్చింది. కొందరు ప్రొఫెసర్‌లను కలిసి ఈ మెషిన్ గురించి డెమో ఇచ్చాడు. వారికి నచ్చి అభినందించడమే కాదు లక్ష రూపాయలు ఇచ్చారు. వారు ఇచ్చిన లక్షతో అయిదు మెషిన్‌లను తయారుచేసి కర్నాటక, తమిళనాడు,మహారాష్ట్రలలో అమ్మారు.

దావల్ సోదరుడు జయేష్‌కు సొంతంగా వ్యాపారం చేయాలనేది కల. సోదరులిద్దరు 'మహంతం' పేరుతో స్టార్టప్ ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. తాజాగా షార్క్‌ట్యాంక్ ఇండియా(సోనీ టీవీ) రియాల్టీ షోలో దావల్, జయేష్‌లు చెప్పిన స్టార్టప్ ఐడియా నచ్చి అయిదుగురు షార్క్స్(బిగ్-షాట్ ఇన్వెస్టర్స్) డీల్ ఆఫర్ చేయడమే కాదు 'మీ విజయం యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అని అభినందించారు.

ఆ మాటే విజయమంత్రం

'అపజయం మాత్రమే అంతిమం కాదు' అనే మాటను ఎన్నోసార్లు విన్నాను. నా ప్రయత్నంలో విఫలమైనప్పుడల్లా ఈ మాటను గుర్తు తెచ్చుకునేవాడిని. మళ్లీ మళ్లీ ప్రయత్నించేవాడిని. కొందరు నన్ను వింతగా చూసేవారు. కొందరైతే...నీకు నువ్వు సైంటిస్ట్‌లా ఫీలవుతున్నావు అని వెక్కిరించేవాళ్లు. అయితే నేను వాటిని ఎప్పుడూ పట్టించుకోలేదు. సక్సెస్ కావడమే నా లక్ష్యం అన్నట్లుగా కష్టపడ్డాను. చివరికి ఫలితం దక్కింది.

-దావల్

● అవును...ఇది నిజమే!

● 'అన్‌ఫ్రెండ్' అనే మాట ఫేస్‌బుక్‌కు ముందు ఉందా? అనే ప్రశ్నకు చాలామంది చెప్పే జవాబు 'లేదు' అని. అయితే 13వ శతాబ్దానికి చెందిన కవి లయమన్ కవితలో ఈ పదం కనిపిస్తుంది. అప్పటి ఇంగ్లీష్‌ను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే అయినా అర్థం కాకుండా మాత్రం పోదు!

● 'హెడ్‌లెస్ చికెన్ మాన్‌స్టర్' గురించి ఎప్పుడైనా విన్నారా? నిజానికి దీనికీ చికెన్‌కు ఎలాంటి సంబంధం లేదు. 'హెడ్‌లెస్ చికెన్ మాన్‌స్టర్' అనేది ఒక రకమైన సముద్రపు దోసకాయ. సదరన్ ఒషియన్‌కు సమీపంలో దీన్ని కనుగొన్నారు.

● 'టర్టిల్ అనగా ఏమిటి?' ప్రశ్నకు అందరి నుంచి వినిపించే జవాబు...తాబేలు. స్కాట్‌లాండ్‌లో మాత్రం దీనికి వేరే అర్థం ఉంది. ఎవరి పేరు అయినా ఎంతకూ గుర్తుకు రాని సందర్భంలో, అసహనానికి, తట్టుకోలేని కోపానికి గురయ్యే సమయంలో ఉపయోగించే మాట ఇది.

● గేమింగ్ : నేడే విడుదల



విల్లు అందుకుంటే ఇక విలయమే!

ఒక పెద్ద చెట్టు కింద నిల్చుంటాడు కథానాయకుడు. అది చెట్టు కాదని భయానకమైన మాన్‌స్టర్ అని తెలుసుకోవడానికి ఎంతో సేపు పట్టదు. ఒక కొండ పక్కన కూర్చొని ఉంటాడు హీరో...'కొండ కదులుతున్నదేమిటి!' అనే ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపే అది క్రూరమైన మాన్‌స్టర్ అని తెలుసుకుంటాడు. పూలతోటల నుంచి మంచుఎడారి వరకు రకరకాల మాన్‌స్టర్‌లను బుక్‌వార్క్‌లాంటి యంత్రం సహాయంతో ఎలా ఎదుర్కొన్నాడు అనేదే వైల్డ్ హార్ట్స్ గేమ్.

యాక్షన్-అడ్వెంచర్ వీడియో గేమ్ 'వైల్డ్ హార్ట్' నేడు విడుదల అవుతుంది. జపాన్‌కు చెందిన వీడియో గేమింగ్ కంపెనీ వొమెగా ఫోర్స్ దీన్ని రూపొందించింది. మాన్‌స్టర్ హంటింగ్ గేమ్స్‌లో చేయితిరిగిన కొటారో హిరాట్ ఈ గేమ్‌కు డైరెక్టర్. అలనాటి ఫ్యూడల్ జపాన్‌ను స్ఫూర్తిగా తీసుకొని 'అజుమి' అనే మాయాప్రపంచాన్ని సృష్టించారు. భయంకరమైన మాన్‌స్టర్స్‌ను వేటాడే బాధ్యత ప్లేయర్స్‌పై ఉంటుంది. మోనస్టర్స్‌ను వేటాడడానికి వాగస, కలూనాలాంటి ఎనిమిది ఆయుధాలు ఈ గేమ్‌లో ఉంటాయి. బుక్‌వార్క్‌లాంటి యంత్రంతో ఎమిమీ దారిని బ్లాక్ చేయవచ్చు.

ప్లాట్‌ఫామ్స్: పీఎస్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, పీసీ
మోడ్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్

● టెక్.. టాక్



సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్23 ఆల్ట్రా

సైజ్: 6.8 అంగుళాలు
బరువు: 234 గ్రా.
రిజల్యూషన్: 1440X3088 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13, వన్ యూఐ 5.1
మెమోరీ:
256జీబి 8జీబి ర్యామ్
256జీబి 12జీబి ర్యామ్
512 జీబి 12జీబి ర్యామ్
కలర్స్: ఫాంటమ్ బ్లాక్, గ్రీన్, క్రీమ్, స్కైబ్లూ, రెడ్, జీఎండబ్ల్యూ ఎం ఎడిషన్



వాట్సాప్‌లో ఫొటో క్వాలిటీ ఫీచర్

వాట్సాప్ 'ఫొటో క్వాలిటీ' ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఫీచర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్‌లు ఒరిజినల్ క్వాలిటీతో, కంప్రెస్‌డ్ ఫార్మట్‌లో ఫొటోలను పంపి డాటా సేవ్ చేసుకోవచ్చు. యూజర్లు తమ వాట్సాప్ సెట్టింగ్స్ మార్చుకోవడం ద్వారా ఈ ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు.

వాట్సాప్‌లో (ఐఫోన్) ఒరిజినల్ క్వాలిటీ ఫొటోలు సెండ్ చేయడానికి...
▸ వాట్సాప్ ఓపెన్ చేసి సెట్టింగ్స్ ఐకాన్ ట్యాప్ చేయాలి.
▸ స్టోరేజ్ అండ్ డాటా-ట్యాప్ ▸ మీడియా అప్‌లోడ్ క్వాలిటీ-ట్యాప్ ▸ ఆటో-సెలెక్ట్



ల్యాప్‌ట్యాప్ స్టాండ్

బ్రాండ్: ఐన్టఫ్ 365
కంపాటబుల్: ల్యాప్‌టాప్, టాబ్లెట్, ఐప్యాడ్స్ ● టూ ఇన్ వన్ డిజైన్ ● డిటాచబుల్ హోల్డర్ ఫర్ మొబైల్ ఫోన్స్
కలర్: బ్లాక్ బరువు: 375 గ్రా.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఒక విద్యలో అంతగా ప్రతిభ లేకపోయినా తనకు తానే ధైర్యం చెప్పుకుని బరిలోకి దిగడం, కంఫర్ట్ జోన్ వదిలి కొత్త దారిలో ప్రయాణిస్తున్నప్పుడు ఎక్కడైనా అసౌకర్యంగా ఉన్నా అది బయటపడనివ్వకుండా జాగ్రత్త పడడం...మొదలైన సందర్భాలలో ఉపయోగించే ఇడియమ్ ఇది.

ఉదా: ఐ నో యూ ఆర్ వెరీ అన్‌కంఫర్టబుల్ ఇన్‌దిస్ క్లాత్స్. బట్ మస్ట్ యాక్ట్ ఇన్ ఫ్రంట్ ఆఫ్ ది ఆడియెన్స్. యూ గాట్ టు ఫేక్ ఇట్ అన్‌టిల్ యూ మేక్ ఇట్.

సినిమా



● కృతీ శెట్టి, నాగచైతన్య

ఒక పాట.. ఏడు సెట్లు

ఏడు సెట్లలో హీరో నాగచైతన్య, హీరోయిన్ కృతీ శెట్టి ఆడిపాడుతున్నారు. ఎందుకంటే 'కస్టడీ' చిత్రం కోసం. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కస్టడీ'. పవన్ కుమార్ సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో నాగచైతన్య, కృతీపై ఒక పాట చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్, ఆర్ట్ డైరెక్టర్ డీవై సత్యనారాయణ ఏడు సెట్స్‌ని రూపొందించారు. ''ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న చిత్రం 'కస్టడీ'. ఇందులోని ఓ పాటని శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో హీరో హీరోయిన్లపై చిత్రీకరిస్తున్నాం. ఈ పాట కోసమే ఏడు సెట్లు వేయించాం. ఈ పాట కనువిందుగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా మే 12న 'కస్టడీ' రిలీజ్ కానుంది.

బ్రేక్ ఇవ్వలేదు

- రాశీ ఖన్నా

దక్షిణాదిలో పదేళ్లుగా సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు రాశీ ఖన్నా. అలాగే 'రుద్ర' సిరీస్‌తో వెబ్ వరల్డ్‌లోకి ఎంటర్ అయిన రాశీ తాజాగా 'ఫర్జీ' వెబ్ సిరీస్‌లో ఓ లీడ్ రోల్ చేశారు. రాజ్ అండ్ డీకేలు తెరకెక్కించిన ఈ సిరీస్‌లో షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి, రెజీనా ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఈ నెల 10 నుంచి ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా చెప్పిన విశేషాలు.

● 'ఫర్జీ'లో మీ పాత్రకు వచ్చిన అభినందనల గురించి...

ఈ సిరీస్‌లో నేను చేసిన మేఘా వ్యాస్ పాత్రకు వ్యూయర్స్ నుంచి మంచి స్పందన లభిస్తున్నందుకు హ్యాపీ. సామ్ (సమంత), కీర్తీ సురేష్ బాగుందంటూ మెసేజ్‌లు పెట్టారు. వీరితోపాటు కొందరు దర్శక-నిర్మాతలు కూడా కంగ్రాట్స్ చెప్పారు. తెలుగు, తమిళ ఆడియన్స్ నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది.

● ప్రస్తుతం మీ చేతిలో ఎక్కువ సినిమాలు లేవు. అయితే మీరు కొత్త సినిమాలు ఒప్పుకోనిది పెళ్లి చేసుకోవడం కోసమే అని కొందరు అనుకుంటున్నారు...

సినిమాలకు నేను బ్రేక్ ఇవ్వలేదు. తెలుగులో మూడు, తమిళంలో మూడు కథలు విన్నాను. అవి చర్చల దశలో ఉన్నాయి. 'ఫర్జీ' రిలీజ్ తర్వాత ఓ నిర్ణయం తీసుకుందామని వెయిట్ చేశాను.. అంతే. త్వరలో నా కొత్త సినిమా ప్రకటనలు వస్తాయి.

● హిందీ చిత్రం 'మద్రాస్ కేఫ్' (2013)తో కెరీర్ ప్రారంభించిన మీరు ఆ తర్వాత మరో హిందీ సినిమా చేయడానికి పదేళ్ల గ్యాప్ తీసుకోవడానికి కారణం?

తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో ప్రేమ చూపించారు. అందువల్ల నేను దక్షిణాది సినిమాలకే స్టక్ అయిపోయాను. నిజానికి కెరీర్‌లో ఏం చేయాలి అని నేను ప్లాన్ చేసుకోలేదు. ఓ ఫ్లో ప్రకారం వెళ్లిపోయాను. ఇప్పుడు ఏదో హిందీ సినిమా చేయాలని 'యోధ' ఒప్పుకోలేదు. కథ నచ్చడంతో 'యస్' చెప్పా. ఓటీటీ ప్రభావంతో భాషపరమైన హద్దులు కూడా లేవు. తెలుగు, హిందీ అని కాదు.. ప్రతిదీ ఇండియన్ సినిమానే. ప్రస్తుతం 'యోధ' సినిమా షూటింగ్ జరుగుతోంది.

● ఇటీవల కొందరు హీరోయిన్లు అనారోగ్యం బారిన పడటానికి వృత్తిపరమైన ఒత్తిడి ఓ కారణం అనుకోవచ్చా? ఒకవేళ మీకు ఒత్తిడి ఉంటే దాన్ని ఎలా అధిగమిస్తారు?

నిజం చెప్పాలంటే నా కెరీర్‌ను నేనెప్పుడూ ప్రెజర్‌గా ఫీల్ కాలేదు. సాధారణ పాత్ర చేసినప్పుడు మాత్రమే కాదు.. చాలెంజింగ్ రోల్ చేసినప్పుడూ కూల్‌గానే ఉంటాను. ఎందుకంటే యాక్టింగ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను. ఇక హెల్త్ విషయానికొస్తే.. నేను ఆరోగ్యంగా, హ్యాపీగా ఉన్నాను. దీన్ని నేను అదృష్టంగా భావిస్తున్నాను.

● మీకు డ్రీమ్ రోల్స్ ఏమైనా?

తెలుగులో నేను లవ్‌స్టోరీ సినిమాలు చేశాను. కామెడీ రోల్స్ చేశాను. ఇప్పుడు యాక్షన్ ఫిల్మ్ చేయాలని ఉంది. 'బాహుబలి'లో అనుష్కగారు చేసిన యువరాణిలాంటి పాత్ర చేయాలని ఉంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి చేసే ఏ పాత్రనైనా నేను డ్రీమ్ రోల్‌లానే భావిస్తాను.

● ఓ సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా కొత్తగా సినిమాల్లోకి వచ్చే అమ్మాయిలకు మీరు ఇచ్చే సలహా?

నా లైఫ్‌లో నేను టైమ్‌కి చాలా ప్రాధాన్యం ఇస్తాను. ఇండస్ట్రీలో రాణించాలంటే కష్టపడే తత్త్వం, క్రమశిక్షణ చాలా ముఖ్యం. అలాగే ఏ ఇండస్ట్రీకి వెళ్లినా అక్కడి భాషను నేర్చుకోవాలి.



● రాశీ ఖన్నా



● మురళీ కిషోర్, అల్లు అరవింద్, కిరణ్ అబ్బవరం, అఖిల్, కశ్మీర, బన్నీ వాసు

రెండు సీన్లు చూశా... థ్రిల్ అయ్యా!

- అఖిల్

''గీతా ఆర్ట్స్ ఈవెంట్‌కు నేను ఓ కుటుంబసభ్యుడిలా వచ్చాను. కొత్తదనం కోసం అరవింద్‌గారు ఎప్పుడూ తాపత్రయపడుతుంటారు. కష్టం ఎప్పుడూ వృథా కాదు. కిరణ్ ఎంతో కష్టపడుతున్నాడు. తనకు ఆల్ ది బెస్ట్'' అని అన్నారు అక్కినేని అఖిల్. కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిషోర్ (నందు) దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అఖిల్ మాట్లాడుతూ– ''వినరో..'లోని రెండు సీన్లు చూసి, థ్రిల్ అయ్యాను. ట్విస్ట్స్ అండ్ టర్న్స్‌తో ఈ సినిమా వస్తోంది '' అని అన్నారు. ''జెన్యూన్‌గా ఉండే కిరణ్‌లాంటి వ్యక్తులు తక్కువ. బన్నీ వాసుతో పాటు కిరణ్ అబ్బవరంనూ ఓ నిర్మాతగా ఫీలవుతున్నాను. ఈ సినిమాకు అతను అలా వర్క్ చేశాడు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ''అఖిల్ గారి సినిమాలో నేను ఓ కీ రోల్ చేయాల్సింది. కుదర్లేదు. ఏయన్నార్‌గారు చేసిన 'మనం' సినిమా తెలుగు ప్రేక్షకులకు ఓ ఎమోషన్. స్క్రీన్‌పై గీతా ఆర్ట్స్ అని చూసిన మాలాంటి వారు కూడా అదే బ్యానర్‌లో సినిమాలు చేయొచ్చు అంటూ ఛాన్స్ ఇచ్చిన అల్లు అరవింద్‌గారికి ధన్యవాదాలు. నాలా సినిమాపై ప్యాషన్‌తో వచ్చేవారి తరఫున అల్లు అరవింద్‌గారికి ధన్యవాదాలు చెబుతున్నాను. 'వినరో. ..' సినిమా బాగా రావడానికి ఎంతో కారణమైన బన్నీ వాసుగారి దగ్గర్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ మూవీతో నందు అన్నకు మంచి పేరు వస్తుంది. యూట్యూబ్‌లో షార్ట్‌ఫిల్మ్ 'గచ్చిబౌలి' నుంచి నేను ఇక్కడి వచ్చేంతవరకు నన్ను ప్రోత్సహించిన, ఇంకా సపోర్ట్ చేస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. 'వినరో..' పెద్ద హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు కిరణ్ అబ్బవరం. ''నేను దర్శకుడిని అయ్యానని మా నాన్నకు నేను హ్యాపీగా చెప్పుకునేలా చేసిన కిరణ్ అబ్బవరంకు, నిర్మాతలు అరవింద్, బన్నీ వాసుగార్లకు ధన్యవాదాలు'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్ తర్వాత నాగచైతన్య, అఖిల్ నాకు ఆప్తులు. నా మనసుకు కనెక్ట్ అయిన సినిమా ఇది. ఈ సినిమా చూశాక ఆడియన్స్ కొన్ని అంశాలను వెంట తీసుకెళ్తారు. కిరణ్, కిశోర్, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్‌లకు మంచి భవిష్యత్తు ఉంటుంది'' అన్నారు బన్నీ వాసు.



నటిని కావాలని అనుకోలేదు

గౌరి జి. కిషన్

''శ్రీదేవి శోభన్‌బాబు'లో నేను చేసిన జాను పాత్ర మోడ్రన్‌గా ఉంటుంది'' అని హీరోయిన్ గౌరి జి. కిషన్ అన్నారు. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో సంతోష్ శోభన్, గౌరి జి. కిషన్ జంటగా రూపొందిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుష్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గౌరి జి. కిషన్ మాట్లాడుతూ– ''నేను నటిని కావాలనుకోలేదు. జర్నలిస్ట్ అవుదామనుకున్నా. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు తమిళ మూవీ '96' ఆడిషన్స్‌కి వెళ్లి సెలక్ట్ అయ్యాను. తెలుగులో నా తొలి చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. 'ఏమాయ చేసావె' టైమ్‌లో సమంత ఎలా ఉన్నారో ఇప్పుడు నేను అలా ఉన్నానని చాలామంది అన్నారు. ఆమెలా నాకూ అన్ని భాషల్లో నటించాలనుంది. ఇండస్ట్రీలో మహిళా రచయితలు తక్కువగా ఉన్నారు.. ఎక్కువమంది రావాలి. నేను కూడా రాయడానికి ప్రయత్నం చేస్తున్నాను'' అన్నారు.

హాలీవుడ్ నటి రాక్వెల్ వెల్చ్ కన్నుమూత



కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ హాలీవుడ్ నటి రాక్వెల్ వెల్చ్ (82) తుది శ్వాస విడిచారు. అమెరికాలోని ఇల్లినాయిస్ స్టేట్ చికాగోలో 1940 సెప్టెంబర్ 5న రాక్వెల్ వెల్చ్ జన్మించారు. ఆమె అసలు పేరు జో రాక్వెల్ టిజేడా. హైస్కూల్ చదువుతున్న రోజుల్లో 'ఫెయిరెస్ట్ ఆఫ్ ద ఫెయిర్'గా పేరు పొందారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, స్టేట్ కాలేజ్‌లో థియేటర్ ఆర్ట్స్‌లో చేరారు రాక్వెల్. 'ఎ హౌస్ ఈజ్ నాట్ ఎ హోమ్' (1964)లో చేసిన చిన్న పాత్ర ద్వారా ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. 1966లో వచ్చిన 'ఫెంటాస్టిక్ వాయేజ్'లో ఓ లీడ్ రోల్ చేసిన రాక్వెల్‌కు మంచి గుర్తింపు లభించింది. 1973లో 'ద త్రీ మస్కటీర్స్'కి ఆమెకు ఉత్తమ నటిగా 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు లభించింది. 1995లో 'ది ఎంపైర్' మ్యాగజీన్ ప్రచురించిన '100 సెక్సియస్ట్ స్టార్స్ ఆఫ్ ట్వంటీయత్ సెంచరీ'లో ఒకరిగా, మరో మ్యాగజీన్ 'ప్లే బాయ్' లిస్ట్‌లో మూడో స్థానంలో నిలిచారామె. రాక్వెల్ చివరి చిత్రం 'హౌ టు బి ఏ లాటిన్ లవర్' (2017). ఇక 1959లో జేమ్స్ వెల్చ్‌ను పెళ్లాడారామె. వీరికి ఇద్దరు సంతానం. వెల్చ్ నుంచి విడిపోయాక దాదాపు మూడు పెళ్లిళ్లు చేసుకున్నప్పటికీ ఆయన 'ఇంటి పేరు'తోనే కొనసాగారామె.

దరువెయ్ బాగా వచ్చింది

- సాయిరామ్ శంకర్



● సాయిరామ్ శంకర్, యాశా శివకుమార్

''వెయ్ దరువెయ్' టీజర్ ఆసక్తిగా ఉంది. ఈ సినిమా హిట్ కావాలి. సాయి అన్నకి, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లకు మరిన్ని అవకాశాలు రావాలి'' అన్నారు హీరో సాయిధరమ్ తేజ్. సాయిరామ్ శంకర్, యాశా శివకుమార్ జంటగా నవీన్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెయ్ దరువెయ్'. దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ సినిమా మార్చిలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని సాయిధరమ్ రిలీజ్ చేశారు. సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''మా సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలకు విశేష స్పందన లభించింది. సినిమా బాగా వచ్చింది.. అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''సాయిరామ్, దేవరాజుగార్లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను'' అన్నారు నవీన్ రెడ్డి. ''సాయిరామ్‌గారి కెరీర్‌లో మరొక మంచి చిత్రం అవుతుంది'' అన్నారు దేవరాజ్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: ముత్యాల సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: జనగాని కార్తీక్, శ్రీపాల్ చొల్లేటి.



● తనీష్, బంటి, శ్రీరామ్

ప్రేమించు డూడ్

యువత మనస్తత్వం, వారి ఆలోచనాధోరణి ఎలా ఉన్నాయి? అనే కథాంశంతో రూపొందనున్న చిత్రం 'కేసీపీడీ' (కొంచెం చూసి ప్రేమించు డూడ్). గౌతం మన్నవ దర్శకత్వంలో కార్తీక్ రెడ్డి, వరుణ్ దగ్గుబాటి నిర్మించనున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ''రొమాంటిక్ కామెడీ జానర్ సినిమా ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తనీష్ అల్లాడి, శ్రీరామ్ రెడ్డి, ద్వారక వీడీఎస్ (బంటి), సుభశ్రీ రాయగురు, ప్రియాంక పాసల, దివ్య దిల్వోకర్ నటించనున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీకరబాబు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
17-2-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	44	61,320
నిఫ్టీ ▲	20	18,135

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్‌	11,972	▽	99
డోజోన్స్‌	33,937	▽	192
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,013	▲	15
డాక్స్‌	15,534	▲	27
షాంఘై	3,249	▽	31
నికాయ్‌	27,696	▽	195

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్‌)	56,428	▽	50
బంగారం (22 క్యారట్‌)	56,202	▽	50
వెండి (కిలో)	65,389	▽	22

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	81.15	83.72
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	86.28	91.02
€	యూరో	ఎస్‌బీఐ	98.81	101.63
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	60.65	62.63
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	56.81	57.90
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	59.34	62.45
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.62	23.42
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.95	13.02

వెబ్‌సైట్ల నిర్వహణ తప్పనిసరి

బ్రోకర్లు, డిపాజిటరీలకు సెబీ ఆదేశాలు

న్యూఢిల్లీ: పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ క్యాపిటల్‌ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా స్టాక్‌ బ్రోకర్లు, డిపాజిటరీలకు వెబ్‌సైట్ల నిర్వహణను తప్పనిసరి చేసింది. తద్వారా స్టాక్‌ బ్రోకర్లు(ఎస్‌బీలు), డిపాజిటరీ పార్టిసిపెంట్లు(డీపీలు) చేపట్టే వివిధ లావాదేవీ(యాక్టివిటీ)ల సమాచారం ఇన్వెస్టర్లకు పారదర్శకంగా అందుబాటులోకి రానుంది. ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో సంబంధిత వెబ్‌సైట్లను ఎస్‌బీ, డీపీలు తప్పనిసరిగా నిర్వహించవలసి ఉంటుంది.



వెరసి ఇన్వెస్టర్లకు ఉత్తమ సర్వీసులు అందించేందుకు వీలుంటుంది. ఆయా వెబ్‌సైట్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ నంబర్, రిజిస్టరైన చిరునామా, ప్రధాన కేంద్రం, బ్రాంచీలు, కాంటాక్టుకు వీలయ్యే పేర్లు, ఈమెయిల్‌ ఐడీలు తదితర ప్రాథమిక సమాచారంతోపాటు కీలక యాజమాన్యం, కంప్లయెన్స్‌ అధికారుల వివరాలు సైతం పొందుపరచవలసి ఉంటుందని తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. తాజా మార్గదర్శకాలు ఆగస్ట్‌ 16 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలియజేసింది. ఈ సర్క్యులర్‌ అమల్లోకి వచ్చిన వారంలోగా ఎస్‌బీలు, డీపీలు వెబ్‌సైట్‌ యూఆర్‌ఎల్‌(లింక్‌)ను స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు నివేదించవలసి ఉంటుందని సర్క్యులర్‌లో సెబీ స్పష్టం చేసింది. యూఆర్‌ఎల్‌లో సవరణలు చేపడితే మూడు రోజుల్లోగా తెలియజేయవలసి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

17-2-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్‌ ధర (డజను)	66.00
16-2-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	389-00
వరంగల్‌	391-00
రిటైల్‌ ధర	4.45

బ్యాంకింగ్‌ వడ్డీ రేట్లు ప్రియం

జాబితాలో బీఓబీ, ఐఓబీ

ముంబై: వడ్డీ రేటు పెంపు జాబితాలో తాజాగా ప్రభుత్వ రంగంలోని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా (బీఓబీ), ఇండియన్‌ ఓవర్‌సీస్‌ బ్యాంక్‌ (ఐఓబీ) చేరాయి. ఈ నెల మొదట్లో ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు–రెపోను పావుశాతం పెంచడం (6.5 శాతానికి) దీనికి నేపథ్యం. ఎస్‌బీఐ బుధవారం రేట్ల పెంపు నేపథ్యంలో తాజాగా ఈ జాబితాలో బీఓబీ, ఐఓబీలు చేరడం గమనార్హం.





బీఓబీ: నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు– ఎంసీఎల్‌ఆర్‌ను అన్ని కాల వ్యవధులపై 5 బేసిస్‌ పాయింట్లు (100 బేసిస్‌ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఫిబ్రవరి 12 నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుందని పేర్కొంది. తాజా పెంపు నేపథ్యంలో ఏడాది రేటు 8.55 శాతానికి, ఓవర్‌నైట్, నెల, మూడు నెలా రేట్లు వరుసగా 7.9 శాతం, 8.2 శాతం, 8.3 శాతానికి చేరాయి.



ఐఓబీ: అన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ 15 బేసిస్‌ పాయింట్ల వరకూ పెరిగింది. ఏడాది ఎంసీఎల్‌ఆర్‌ 0.15 శాతం పెరిగి 8.45కు చేరింది. నెల, మూడు, ఆరు నెలల రేట్లుసైతం ఇదే స్థాయిలో పెరిగి వరుసగా 7.9 శాతం, 8.2 శాతం, 8.35 శాతాలకు చేరాయి. ఓవర్‌నైట్, రెండేళ్ల, మూడేళ్ల రేట్లు 10 బేసిస్‌ పాయింట్లు పెరిగాయి.

ఎస్‌బీఐ డిపాజిటర్లకు తీపికబురు



రుణ రేటును బుధవారం 10 బేసిస్‌ పాయింట్లు పెంచిన బ్యాంకింగ్‌ దిగ్గజం– స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) డిపాజిట్‌ రేట్లను కూడా గురువారం 5 నుంచి 25 బేసిస్‌ పాయింట్ల శ్రేణిలో పెంచింది. తాజా పెంపు నేపథ్యంలో ఐదేళ్ల డిపాజిట్లపై సీనియర్‌ సిటిజన్లు 8.5 శాతం వడ్డీ రేటు పొందుతారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు డిపాజిట్లపై 6.8 శాతం వడ్డీ లభిస్తుంది. రెండేళ్ల నుంచి మూడేళ్ల మధ్య రేటు పావు శాతం పెరిగి 7 శాతానికి చేరింది. మూడేళ్ల పైబడిన డిపాజిట్లపై రేటు కూడా పావుశాతం పెరిగి 6.5 శాతానికి చేరింది.

నెస్లే డివిడెండ్‌ రూ. 75

క్యూ4లో నికర లాభం హైజంప్‌



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా గత కేలండర్‌ ఏడాది(2022) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్‌–డిసెంబర్‌(క్యూ4)లో నికర లాభం 66 శాతం దూసుకెళ్లి రూ. 628 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2021) ఇదే కాలంలో కేవలం రూ. 379 కోట్లు ఆర్జించింది. కంపెనీ జనవరి–డిసెంబర్‌ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 75 చొప్పున తుది డివిడెండును ప్రకటించింది. పూర్తిఏడాదికి నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,391 కోట్లకు చేరింది. నికర అమ్మకాలు 14 శాతం అధికమై రూ. 16,789 కోట్లను తాకాయి. క్యూ4లో నెస్లే నికర అమ్మకాలు 14 శాతం ఎగసి రూ. 4,233 కోట్లను దాటాయి. మొత్తం వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 3,427 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం బలపడి రూ. 19,562 వద్ద ముగిసింది.

క్రూడ్‌ ఆయిల్‌ ఎగుమతులపై 'విండ్‌ఫాల్‌' తగ్గింపు

- డీజిల్, ఏటీఎఫ్‌లపై కనిష్ట స్థాయికి
- అంతర్జాతీయంగా ధరలు తగ్గిన నేపథ్యం



న్యూఢిల్లీ: డీజిల్, జెట్‌ ఫ్యూయల్‌ (ఏటీఎఫ్‌) ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్‌ ప్రాఫిట్‌ ట్యాక్స్‌ను వాటి కనిష్ఠ స్థాయికి తగ్గించింది. దేశీయంగా ఉత్పత్తి చేసిన ముడి చమురు ఎగుమతులపై కూడా పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా ధరలు దిగిరావడం దీనికి నేపథ్యం. చమురు సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) వంటి కంపెనీలు ఉత్పత్తి చేసే ముడి చమురుపై పన్ను టన్నుకు రూ.5,050 నుండి రూ.4,350కి తగ్గించినట్లు కేంద్రం ఉత్తర్వుల్లో తెలిపింది. డీజిల్‌ ఎగుమతిపై లీటర్‌కు రూ.7.5 నుంచి రూ.2.5కి, అలాగే ఏటీఎఫ్‌పై లీటర్‌కు రూ.6 నుంచి రూ.1.50కి పన్ను తగ్గించింది. గత ఏడాది జూలై ఈ పన్ను వ్యవస్థను ప్రారంభించిన తర్వాత డీజిల్‌పై ఈ రేటు ఈ స్థాయికి తగ్గడం ఇదే తొలిసారికాగా, ఏటీఎఫ్‌ విషయంలో డిసెంబర్‌ తర్వాత రెండవసారి. భారత్‌ 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్‌ ప్రాఫిట్‌ ట్యాక్స్‌ విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా అంతర్జాతీయంగా ధరలు పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది.

సూచీలకు స్వల్ప లాభాలు

ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్‌

ముంబై: ట్రేడింగ్‌ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్‌ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 486 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్‌ చివరికి 44 పాయింట్ల లాభంతో 61,320 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 136 పాయింట్ల రేంజ్‌ కదలాడింది. ఆఖరికి 20 పాయింట్లు బలపడి 18,135 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా మూడోరోజూ లాభాల ముగింపు. ఉదయం ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు ఇంట్రాడేలో భారీ ఊగిసలాటకు లోనయ్యాయి. ఆఖరి గంటలో లార్జ్‌ క్యాప్‌ షేర్లలో తలెత్తిన అమ్మకాలు ఆరంభ లాభాలను హరించివేశాయి. వీక్లీ ఇండెక్స్‌ ఆప్షన్స్‌ ఎక్స్‌పైరీ కావడంతో బ్యాంకింగ్, ఫైనాన్స్‌ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో ఐటీ, మెటల్, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్‌ సూచీలు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి. రూపాయి విలువ ఎనిమిది పైసలు బలపడి 82.72 వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- అంతర్జాతీయంగా దిగివచ్చిన క్రూడ్‌ ఆయిల్‌ ధరలకు అనుగుణంగా కేంద్రం విండ్‌ఫాల్‌ పన్నును తగ్గించింది. ఈ అంశం దేశీయ ఆయిల్‌ మార్కెటింగ్‌ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. ఓఎన్‌జీసీ 5.66%, ఆయిల్‌ ఇండియా అయిదు శాతం చొప్పున లాభపడ్డాయి.
- నాన్‌ బ్యాంకింగ్‌ ఆర్థిక సేవల సంస్థ అక్మే ఫిన్‌ట్రేడ్‌ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. పబ్లిక్‌ ఇష్యూలో భాగంగా కంపెనీ 1.1 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. గ్రేటెక్స్‌ కార్పొరేట్‌ సర్వీసెస్‌ లిమిడ్‌ ఈ ఇష్యూకు బుక్‌ రన్నింగ్‌ మేనేజర్‌గా వ్యవహరించనుంది.

యూపీఐతో హెచ్‌డీఎఫ్‌సీ రూపే క్రెడిట్‌ కార్డుల అనుసంధానం



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ రూపే క్రెడిట్‌ కార్డులను యూపీఐతో అనుసంధానం చేసుకునే సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఇంతకుముందు వరకు యూపీఐకి కేవలం బ్యాంక్‌ సేవింగ్స్‌ ఖాతాలను లింక్‌ చేసుకుని చెల్లింపులు చేసుకోవాల్సి వచ్చేది. ఆర్‌బీఐ క్రెడిట్‌ కార్డుల లింకింగ్‌ కూడా అనుమతించడంతో పరిశ్రమలో ఈ మేరకు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ''ఇక నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ రూపే క్రెడిట్‌ కార్డులను ప్రముఖ యూపీఐ ప్లాట్‌ఫామ్‌లపై అనుసంధానించుకుని, వినియోగించుకోవచ్చు'' అని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ప్రకటించింది. ఈ నిర్ణయంతో కస్టమర్లకు డిజిటల్‌ చెల్లింపులు మరింత సౌకర్యవంతంగా మారతాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ పేమెంట్స్‌ విభాగం హెడ్‌ పరాగ్‌రావు తెలిపారు. యూపీఐపై రూపే క్రెడిట్‌ కార్డ్‌ అనుసంధానం నిజంగా పరిశ్రమ రూపురేఖలను మారుస్తుందని భావిస్తున్నట్లు నేషనల్‌ పేమెంట్స్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఎన్‌పీసీఐ) సీఓఓ ప్రవీణ్‌ రాయ్‌ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అదానీ పవర్‌–డీబీ పవర్‌ డీల్‌ వెనక్కి..

సంతకాలు చేయకుండానే ముగిసిన ఒప్పంద గడువు



న్యూఢిల్లీ: డీబీ పవర్‌కి చెందిన బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి ప్లాంట్లను అదానీ పవర్‌ కొనుగోలు చేయడానికి సంబంధించిన రూ. 7,017 కోట్ల డీల్‌ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఒప్పందంపై సంతకాలు చేయకుండానే .. లావాదేవీకి నిర్దేశించుకున్న గడువు తీరిపోవడం ఇందుకు కారణం. 2022 ఆగస్టు 18 నాటి అవగాహన ఒప్పందం గడువు తీరిపోయిందని స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు అదానీ పవర్‌ తెలిపింది. తేదీలను పొడిగించారా లేక ఒప్పందంపై మళ్లీ చర్చలు జరుపుతున్నారా వంటి వివరాలేమీ వెల్లడించలేదు. గడువు తేదీ ముగియడంతో ప్రస్తుతానికి ఈ డీల్‌ను పక్కన పెట్టినట్లే భావించాల్సి ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రాథమికంగా గతేడాది ఎంవోయూ కుదుర్చుకున్న తర్వాత తుది గడువు నాలుగు సార్లు పొడిగించారు. నాలుగో గడువు ఫిబ్రవరి 15తో ముగిసింది. ఖాతాలు, షేర్ల ధరల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్‌ రీసెర్చ్‌ చేసిన ఆరోపణలు, పరిణామాలు దీనికి నేపథ్యం.

సాక్షి స్పోర్ట్స్‌



క్వార్టర్‌ ఫైనల్లో భారత్‌

దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా మిక్స్‌డ్‌ టీమ్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌లో భారత్‌ జోరు కొనసాగుతోంది. గ్రూప్‌ 'బి'లో భారత జట్టు వరుసగా మూడో విజయం సాధించి క్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన చివరి లీగ్‌ మ్యాచ్‌లో 4–1తో మలేసియాను భారత్‌ ఓడించింది. మహిళల సింగిల్స్‌లో సింధు 21–13, 21–17తో వాంగ్‌ లింగ్‌ చింగ్‌పై, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌.ఎస్‌.ప్రణయ్‌ 18–21, 21–13, 25–23తో లీ జి జియాపై నెగ్గారు. పురుషుల డబుల్స్‌లో ధ్రువ్‌ కపిల–చిరాగ్‌ షెట్టి 16–21, 10–21తో అరోన్‌ చియా–సో వూయి యిక్‌ల చేతిలో ఓడగా, మహిళల డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా జాలీ 23–21, 21–15తో పియర్లీ టన్‌–తినా మురళీధరన్‌లపై, మిక్స్‌డ్‌ డబుల్స్‌లో ఇషాన్‌ భట్నాగర్‌–తనిషా క్రాస్టో 21–19, 19–21, 21–16తో చెన్‌ తంగ్‌ జి–తొ ఇ వీపై గెలుపొందారు. నేడు జరిగే క్వార్టర్‌ ఫైనల్లో హాంకాంగ్‌తో భారత్‌ తలపడుతుంది.

మళ్లీ స్పిన్‌ మంత్రం

- నేటి నుంచి ఆసీస్‌తో రెండో టెస్టు
- జోరు మీదున్న టీమిండియా
- ఒత్తిడిలో కంగారూ జట్టు

ఉదయం 9.30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్‌'లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: మరోసారి స్పిన్‌ ప్రభావం ఉంటుందా...తొలి మ్యాచ్‌ మూడు రోజుల్లోనే ముగిస్తే ఇది ఎన్ని రోజులు సాగుతుంది... ఆసీస్‌ మన స్టార్లు అశ్విన్, జడేజాలను ఎదుర్కోగలదా...అసలు ఆ జట్టు పోరాడగలదా...టీమిండియా తిరుగులేని ప్రదర్శనతో ఆధిపత్యం ప్రదర్శిస్తుందా... ఇలాంటి ఆలోచనలు, అంచనాల మధ్య రెండో టెస్టుకు రంగం సిద్ధమైంది. ఆస్ట్రేలియాకు పెను సవాల్‌ విసిరేందుకు మరో స్పిన్‌ వికెట్‌ స్వాగతం పలుకుతోంది. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో టాప్‌–2 జట్లయిన ఆసీస్, భారత్‌ల మధ్య నేటి నుంచి ఢిల్లీ కోటలో రెండో టెస్టు జరుగుతుంది. ఈ 'బోర్డర్‌–గావస్కర్‌ ట్రోఫీ'లో భారత్‌ తొలి టెస్టు గెలిచి 1–0తో పైచేయి సాధించింది. మరోవైపు మేటి జట్టు ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ వంద ఓవర్లయినా ఎదుర్కోలేకపోవడం జట్టు స్థైర్యాన్ని దెబ్బతీసింది. ఇప్పుడు సిరీస్‌లో పుంజుకోవాలంటే ఈ మ్యాచ్‌లో భారత బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కోవాల్సిందే!

ఉత్సాహంగా భారత్‌

సిరీస్‌లో శుభారంభం చేసిన భారత్‌ ఇప్పుడు ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్‌లో రోహిత్‌ ఫామ్‌లో ఉండగా, వందో టెస్టు ఆడనున్న చతేశ్వర్‌ పుజారా దీన్ని చిరస్మరణీయం చేసుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. గత టెస్టులో పుజారా, కోహ్లి విఫలమయ్యారు. కానీ తన సొంతగడ్డయిన ఢిల్లీపై కోహ్లి చెలరేగడం ఖాయం. శ్రేయస్‌ అయ్యర్‌ ఫిట్‌నెస్‌ సాధించడంతో సూర్యకుమార్‌ బెంచ్‌కే పరిమితమవుతాడు. ఆల్‌రౌండ్‌ ప్రదర్శనతో అదరగొట్టిన రవీంద్ర జడేజాతో పాటు శ్రీకర్‌ భరత్, అక్షర్‌ పటేల్‌ వరకు అంటే తొమ్మిదో వరుస వరకు బ్యాటింగ్‌ చేసే సామర్థ్యం ఉండటం కచ్చితంగా అదనపు బలం కాగలదు. అశ్విన్‌కు ఢిల్లీ అచ్చొచ్చిన పిచ్‌. ఇక్కడ నాలుగు టెస్టులాడిన అశ్విన్‌ ఏకంగా 27 వికెట్లు తీశాడు. జడేజా, అక్షర్‌ల స్పిన్‌ తప్పకుండా మ్యాచ్‌ను మలుపుతిప్పగలదు. కొన్ని గణాంకాలు భారత జట్టును ఊరిస్తున్నాయి. 1987 తర్వాత ఢిల్లీలో భారత్‌ పరాజయమే ఎరుగదు. చివరిసారిగా ఆ ఏడాది విండీస్‌ చేతిలో ఓడిన టీమిండియా తదనంతరం గెలవడం లేదంటే డ్రా చేసుకుంది కానీ... ఏ టెస్టులోనూ ఓడలేదు. 249 వికెట్లతో ఉన్న జడేజా ఒక్క వికెట్‌ తీస్తే 250 మార్క్‌ను అధిగమిస్తాడు.

పుంజుకోవడం ఎలా!

భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి స్పిన్‌ బూచిపై కంగారు పడిన ఆస్ట్రేలియా ప్రత్యేక కసరత్తులు చేసింది. వార్నర్, ఉస్మాన్‌ ఖాజా, లబుషేన్, స్మిత్‌ ఇలా మేటి బ్యాటర్స్‌ అంతా పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉన్నారు. కానీ ఆట దగ్గరకు వచ్చేసరికి వార్నర్‌ (1, 10), ఖాజా (1, 5)ల ఓపెనింగ్‌ అత్యంత పేలవంగా మొదలైంది. ఇది రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జట్టును చావుదెబ్బ తీసింది. ప్రత్యర్థి స్పిన్‌ అస్త్రాలకు మిడిలార్డర్‌ ఇంకాస్త బలహీనపడింది. ఢిల్లీ కూడా అలాంటి వికెటే కావడంతో ఆస్ట్రేలియా శిబిరంలో ఆందోళన పెరుగుతుంది. అనుభవజ్ఞుడైన స్మిత్, ఫామ్‌లో ఉన్న లబుషేన్‌ బాధ్యతగా ఆడితే బ్యాటింగ్‌లో జట్టు నిలబడేందుకు అస్కారం వుంటుంది. కమిన్స్, మర్ఫీ, లయన్, బోలండ్‌లతో కూడిన బౌలింగ్‌ దళం కూడా ఆతిథ్య బ్యాటర్లపై ప్రభావం చూపిస్తేనే ఈ మ్యాచ్‌లో పుంజుకుంటుంది.



పిచ్‌–వాతావరణం

అరుణ్‌ జైట్లీ స్టేడియం స్పిన్‌కు అనుకూలించేదే అయినా... ఆరంభంలో పేసర్లకు మంచి అవకాశం కల్పిస్తుంది. మ్యాచ్‌ సాగే కొద్దీ స్పిన్నర్లు ప్రమాదకరం కాగలరు. వర్షంతో ఏ ముప్పు లేకపోయినా... ఉత్తరాది నగరంలో చలి తీవ్రత కాస్త ఎక్కువే! డే మ్యాచ్‌ కాబట్టి సమస్య లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్‌: రోహిత్‌ (కెప్టెన్‌), రాహుల్, పుజారా, కోహ్లి, శ్రేయస్‌ అయ్యర్, జడేజా, శ్రీకర్‌ భరత్, అశ్విన్, అక్షర్, షమీ, సిరాజ్‌.

ఆస్ట్రేలియా: కమిన్స్‌ (కెప్టెన్‌), వార్నర్, ఉస్మాన్‌ ఖాజా, లబుషేన్, స్మిత్, హ్యాండ్స్‌కోంబ్, రెన్‌షా / కామెరాన్‌ గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, లయన్‌.

కుప్పకూలిన బెంగాల్‌

తొలి ఇన్నింగ్స్‌లో 174 ఆలౌట్‌ • సౌరాష్ట్రతో రంజీ ట్రోఫీ ఫైనల్‌



ఉనాద్కట్‌కు సహచరుల అభినందన

కోల్‌కతా: 34 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ సాధించాలని కలలుగంటున్న బెంగాల్‌ జట్టుకు సొంతగడ్డపై మొదటి రోజే దెబ్బ పడింది. సౌరాష్ట్రతో జరుగుతున్న ఫైనల్లో గురువారం బెంగాల్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 54.1 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. షహబాజ్‌ అహ్మద్‌ (112 బంతుల్లో 69; 11 ఫోర్లు), అభిషేక్‌ పోరెల్‌ (98 బంతుల్లో 50; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా, మిగతావారంతా విఫలమయ్యారు. సౌరాష్ట్ర పేస్‌ బౌలర్లు చేతన్‌ సకారియా (3/33), జైదేవ్‌ ఉనాద్కట్‌ (3/44) ధాటికి బెంగాల్‌ బెంబేలెత్తింది. 17 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన జట్టు ఒకదశలో 65/6 వద్ద నిలిచింది. అభిమన్యు ఈశ్వరన్‌ (0), సుదీప్‌ కుమార్‌ (0), సుమంత (1), కెప్టెన్‌ మనోజ్‌ తివారి (7), అనుస్తుప్‌ మజుందార్‌ (16) విఫలమయ్యారు. ఈ స్థితిలో షహబాజ్, అభిషేక్‌ ఆదుకున్నారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. ధర్మేంద్ర జడేజా, చిరాగ్‌ జాని చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 2 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. జే గోహిల్‌ (6), విశ్వరాజ్‌ జడేజా (25) అవుట్‌ కాగా... హార్విక్‌ దేశాయ్‌ (38 బ్యాటింగ్‌), చేతన్‌ సకారియా (2 బ్యాటింగ్‌) క్రీజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం సౌరాష్ట్ర మరో 93 పరుగులు వెనుకబడి ఉంది.

ఇంగ్లండ్‌ 325/9 డిక్లేర్డ్‌



బ్రూక్‌

మౌంట్‌ మాంగనీ: గత కొంతకాలంగా దూకుడైన ఆటతో టెస్టు క్రికెట్‌కు కొత్త పాఠాలు చెబుతున్న ఇంగ్లండ్‌ మరోసారి అదే తరహా ఆటతీరును ప్రదర్శించింది. న్యూజిలాండ్‌తో గురువారం మొదలైన తొలి టెస్టులో ఇంగ్లండ్‌ తమ తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్ల నష్టానికి 325 పరుగుల వద్ద డిక్లేర్‌ చేసింది. కేవలం 58.2 ఓవర్లు మాత్రమే ఆడిన ఆ జట్టు ఏకంగా ఓవర్‌కు 5.57 రన్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. వికెట్లు కోల్పోయే అవకాశం ఉన్నా... ఓపిగ్గా క్రీజ్‌లో నిలబడే ప్రయత్నం చేయకుండా ఇంగ్లండ్‌ బ్యాటర్లంతా ధాటిని కొనసాగించారు. హ్యారీ బ్రూక్‌ (81 బంతుల్లో 89; 15 ఫోర్లు, 1 సిక్స్‌), బెన్‌ డకెట్‌ (68 బంతుల్లో 84; 14 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా, ఒలి పోప్‌ (42), బెన్‌ ఫోక్స్‌ (38) రాణించారు. వాగ్నర్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్‌ 3 వికెట్లు కోల్పోయి 37 పరుగులు చేసింది. లాథమ్‌ (1), విలియమ్సన్‌ (6), నికోల్స్‌ (4) పెవిలియన్‌ చేరగా...కాన్వే (17 బ్యాటింగ్‌), వాగ్నర్‌ (4 బ్యాటింగ్‌) క్రీజ్‌లో ఉన్నారు. అండర్సన్‌ 2 వికెట్లు పడగొట్టాడు.


ఆస్ట్రేలియా 'హ్యాట్రిక్‌'

గెబెర్హా: మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన గ్రూప్‌ '1' మ్యాచ్‌లో ఆసీస్‌ 10 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. ముందుగా లంక 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 112 పరుగులకే పరిమితమైంది. హర్షిత (34)దే అత్యధిక స్కోరు. అనంతరం ఆసీస్‌ 15.5 ఓవర్లలో వికెట్‌ కోల్పోకుండా 113 పరుగులు చేసింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' అలీసా హీలీ (43 బంతుల్లో 54 నాటౌట్‌; 6 ఫోర్లు, 1 సిక్స్‌), బెత్‌ మూనీ (53 బంతుల్లో 56 నాటౌట్‌; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

పాక్‌ను గెలిపించిన మునీబా...



కేప్‌టౌన్‌: గ్రూప్‌ '2'లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్‌ 70 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. ముందుగా పాక్‌ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' మునీబా అలీ (68 బంతుల్లో 102 నాటౌట్‌; 14 ఫోర్లు) పాక్‌ తరఫున అంతర్జాతీయ టి20ల్లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. అనంతరం ఐర్లాండ్‌ 16.3 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది.



ఫుట్‌బాల్‌ దిగ్గజం బలరాం కన్నుమూత

కోల్‌కతా: రెండు సార్లు ఒలింపిక్స్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన, ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టులో సభ్యుడైన అలనాటి ఫుట్‌బాల్‌ దిగ్గజం తులసీదాస్‌ బలరాం గురువారం కన్నుమూశారు. 87 ఏళ్ల బలరాం సుదీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమిళ కుటుంబానికి చెందిన బలరాం 1936లో సికింద్రాబాద్‌లోని అమ్ముగూడలో జన్మించారు. ఇక్కడే ఫుట్‌బాల్‌లో ఓనమాలు నేర్చుకున్న ఆయన సంతోష్‌ ట్రోఫీలో హైదరాబాద్‌ జట్టు తరఫున ఆడారు. సెంటర్‌ ఫార్వర్డ్‌గా సత్తా చాటిన బలరాం అంతర్జాతీయ కెరీర్‌ 1955–1963 మధ్య ఏడేళ్ల పాటు గొప్పగా సాగింది. అదే సమయంలోనే 1956 మెల్‌బోర్న్, 1960 రోమ్‌ ఒలింపిక్స్‌లలో ఆయన భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఒలింపిక్స్‌కు ఆడిన సమయంలో బలరాం హైదరాబాద్‌ ఆటగాడిగానే ఉన్నారు. 36 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 10 గోల్స్‌ సాధించిన ఆయన 1962 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్‌ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించారు. ఒక దశలో 'హోలీ ట్రినిటీ' అంటూ కితాబులందుకున్న చుని గోస్వామి, పీకే బెనర్జీ, బలరాం త్రయం భారత ఫుట్‌బాల్‌కు అద్భుత విజయాలు అందించింది. ట్యూబర్‌ క్యులోసిస్‌ కారణంగా 27 ఏళ్ల వయసుకే దురదృష్టవశాత్తూ ఆయన కెరీర్‌ ముగిసింది. ఆటకు గుడ్‌బై చెప్పిన తర్వాత చాలా ఏళ్ల క్రితమే బలరాం కోల్‌కతాకు వెళ్లిపోయి స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. అక్కడే కోచ్‌గా కూడా తన సేవలందించారు.

కెప్టెన్లుగా హోప్, పావెల్‌

కింగ్‌స్టన్‌: వన్డే, టి20 జట్ల కోసం కొత్త కెప్టెన్లను వెస్టిండీస్‌ క్రికెట్‌ బోర్డు ప్రకటించింది. వన్డే జట్టుకు షై హోప్, టి20 టీమ్‌కు రావ్‌మన్‌ పావెల్‌ సారథులుగా వ్యవహరిస్తారు. ఈ రెండు ఫార్మాట్‌లలో ఇప్పటి వరకు కెప్టెన్‌గా ఉన్న నికోలస్‌ పూరన్‌ రాజీనామా చేయడంతో ఈ ఎంపిక అనివార్యమైంది. విండీస్‌ దేశవాళీ క్రికెట్‌లో కెప్టెన్లుగా వీరిద్దరు మంచి ఫలితాలు సాధించారు. ఫిబ్రవరి 28నుంచి జరిగే దక్షిణాఫ్రికా పర్యటన వీరిద్దరికి కెప్టెన్లుగా తొలి సిరీస్‌ కానుంది.

క్లుప్తంగా...

శ్రీశైల మల్లన్నకు పుష్పపల్లకీ సేవ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో గురువారం భ్రమరాంబసమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీపై ఊరేగారు. పల్లకీని పలు రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను తోడ్కొనివచ్చి పుష్పపల్లకీలో ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు.

దాసరి ప్రసాదరావుకు జీవన సాఫల్య పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణులు, నిమ్స్ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ దాసరి ప్రసాదరావు ప్రతిష్టాత్మక జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వ్యాధుల శస్త్ర చికిత్సలో అత్యుత్తమ సేవలకుగాను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియో వాస్క్యులర్ సర్జన్స్ ఈ అవార్డును అందించింది. ఈ మేరకు కోయంబత్తూరులో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ సర్జన్స్ (హార్ట్ సర్జన్స్ ఆఫ్ ఇండియా) 69వ వార్షిక సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేశారు. తమిళనాడు వైద్యారోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జైలసింగ్ మెహర్వాల్, అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సి.ఎస్.హిరేమత్ ఇతర ప్రముఖులు పాల్గొని డాక్టర్ ప్రసాదరావు సేవలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలో కుల, వర్గ, మత, ప్రాంతాలకు అతీతంగా పేద ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. డాక్టర్ ప్రసాదరావు కరోనరీ బైపాస్ సర్జరీ, హార్ట్ వాల్వ్ సర్జరీ, ఇతర గుండె ఆపరేషన్‌లలో చేయితిరిగిన వైద్యుడిగా, పలువురి ప్రాణదాతగా మన్ననలు అందుకున్నారు. డైరెక్టర్‌గా హైదరాబాద్ నిమ్స్‌లో అధునాతన సౌకర్యాలు సమకూర్చారు. బీబీనగర్ నిమ్స్ యూనివర్సిటీ కోసం స్థలం సేకరించడంలో ఆయనది క్రియాశీలక పాత్ర. అనేక అవార్డులతో పాటు 2001లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

సునీల్ బెయిల్ పిటిషన్‌లో వాదనలు 27కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏ2గా ఉన్న వై.సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌లో వాదనలను హైకోర్టు ఈ నెల 27కు వాయిదా వేసింది. వివేకా హత్య కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, బెయిల్ మంజూరు చేయాలని సునీల్ హైకోర్టులో ఈ నెల 6న బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 16వ తేదీ గురువారం కాణిపాకంలో సోదరుడి సంస్మరణ కార్యక్రమానికి వెళ్లేందుకు అనుమతించాలని కోరారు. బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ సుమలత ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు. కాగా, ఈ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సునీల్‌యాదవ్‌కు బెయిల్ ఇవ్వవద్దని విజ్ఞప్తి చేస్తూ వివేకా కూతురు సునీతారెడ్డి, భార్య సౌభాగ్యమ్మ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

కొత్తగా 6 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 4012 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఆరుగురు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ఇద్దరు కోలుకోగా, ఇప్పటివరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 31 మంది ఐసోలేషన్‌లో ఉన్నారు.

ఏ'డీ'?

'డీ' మన శరీరంలో ఉండాల్సిన ముఖ్యమైన విటమిన్లలో ఒకటి. ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైన కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ఇతర పోషకాలను శరీరం గ్రహించడంలో విటమిన్ డీ కీలక పాత్ర పోషిస్తుంది. మన ఎముకలలో 99% ఉన్న కాల్షియంను పునరుద్ధరించడానికి, సరిగా నిర్వహించడానికి సహాయపడుతుంది. కండరాల కదలికకు, మెదడు.. నరాల అనుసంధానానికి దోహదపడుతుంది. అంటువ్యాధులు, క్యాన్సర్, హృదయ, శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం, చిత్తవైకల్యం వంటి వ్యాధుల బారిన పడకుండా కూడా తోడ్పడుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇక రోగనిరోధక వ్యవస్థ సక్రమ పనితీరుకు ఇది చాలా ముఖ్యమైనది. కరోనా కాలంలో ఇతరత్రా ఔషధాలతో పాటు డీ విటమిన్‌ను వైద్యులు సిఫారసు చేయడం గమనార్హం. ఇంతటి కీలకమైన విటమిన్ 'డీ'లోపం హైదరాబాద్ నగరవాసుల్లో తీవ్ర స్థాయిలో ఉందని టాటా ఐఎంజీ లాబ్స్ అధ్యయనం వెల్లడించింది. దాదాపు 75 శాతానికి పైగా ప్రజలు విటమిన్ డీ లోపంతో బాధపడుతున్న నగరాల్లో హైదరాబాద్ కూడా ఒకటని తేల్చింది. హైదరాబాద్‌లో 76% మంది ప్రజలు 'డీ' విటమిన్ లోపంతో బాధపడుతున్నారని తెలిపింది.

- సాక్షి, హైదరాబాద్



హైదరాబాద్‌లో 76% మందిలో విటమిన్ డీ లోపం	బాధితుల్లో ఎక్కువ మంది నగరాల్లో నివసించేవారే..

యువతలో ఎక్కువగా ఉందని తేల్చిన అధ్యయనం



- శరీరానికి తగినంత సూర్యరశ్మి సోకకపోవడమే కారణం
- కరోనా తర్వాత మరిన్ని ఎక్కువ కేసులు నమోదు
- ఆరోగ్య పరిరక్షణలో విటమిన్ డీ కీలకపాత్ర
- కండరాల కదలికకు, మెదడు.. నరాల అనుసంధానానికి దోహదం
- ఎముకల పుష్టికి, రోగనిరోధక వ్యవస్థ సక్రమ పనితీరుకు ముఖ్యం

నగరాల్లో.. యువతలో..

అధ్యయనం ప్రకారం.. వదోదర (89%), సూరత్ (88%) అహ్మదాబాద్ (85%) నగరాలకు చెందిన ప్రజలు అత్యధికుల్లో విటమిన్ డీ లోపం ఉంది. అంతేకాదు పెద్దవారితో పోలిస్తే యువతలో ఈ లోపం ఎక్కువగా ఉంది. 25 ఏళ్లలోపు వారు 84% మందిలో, 25-40 ఏళ్ల మధ్య వయస్కుల్లో 81% మందిలో 'డీ' విటమిన్ సరిగా లేదని అధ్యయనం తేల్చింది. నేటి తరం పిల్లలు, యువకులు ఎండ తగలకుండా ఎక్కువ సమయం ఇళ్లు, కార్యాలయాల్లోపలే గడుపుతుండడం, సరైన ఆహార నియమాలు పాటించక పోవడమే ఇందుకు కారణమని ఆరోగ్యరంగ నిపుణులు చెబుతున్నారు. నగరాల్లో అత్యధికులు కరోనా కారణంగా చాలా కాలం పాటు నాలుగ్గోడల మధ్యే గడిపారు. అంటే విటమిన్ డీ లోపానికి పరోక్షంగా కరోనా కూడా కారణమైంది. ఇటీవల పెద్ద సంఖ్యలో యువకులు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, నిస్సత్తువతో ఆసుపత్రులకు వస్తున్నారని, వీరిలో ఎక్కువమంది అవుట్ డోర్ యాక్టివిటీ తగ్గిపోయినవారేనని వైద్య నిపుణులు చెబుతుండటం గమనార్హం. విటమిన్ డీ లోపం వల్ల శరీరంలో కాల్షియం స్థాయిలు తగ్గిపోయి బోలు ఎముకల వ్యాధికి లేదా ఆస్టియోపోరోసిస్‌కు దారి తీస్తోందని, ఇది ఇటీవలి సంవత్సరాలలో వయసులకు అతీతంగా కనిపిస్తోందని పేర్కొంటున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు, జీవనశైలి వ్యాధుల భారాన్ని విటమిన్ డీ లోపం రెట్టింపు జేస్తుందని వివరిస్తున్నారు. కీళ్ల నొప్పులకు, రక్తంలో చక్కెర శాతం పెరగడానికి కూడా కారణమవుతోందని అంటున్నారు.

సహజసిద్ధంగానే భర్తీ చేసుకోవాలి

వీలైనంత వరకు సహజమైన పద్ధతుల్లోనే విటమిన్ డీ లోటును భర్తీ చేసుకోవాలి. కాల్షియం, విటమిన్లు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సమస్య పరిష్కారం కాకపోతే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

– డా.గౌరీశంకర్ బూపనపల్లి, మెడికల్ డైరెక్టర్ ఎస్ఎల్‌జీ ఆసుపత్రి, హైదరాబాద్

ఇంకెలా పొందగలం?

కొన్ని రకాల ఆహార ఉత్పత్తుల ద్వారా స్వల్పంగా విటమిన్ డీని పొందవచ్చు. పాలకూర వంటి ఆకుకూరలు, సోయా బీన్స్, వైట్ బీన్స్, సాల్మన్, రెయిన్‌బో వంటి కొవ్వుతో కూడిన చేపలు, నారింజ రసం, ఓట్ మీల్ వంటి వాటితో విటమిన్ డీ లభిస్తుంది. అలాగే విటమిన్ డీలో కీలకమైన డీ3, డీ2లు సప్లిమెంట్స్ (టాబ్లెట్లు) రూపంలో కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ రెండూ విటమిన్ డీ లోపాన్ని సరిచేయడంలో సహాయపడతాయి, అయితే ప్రభావంతంగా పని చేస్తుందని వైద్యులు ఎక్కువగా డీ3ని సిఫారసు చేస్తారు

రెండు దశల జీవ రసాయన ప్రక్రియ కీలకం

సూర్యరశ్మి లేదా సప్లిమెంట్ నుంచి విటమిన్ డీని పొందిన తర్వాత దానిని క్రియాశీల విటమిన్ డీగా మార్చడానికి రెండు దశల జీవ రసాయన ప్రక్రియ దోహదపడుతుంది. ఇది కాలేయం నుంచి మొదలై మూత్రపిండాల్లో ముగుస్తుంది. మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు అడ్వాన్స్ దశలో ఉన్న వారు ఇది గమనంలో ఉంచుకోవాలి. శరీరం విటమిన్ డీని సరిగా సంగ్రహించలేనప్పుడు దాని లోపం ఏర్పడుతుంది. తగినంత విటమిన్ డీ లేకపోతే శరీరం ఆహారం నుంచి కాల్షియంను గ్రహించదు. సగటు ఆరోగ్యవంతమైన వ్యక్తి ఎముకల నుంచి ప్రతిరోజూ 500 మిల్లీగ్రాముల కాల్షియంను కోల్పోతాడు అదే మొత్తాన్ని డీ విటమిన్ ద్వారా ఉత్పత్తి చేసుకున్న కాల్షియంతో భర్తీ చేసుకుంటాడు. విటమిన్ డీ లోపం ఉన్నప్పుడు కాల్షియం తగినంతగా భర్తీ కాదు. ఇది ఎముకలు బలహీనంగా, పెళుసుగా మారడానికి దారితీస్తుంది.

ఉదయపు ఎండను వదలొద్దు



ఒకప్పటిలా పిల్లలు వీధుల్లో ఆడుకోవడం బాగా తగ్గిపోయింది. యువకులు, మధ్య వయస్కుల్లో అత్యధికులకు కూడా సూర్యకాంతి సోకడం లేదు. పిల్లలు, యువకులు రాత్రి పొద్దుపోయేవరకూ టీవీ, మొబైల్ స్క్రీన్‌లకు అతుక్కుపోతూ ఉదయం ఆలస్యంగా మేల్కొంటున్నారు. తద్వారా విటమిన్ డీని సహజసిద్ధంగా, పుష్కలంగా పొందేందుకు అనువైన సమయాన్ని కోల్పోతున్నారు. ఉదయం 10 గంటల లోపు శరీరంలో కనీసం 80 శాతమైనా దుస్తుల్లేకుండా సూర్యకాంతి నేరుగా శరీరానికి సోకేలా గడిపితే అవసరమైన డీ విటమిన్ లభిస్తుంది. సూర్యరశ్మి తగినంత సేపు సోకిన తర్వాత చర్మం విటమిన్ డీని ఉత్పత్తి చేస్తుందన్న మాట. కనీసం 15 నుంచి 20 నిమిషాల పాటు సూర్యరశ్మి శరీరానికి నేరుగా సోకడం అవసరం.



ఏమిటీ నిజమేనా..

కప్పు చాయ్ రూ. 1,000

'నిలోఫర్'లో మళ్లీ అందుబాటులోకి 'గోల్డెన్ టిప్స్'టీ

అస్సాంలో ఇటీవలి వేలంలో కిలో పొడిని రికార్డు స్థాయిలో రూ. 1,15,000కి దక్కించుకున్న కేఫ్ యాజమాన్యం

ప్రపంచంలోకెల్లా అత్యంత నాణ్యమైన టీ పొడిగా గుర్తింపు

సాక్షి, హైదరాబాద్

భాగ్యనగరంలో ఇరానీ చాయ్ ఎంత ఫేమసో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా పాతబస్తీలో లభించే ఇరానీ చాయ్ రుచి దేనికీ రాదు. ఎవరైనా ఒక్క కప్పు తాగితే వన్స్‌మోర్ అనాల్సిందే. దీని ధర సాధారణ కేఫ్‌లలో రూ. 20 వరకు ఉంటే కాస్త పెద్ద హోటల్‌లో రూ. 50 దాకా ఉండొచ్చు. అదే ఫైవ్‌స్టార్ హోటల్‌లో సుమారు రూ. 200 పలకొచ్చు. కానీ నగరంలోని ప్రఖ్యాత నిలోఫర్ కేఫ్‌లో లభిస్తున్న ఓ ప్రత్యేకమైన చాయ్ ధర అక్షరాలా రూ. వెయ్యి పలుకుతోంది! ఏమి'టీ' అంత ధరా అని ఆశ్చర్యపోతున్నారా? ధరకు తగ్గట్టే దాని రుచి కూడా అమోఘంగా ఉంటుందట. అందుకే భారీ ధర ఉన్నప్పటికీ దాని డిమాండ్ కూడా అదే రేంజ్‌లో ఉందట.

అరుదైన రకం... క్లిష్టమైన సేకరణ ప్రక్రియ



మనోహరి గోల్డ్ రకానికి చెందిన అరుదైన 'గోల్డెన్ టిప్స్' చాయ్ పేరుకు తగ్గట్లే ముదురు బంగారు వర్ణంలో ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి వేసే చాయ్ పత్తా అత్యంత ఖరీదైనదని కాబట్టే దీని ధర సైతం ఆ స్థాయిలో పలుకుతుంది. చలికాలమంతా ఈ రకం మొక్కలు నిద్రాణస్థితిలో ఉన్నప్పటికీ నేల నుంచి అధిక పోషకాలను గ్రహిస్తూ వసంత కాలం మొదలవగానే మొగ్గతొడుగుతాయి. ఈ క్రమంలో పోషకాలను ఎక్కువగా తొలుత ఏర్పడే మొగ్గల్లో నిక్షిప్తం చేస్తాయి. ఈ మొగ్గల్లో కెఫీన్ తోపాటు అధిక మోతాదులో విటమిన్లు ఏ, బీ, సీ, ఈ, కే, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఎల్–థియనైన్ అనే అమైనో యాసిడ్ సైతం ఉంటుంది. ఆయా మొగ్గలు సూర్యకాంతి తగిలి ఆకులుగా విచ్చుకొనే లోగానే (విచ్చుకుంటే ఆకుల రుచి, సువాసన మారుతుంది) తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6 గంటల్లోగా వాటిని తెంపి వెంటనే పొడి చేసే ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

దిగుబడి ఏటా కొన్ని కిలోలే...

ఏటా ఒకసారే సాగు చేసే ఈ తోటల్లోని ఒక్కో మొక్క నుంచి వచ్చే మొట్టమొదటి మొగ్గలోనే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఈ లెక్కన మొత్తం తోటలోంచి సుమారు ఒకటిన్నర కిలోల మొగ్గలు మాత్రమే లభిస్తాయి. అందుకే వాటి నుంచి తయారు చేసే పొడికి అత్యధిక ధర లభిస్తుంది. ప్రపంచంలోకెల్లా అత్యంత నాణ్యమైన టీపొడిగా దీనికి గుర్తింపు ఉంది. పైగా ఈ చాయ్ పొడిని వేలంలోనే దక్కించుకోవాలి. ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన వేలంలో కిలో టీ పొడిని రూ. 1,15,000 రికార్డు ధరకు నిలోఫర్ కేఫ్ యాజమాన్యం కొనుగోలు చేసింది.

టీలో పాలు కలపం..

ప్రత్యేకమైన ఈ టీలో పాలు కలపం. డికాషన్‌రూపంలో తాగితేనే దీని రుచి తెలుస్తుంది. ఈ టీ తాగే వారు అద్భుతమైన అనుభూతికి లోనవుతారు. దీని రుచి వేరే టీలకు రాదు. ఒక కప్పు టీలో కేవలం 4 గ్రాముల పొడినే కలుపుతాం. బంజారాహిల్స్, హిమాయత్‌నగర్‌లతోపాటు లక్డీకాపూల్‌లోని కొత్త కేఫ్‌లో ఈ చాయ్‌ను మా మెనూలో తిరిగి ప్రవేశపెట్టాం. చాయ్ ప్రేమికుల నుంచి స్పందన బాగుంది.

– బాబూరావు, కేఫ్ నిలోఫర్ యజమాని

శాస్త్రవేత్తలు పరిపాలనాదక్షులుగా మారాలి..

అందుకే పాలనలో శిక్షణ

- కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి
- అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో ప్రారంభం
- ఫలితాల ఆధారంగా దేశవ్యాప్త విస్తరణ



సాక్షి, హైదరాబాద్: దేశంలోని శాస్త్రవేత్తలు పరిపాలనా దక్షులుగానూ మారేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అందులో భాగంగానే 'లీడర్‌షిప్ ఫర్ సైంటిస్ట్ అడ్మినిస్ట్రేటర్స్'శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, అడ్మినిస్ట్రేటర్ల మధ్య ఒక అంతరం ఉందన్నారు. ఐఏఎస్‌లు ఏదో ఒక దశలో పరిశోధన సంస్థలకు నేతృత్వం వహించాల్సి వస్తుందనీ కానీ వారికి ఆయా అంశాలపై అవగాహన తక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. అలాగే శాస్త్రవేత్తలు కూడా సంస్థలకు నేతృత్వం వహించాల్సి వచ్చినప్పుడు పరిపాలన సంబంధిత విషయాలపై అవగాహన లేకుండా ఉంటారని అన్నారు. ఈ అంతరాన్ని నివారించే లక్ష్యంతోనే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించే ఆలోచన ఉందని చెప్పారు. స్వాతంత్య్ర శతాబ్ది ఉత్సవాల సమయానికి దేశం శాస్త్ర రంగంలో శిఖర స్థాయికి చేరుకునేలా.. మధ్యాదాయ దేశంగా ఎదిగేలా చేసేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.

జియోస్పేటియల్ టెక్నాలజీల్లో శిక్షణ

టెక్నాలజీ ఆధారిత పాలనను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం సివిల్ సర్వెంట్లకు కూడా అత్యాధునిక జియో స్పేటియల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. డ్రోన్ సర్వేలు మొదలుకొని మ్యాపింగ్, జీఐఎస్, భూ సర్వే, డిజిటల్ మ్యాపింగ్, లైడర్ మ్యాపింగ్ వంటి అంశాల్లో సివిల్ సర్వెంట్స్‌కు శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐజీఎస్‌టీ) సంస్థను సందర్శించిన మంత్రి అక్కడ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. నేషనల్ జియో స్పేటియల్ పాలసీ (2022)కు అనుగుణంగా జియోస్పేటియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో పలు ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇవన్నీ ఐజీఓటీ కర్మయోగి ప్లాట్‌ఫార్మ్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ విధానంలో భాగంగా ఎన్ఐజీఎస్‌టీని అత్యున్నత నైపుణ్య కేంద్రంగా మార్చనున్నామన్నారు. ఎన్ఐజీఎస్‌టీ సంస్థ పునర్నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ సంస్థ విస్తరణ, అభివృద్ధి, శిక్షణ నాణ్యతల్లో మార్పులు, చేర్పులు చేపడతామని వివరించారు. పౌర సేవల విషయంలో ఎన్ఐజీఎస్‌టీ అత్యంత కీలకమైన పాత్ర పోషించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఐజీఎస్‌టీలోని వసతులన్నింటినీ సందర్శించిన మంత్రి అక్కడ సిబ్బందితో పాటు శిక్షణ పొందుతున్న వారితో ముచ్చటించారు. కోర్సుల గురించి సంస్థ ఉన్నతాధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

నేర పరిశోధనలో జాగిలాల పాత్ర కీలకం

- పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్
- ఆకట్టుకున్న జాగిలాల విన్యాసాలు
- ఉత్తమ ప్రతిభ కనబరచిన జాగిలాలు, శిక్షకులకు బహుమతులు



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాద నిర్మూలన, నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ అన్నారు. ప్రముఖుల భద్రత విధుల్లోనూ జాగిలాలు అద్భుతంగా పని చేస్తున్నాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో గురువారం నిర్వహించిన పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన జితేందర్, జాగిలాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మొత్తం 48 పోలీస్ జాగిలాలు, 64 మంది జాగిలాల శిక్షకులు (హ్యాండ్లర్స్) ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో ఉండే ప్రముఖుల వ్యక్తిగత భద్రతలో పోలీస్ జాగిలాలు అత్యంత కీలకం అన్నారు. మందుపాతరల గుర్తింపు, వెలికితీత, నక్సలిజం కట్టడిలోనూ జాగిలాలు ముందుండి పని చేస్తాయన్నారు. తుర్కియేలో సంభవించిన భూకంపంలో శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడడంలోనూ శునకాలు కీలక పాత్ర వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నేర పరిశోధన, నేరస్తులకు శిక్ష పడడంలో తెలంగాణ పోలీస్ దేశంలోని ఇతర రాష్ట్రాలకన్నా ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఐఐటీఏ శిక్షణ కేంద్రంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన జాగిలాలకు కూడా శిక్షణను అందిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డీజీ అనిల్ కుమార్ తెలిపారు. శిక్షణ కేంద్రంలో జాగిలాలతోపాటు ఇప్పటి వరకు దాదాపు 9 వేల మంది డాగ్ హ్యాండ్లర్ లకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. పాసింగ్ అవుట్ పరేడ్ ప్రదర్శనలో భాగంగా జాగిలాలు బాంబులను గుర్తించడం, వాటిని తొలగించడం, అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, అక్రమ మద్యం గుర్తింపు, నీటిలో, మంటల గుండా విన్యాసాలు చేయడం, తాళ్లపై నడవడం.. వంటి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జాగిలాలు, వాటి హ్యాండ్లర్లకు ముఖ్య కార్యదర్శి జితేందర్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇంటెలిజెన్స్ విభాగం డీఐజీ తౌఫిక్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.